# తెలుగు జ్యోతి

## తెలుగు కళా సమితి వారి

సంక్రాంతి ప్రత్యేక సంచిక - జనవరి - ఫిబ్రవరి 2020




**Telugu Jyothi**
January - February 20

A Literary Magazine from
**Telugu Fine Arts Society**



సిలికానాంధ్ర మ న బ డి
( WASC గుర్తింపు పొందిన ఏకైక తెలుగు విద్యాలయం)
ACCREDITED
10+ దేశాలు
30+ రాష్ట్రాలు
250+ ప్రాంతాలు
తెలుగు
చదవడం
వ్రాయడం
మాట్లాడడం
నేర్చుకోండి
12 సం॥లు
55000+
విద్యార్థులు
1500+
భాషాసేవకులు
గుర్తింపు
• పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం గుర్తింపు
• అమెరికాలోని వివిధ స్కూల్ డిస్ట్రిక్ట్‌లలో ప్రపంచభాషగా (World Language Credit) గుర్తింపు
• ప్రఖ్యాత WASC సంస్థచే గుర్తింపు
పరీక్షలు
• ప్రకాశం, ప్రభాసం విద్యార్థులకు విశ్వవిద్యాలయం పరీక్షలు
• సుశిక్షితులైన ఉపాధ్యాయులచే శిక్షణ
కార్యక్రమాలు
• పిల్లల పండుగ, తెలుగు మాట్లాట, బాలానందం, మనపద్యం, తెలుగుకుపరుగు, పలుకుబడి, పద్యనాటకం, నాటకోత్సవం, బాలరంజని(మొబైల్ యాప్).....
మనబడిలో చేర్పించండి!
తెలుగుభాష నేర్పించండి!!
Join ManaBadi - Learn Telugu
తెలుగు కళా సమితి (న్యూ జెర్సీ)
కుటుంబ సభ్యులందరికీ
దీపావళి శుభాకాంక్షలు!
తరగతులు
బాలబడి | ప్రవేశం | ప్రసూనం
ప్రకాశం | ప్రమోదం | ప్రభాసం
4-6 సం॥ - బాలబడి
6+ సం ॥ - ప్రవేశం
Visit : manabadi.siliconandhra.org
Email : manabadi@siliconandhra.org
Contact: 1-844-626-BADI (2234)
Follow us on : /SiliconAndhraManaBadi

# తెలుగు కళా సమితి

# Telugu Fine Arts Society, Inc.

A tax exempt and not for profit corporation: Tax Id# 22-2534166
9 Yardley Ct, Franklin Park, NJ 08823: **http://www.tfas.net**


**Board of Trustees 2018-2020**

**President**
**Sudhaker Uppala**
9 Yardley Ct,
Franklin Park, NJ 08823
(732) 491-6503
*president@tfas.net*

**Vice President**
**Ranga Madisetty**
5 Woodbury Ct,
Edison, NJ 08820
(732) 470-7055
*vicepresident@tfas.net*

**Secretary**
**Madhu Rachakulla**
14 Clemmens Ct
Edison, NJ 08820
(913) 220-9172
*secretary@tfas.net*

**Treasurer**
**Renu Tadepalli**
12 Mistflower Lane
Princeton Jn, NJ 08550
(732) 539-2848
*treasurer@tfas.net*

**Membership Services**
**Damu Gedala**
(856) 577-7112
*membership@tfas.net*

**Cultural & IT Services**
**Venu Yeluri**
(908) 397-7914
**Prameela Gopu**
(732) 670-6575
*events@tfas.net*
*it@tfas.net*

**Youth Services**
**Jyothi Gandi**
(732) 208-9599
*youth@tfas.net*

**Community Services**
**Usha Darisipudi**
(732) 718-4184
*community@tfas.net*

**Advisors**
**Anand Paluri (Chair)**
**Sudhaker Rayapudi**
**Ram Kolluri**
**Dr. Janani Krishna**
**Hari Eppanapally**

**Telugu Jyothi**
**Vignan Kumar Utukuri**
Editor




## అధ్యక్షుని కలం నుండి...

తెలుగు కళా సమితి సభ్యులకు, శ్రేయోభిలాషులందరికీ నూతన సంవత్సర మరియు సంక్రాంతి శుభాకాంక్షలు. ప్రకృతి కరుణయో లేదా ప్రకృతి వైపరీత్యమో తెలియదు గాని, ఈ చలి కాలంలో మంచు కురవడం లేదు, ఉష్ణోగ్రతలు కూడా ఎక్కువే ఉన్నాయి. ఈ చక్కని వాతావరణంలో మీరంతా సంక్రాంతి పండగ ఆనందంగా జరుపుకొన్నారని అనుకొంటున్నాను.

మరి ఈ సంచిక విషయానికొస్తే, మన తెలుగు జ్యోతి కార్యవర్గం ఎన్నో చక్కటి కథలు, కవితలు ఈ సంచికలో పొందుపరిచారు. ఈ సంచికలో పుటలు పెంచి, సాహిత్యానికి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చాము. అలాగే డిసెంబర్ లో జరిగిన అష్టావధానం వివరాలు, విశేషాలు పొందుపరిచాము. ఎన్నో సంవత్సరాల తరువాత న్యూజర్సీలో తెలుగు కళా సమితి ఆధ్వర్యంలో అష్టావధానం దిగ్విజయమగా జరిగింది. ఈ కార్యక్రమం ఆమోఘంగా జరగడానికి తోడ్పడిన పృచ్చకులకు, తన పాండిత్య ప్రతిభతో మెప్పించిన శతావధాని డా. రాంభొట్ల పార్వతీశ్వర శర్మ గారికి నా నమోవాకములు.

నవంబర్ తెలుగు కళా సమితి దీపావళి సంబరాలు అద్భుతంగా జరిగాయి. సంగీత దర్శకులు శ్రీ కోటి గారు మరియు అతని బృందం సభికులను సమ్మోహన పరిచారు. ఈ కార్యక్రమం దిగ్విజయం కావడానికి తోడ్పడిన దాతలకు, స్వచ్ఛంద సేవకులకు మరియు నా తోటి కార్యావర్గానికి నా కృతజ్ఞతలు. ఈ సంబరాల విశేషాలు, చిత్ర మాలికలు ఈ సంచికలో పొందుపరిచాము. అలాగే దీపావళి ఆటల పోటీల, నృత్య, సంగీత పోటీల చిత్ర మాలికలు, విజేతల వివరాలు ఈ సంచికలో ఉన్నాయి.

మా కార్యవర్గం యొక్క కాల వ్యవధి ఈ ఏప్రిల్ తో ముగుస్తోంది. తరువాయి కార్యవర్గం కోసం ఎన్నికలు ప్రకటించ బడ్డాయి. పదహారు మంది సభ్యులు తొమ్మిది స్థానముల కొరకు పోటీ పడుతున్నారు. సభ్యులందరికీ బ్యాలట్ పేపర్ లు ఫిబ్రవరి మధ్యలో రాబోతున్నాయి. మీరందరూ వారి వారి సామర్థ్యాలను, అనుభవాలను చూసి చక్కటి క్రొత్త కార్యవర్గాన్ని ఎన్నుకోవాలని నా విన్నపం.

మార్చి 15 నాడు జరగనున్న త్రిమూర్తి ఉత్సవాలకు విచ్చేసి ఈ శాస్త్రీయ సంగీత కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా కోరుతున్నాను.

మీ విమర్శలని, సలహాలని పంపించాలని నా మనవి.

మీ

అనంత సుధాకర్ ఉప్పల

అధ్యక్షులు, తెలుగు కళా సమితి

# విషయ సూచిక


అధ్యక్షుని కలం నుండి 3

సంపాదకీయం 5

మా సంక్రాంతి : యలమర్తి అనూరాధ 8

రైలు : దినవహి సత్యవతి 8

ఉత్తరాధిపతి : సింహప్రసాద్ 12

డా. రాంభొట్ల పార్వతీశ్వర శర్మ గారి అష్టావధానం 21

ఇప్పుడు ఎక్కడ చూసినా మౌనమే : చొక్కర తాతారావు 25

ఈనాటి కుటుంబం : భావరాజు భారతి 26

నీకు నేను! నాకు నువ్వు :చాగంటి ప్రసాద్ 30

కవచం : పి. వి. శేషారత్నం 36

మళ్లీ మొలకెత్తాలని : గొర్తి వాణీ శ్రీనివాస్ 40

మనసును తాకిన పరిమళం : గుమ్మా నాగమంజరి 41

జాబిలికూన! : దమయంతి 46


## From TFAS Events ( Sept - Nov 2019)


దీపావళి సంబరాలు : నివేదిక 9, 10

డా. రాంభొట్ల పార్వతీశ్వర శర్మ గారి అష్టావధానం : విశేషాలు, చిత్రమాలిక 21- 25

తెలుగు కళా సమితి దీపావళి (2019) సంబరాలు : చిత్ర మాలిక 27, 29

తెలుగు కళా సమితి దీపావళి (2019) : నృత్య, సంగీత, క్రీడా పోటీలు : చిత్ర మాలిక 31

TFAS Deepavali 2019 Cultural Competition Winners 44

TFAS Deepavali 2019 Sports Competition Winners 45


**Opinions expressed in this volume are those of the authors and not of TFAS**

# సంపాదకీయం



సమ్యక్ క్రాంతి, సంక్రాంతి. వెల్తురూ, వేడీ, పగటి పొడుగూ అన్నీ ఇక పెఱిగే కాలం, పంట చేతికొచ్చే కాలం సంక్రాంతి. ఆంధ్రులకి మకర సంక్రాంతి, పెద్ద పండగ, అస్సాంలో మాఘ బిహు, పంజాబ్ లో లోహ్రి, తమిళ్నాడులో పొంగల్, ఉత్తరఖండ్ లో ఘుఘూటి, ఎన్నెన్నో పేర్లూ, మఱెన్నో ఆచారాలు. అన్ని రాష్ట్రాల వారూ ఏదో విధంగా మకర సంక్రమణం అనీ ఉత్తరాయణ పుణ్య కాలం వచ్చిందనీ పండగగా జఱుపుకుంటారు. మఱి సంవత్సరంలో దీర్ఘమైన రాత్రి (winter solstice), సూర్యుడు ఉత్తరానికి తిఱిగి బయలుదేరేదీ డిశంబరు 21 కదా, జనవరి 14న ఏమిటవుతుందీ, అన్న సందేహం నన్ను చాలా కాలం పీకుతుండేది. ఈ సంక్రాంతి శుభ సందర్భంగా దాన్ని గుఱించి పరిశీలిస్తే అర్థమైనదిది: ఖగోళ శాస్త్రపు లెక్కల్లో సాయన పద్ధతీ, నిరాయన పద్ధతీ అని రెండు పద్ధతులున్నాయట. నాకు అర్థమైనంత వఱకూ సాయన పద్ధతిలో భూ పరిభ్రమణాక్షమే ముఖ్యాధారమట, నిరాయన పద్ధతిలో నక్షత్ర మండలం ముఖ్యాధారమట. మనం పాటించే నిరాయన పద్ధతి లో సూర్యుడు మకర రాశి లో ప్రవేశించేది సంక్రాంతి నాడు. ఆ రోజు మకర సంక్రాంతి, ఉత్తరాయణ ప్రారంభం. సూర్యుడు తిఱిగి ఉత్తరానికి ప్రయాణం అవ్వడం నిజానికి జఱిగేది డిశంబరు 21న, అది సాయన పద్ధతి లో ఉత్తరాయణ ప్రారంభం. ఈ రెండూ ఒక రోజు కాదు. వాటి తేడా మెల్లిగా మారుతూంటుందట, క్రీ శ 185 లో ఈ రెండు సంఘటనలూ ఒక రోజే జఱిగాయట, అలా మళ్ళీ ఓ 28,000 సంవత్సరాల తరువాత ఒకే రోజు జఱుగుతాయట.

ఇఛ్ఛా మృత్యు వరమున్న భీష్మ పితామహుడు ఉత్తరాయణ పుణ్య కాలం వచ్చిన తరువాత తన తనువు చాలించాడట. ఆ కాలంలో ఈ రెండు రోజులకీ ఎంత తేడా ఉండేదీ, ఆ మరణం జఱిగింది మకర సంక్రాంతి రోజా, winter solstice రోజా అని పరిశోధిద్దామనుకుంటే ఆ పరిశోధనకి ఆధారాలు ఏవీ దొఱకవు. చీకటి ఖండం Dark Continent అనుకునే ఆఫ్రికా లో కూడా ఎన్నో చారిత్రిక శిధిలాలూ వాళ్ళ చరిత్రకి ఆధారాలు కనిపిస్తాయి కానీ మన చరిత్ర లో దానికే కాదు చాలా విషయాలకి ఆధారాలు దొఱకవు.

నిజానికి ఈ చర్చ అవసరమా, ఏదైతే ఏమిటీ, మన తక్షణ కర్తవ్యం మన వర్తమాన పరిస్థితి అనుకుని జీవితం గడుపుకోవడం ఒక పద్ధతి. అలాగనుకుని ఈ సంచికకొద్దాం.

యలమర్తి అనూరాధ <u>గారి</u> 'మా సంక్రాంతి' <u>గేయం</u> చిన్నప్పటి (మా బాపట్ల లాంటి) చిన్న ఊళ్ళో సంక్రాంతి జ్ఞప్తికి తెస్తుంది. దినవహి సత్యవతి గారి 'రైలు' గేయం: తమ మానాన ప్రయాణీకులని మోసుకు పోయే ఆ రైళ్ళు సవ్యంగా నడవడానికి ఆ లక్షలాది ఉద్యోగులంతా ఎన్ని పాట్లు పడతారో, Railway Department వాళ్ళు చెప్పిన కథలు గుర్తొచ్చాయి. సింహప్రసాద్ గారి 'ఉత్తరాధిపతి' కథ 'శరీరమాద్యం ఖలు ధర్మ సాధనం' అన్న మహా కవి కాళిదాసు ప్రవచనం సవ్యమైన జీవనాధారం అనిపిస్తుంది. చొక్కర తాతా రావు గారి 'ఇప్పుడు ఎక్కడ చూసినా మౌనమే' గేయం: మనం నిజంగా అంత నిస్సహాయ స్థితిలో ఉన్నామా, అని ఎవరికి వారు బేరీజు వేసుకోవాల్సిన అగత్యం ఉన్నదనిపిస్తుంది.

భావరాజు భారతి గారి 'ఈ నాటి కుటుంబం' కథ: జీవితాన్ని చర చర నడిపింది చరవాణీ, మనిషిని తన గుప్పిటి చెరసాల లో నిలిపింది చరవాణీ. పి. వి. శేషారత్నం గారి 'కవచం కథ': ధర్మం శరణం గఛ్ఛామి, ధర్మానికి కట్టుబడ్డప్పుడే సంఘం సంఘంగా నిలుస్తుంది. గొర్తి వాణీ శ్రీనివాస్ గారి 'మళ్ళీ మొలకెత్తాలని' గేయం చదువుతూంటే పాతకాలపు పాట, వహీదా రహ్మాన్ కి పేరు తెచ్చిన నృత్యం, 'ఏరువాకా సాగారోరన్నన్నో చిన్నన్నా' గుర్తొచ్చింది. గుమ్మా నాగమంజరి గారి 'మనసున తాకిన పరిమళం' కథ: చిన్నారి రవి మనసున గుభాళించింది దేశ భక్తి పరిమళం. దమయంతి గారి 'జాబిలికూన' లో వెంకట్ కి ప్రస్తుత భాషలో Autism Spectrum Disorder ఉన్నదేమో సుమా? చాగంటి ప్రసాద్ గారి నీకు నేనూ, నాకు నువ్వూ: శైశవం నుండి వార్ధక్యం దాకా మనిషి సంఘ జీవి. మనిషికి సాన్నిహిత్యం, సాంగత్యం ఎంత అవసరమో కదా?

## సంపాదక వర్గం

**ఊటుకూరి విజ్ఞాన్ కుమార్ (సంపాదకులు), లంకా వేంకట కృష్ణా రావు,**

**బొగ్గవరపు లవ కుశ, తాడేపల్లి కుమార్, సంగుభొట్ల లత**

**తెలుగు కళా సమితి ప్రతినిధులు**


**దరిసిపూడి ఉష (ఉప-సంపాదకులు ), గండి జ్యోతి**

# తెలుగు కళా సమితి

# Telugu Fine Arts Society

A 501 (c) Non Profit Org, Tax ID : 22-2534166, www.tfasnj.org

**New Jersey**



# సంక్రాంతి సంబరాలు

# *Sankranthi Sambaralu*

**On January 26, 2020 (Sunday) from 9.00 am to 4.00 pm**

**Tagore Hall, Ananda Mandir, 269 Cedar Grove Lane, Somerset NJ 08873**





**Special Sessions for High School Students & Parents**

- Holistic approach to successfully applying to Colleges
- 7 Steps to SAT & ACT success

## COMPETITIONS

- Sankranthi Vantalu (Cooking)
- Rangoli (Muggulu)
- Posters/Collage
- Fancy Dress
- Telugu Text Reading
- Telugu Poem Recital
- Telugu Speaking



## OPEN GROUP PARTICIPATION

- **Vocal** *(Folk, Light Music, Classical)*
- **Dances** *(Semi-classical, Classical, Folk, Movie)*
- **Telugu Skits** *(Group of minimum 4 required for the above categories)*
- **Bommala Koluvu**

digitalaya • +91 9246578478

***Prizes for all Competitions***

**Register at : www.tfas.net**

**Recycle used batteries**
With **RecycleMyBattery** team

**For additional details contact:**

Sudhaker Uppala 732 491 6503 • Ranga Madisetty 973 207 0132 • Madhu Rachakulla 913 220 9172 • Renu Tadepalli 848 248 7285
Damu Gedala 856 577 7112 • Prameela Gopu 732 670 6575 • Venu Yeluri 908 397 7914 • Jyothi Gandi 732 208 9599 • Usha Darisipudi 732 718 4184

NEW YORK LIFE

Media Partners

mana tv · TV5 NEWS · TV9 · GK TV · TV ASIA · Dhoom Media Pittsburgh 1150 AM · TNI · NTV · TELUGU NRI RADIO · YOYO TV · USA 1 TV · SUNRISE TV

# Telugu Fine Arts Society

## Board of Trustees : 2018 - 2020



**Sudhaker Uppala**
President



**Ranga Madisetty**
Vice President



**Madhu Rachakulla**
Secretary



**Renu Tadepalli**
Treasurer



**Venu Yeluri**
Cultural & IT Chair



**Prameela Gopu**
Cultural & IT Chair



**Jyothi Gandi**
Youth Chair



**Damu Gedala**
Membership Chair



**Usha Darisipudi**
Community Chair

## Advisory Board



**Anand Paluri**
Chair



**Ram Kolluri**
Member



**Sudhakar Rayapudi**
Member



**Dr. Janani Krishna**
Member



**Hari Eppanapally**
Member

## Telugu Jyothi

**Vignana Kumar Utukuri**
Editor



# మా సంక్రాంతి
## యలమర్తి అనూరాధ

సిరిని మూటగట్టుకొని వచ్చే పండగ

పల్లెసోయగం నెమలిలా  పురివిప్పే తరుణం

ముగ్గుల్లో గొబ్బెమ్మలు బంతులు వయ్యారిభామల్లా హడావిడి

సన్నాయి రాగాల ఆలాపన అరుదైన సంగీత రవళి హరిదాసుల కీర్తనలు వీనులకింపైన స్వర సంగమం

కన్నెపిల్లల కలలు నిజమయ్యే శుభతరుణం ఉత్సవాల ఊరేగింపులు

కోడి పందాల సందడి ఆకాశాన హరివిల్లులా ఎగిరే గాలిపటాల ఊయలలు

అనురాగాలు ఆప్యాయతలు కలబోసే కౌగిళ్ళు

పిల్లలు పెద్దలు కలిసి చిన్న పిల్లలయ్యే సందడి సౌరభం

బహుమతులు వెల్లువలా కురిపించే సమయం

నవ్వుల పువ్వులు పూయించే పరిమళాల సుగంధం

దూర తీరాలలో ఉన్న నలుగురునీ కలిపే సంబరం ఎన్నెన్నో అనుభూతుల జ్ఞాపకాలను మిగిల్చే అరుదైన అనుభవం

సంక్రాంతి క్రాంతి అంటేనే జీవితాలకు వెలుగుల సంకేతం

************

# రైలు,
## దినవహి సత్యవతి

కులమతాల ఆధిక్యతకు ప్రాధాన్యత నివ్వక

బీదకు గొప్పకూ నడుమ తారతమ్యమెంచక

ఆరోగ్యవంతుడికీ రోగికీ మధ్యన భేదభావమెంచక

అందరినీ ఒకటిగా తనతో కలుపుకుని కదిలిపోయే...రైలు

రేయీపవలూ లక్షల విలువైన సామగ్రిని గమ్యానికి చేరవేస్తూ

అనునిత్యమూ లక్షకుమించి కిలోమీటర్ల లక్ష్యాన్ని ఛేధిస్తూ

ప్రయాణీకుల పయనం సురక్షితంగా జరగాలని కాంక్షిస్తూ

తన సేవలను మరలా వినియోగించుకోమని కోరుకునే ...రైలు

మానవ తప్పిదాల వలనా, ప్రకృతి వైపరీత్యాల వలనా

జరిగే పెను ప్రమాదాలతో కలిగే అపార  ప్రాణ నష్టానికి

తనని బాధ్యురాలిని చేయవద్దని సవినయంగా మనవిచేస్తూ

తనని శ్రద్ధగా చూస్తే మనల్ని భద్రంగా గమ్యస్థానం చేరుస్తాననే..రైలు

ఎన్నటికీ ఒక్కటవ్వలేని సమాంతర పట్టాలపై నిరంతరంగా పరుగులిడుతూ

ఎప్పటికీ తన వేగాన్ని అందుకోలేని చెట్టూ చేమలను వెనుక వదిలివేస్తూ

ఎక్కీ దిగే వేలకొలదీ ప్రయాణికులను వారి వారి గమ్యాలకు  చేరుస్తూ

మానవుని ఎనలేని అద్భుత ఆవిష్కరణలలో మిన్నగా నిలచిన...రైలు

# తెలుగు కళా సమితి

# Telugu Fine Arts Society

A 501 (c) Non Profit Org, Tax ID : 22-2534166, www.tfasnj.org

**New Jersey**

*Cordially invites you to celebrate*

**Registration open on Feb 6**

# Trimurthy Day Celebrations



**On March 15, 2020 (Sunday) from 8:30am to 5:00 pm**

**Tagore Hall (Ananda Mandir)**
**269 Cedar Grove Lane, Somerset, NJ 08873**

**Rendition of Select Sri Shyama Sastri's Navaratnamalika Krithis** by:
Smt. Bhuvana Kannan & Students,
Aparaajit Sriram - Mridangam

**Concert on Sri Dikshitar Compositions**
Mrs. Suchitra Srinivas - Vocal
Mrs. Indira Rajesh - Violin
Mr. Guruswami Iyer - Mridangam

**Rendition of Select Sri Thyagaraja's Lalgudi Pancharatna Krithis** by:
Smt. Kalyani Ramani & Students'
Neha Krishnamachary-Violin
Shridhar Parthasarathy-Mridangam

*Free Admission*

**Registration opens on Feb 6, 2020**

**Register at : www.tfas.net**

**For additional details contact:**

Simanthini Kouta 908 234 1360 • Prabha Raghunathan 908 234 2546
Sudhaker Uppala 732 491 6503 • Ranga Madisetty 973 207 0132 • Madhu Rachakulla 913 220 9172 • Renu Tadepalli 848 248 7285
Damu Gedala 856 577 7112 • Prameela Gopu 732 670 6575 • Venu Yeluri 908 397 7914 • Jyothi Gandi 732 208 9599 • Usha Darisipudi 732 718 4184

digitalaya • +91 9246578478

# అంగరంగ వైభవంగా జరిగిన తెలుగు కళా సమితి, న్యూజెర్సీ వారి దీపావళి సంబరాలు




న్యూజెర్సీ తెలుగు వారు దీపావళి (2019) సంబరాలను శనివారం, నవంబర్ 16న తెలుగు కళా సమితి కార్య వర్గం ఆధ్వర్యంలో స్థానిక ఈస్ట్ బ్రౌన్స్ విక్ మిడిల్ స్కూల్, న్యూజెర్సీలో ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. అంగరంగ వైభవంగా, కన్నులవిందుగా జరిగిన ఈ కార్యక్రమంలో ఈ సంబరాలకు విచ్చేసిన తెలుగు వారిని తెలుగు కళా సమితి అధ్యక్షులు శ్రీ సుధాకర్ ఉప్పలగారు సాదరంగా అహ్వానించారు. దాదాపు 1200 మంది తెలుగు వారు పాల్గొని పండుగ వాతావరణాన్ని సృష్టించారు. ప్రముఖ సినీ సంగీత దర్శకుడు శ్రీ కోటి గారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేశారు. తెలుగు కళా సమితి కార్య వర్గం జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభించారు.

ఈ సందర్భంగా తెలుగు కళా సమితి అధ్యక్షులు శ్రీ సుధాకర్ ఉప్పల గారు కార్యక్రమానికి వచ్చిన వారందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు కళా సమితి చేపడుతున్న ప్రతి కార్యక్రమానికి తెలుగువారి నుంచి పూర్తి మద్దతు లభిస్తోందని ఇదే స్ఫూర్తితో మరిన్ని కార్యక్రమాలు చేపడతామని ఆయన తెలిపారు. సమితి కార్యవర్గం చేస్తున్న సాహితీ, సాంస్కృతిక మరియు సంఘ సేవలను వివరించారు. కార్యదర్శి శ్రీ మధు రాచకుళ్ల తె. క. స. కార్యవర్గాన్ని సభికులకు పరిచయం చేశారు.

సాంస్కృతిక కార్యదర్శులు శ్రీ వేణు యేలూరి, శ్రీమతి ప్రమీల గోపు ఆధ్వర్యంలో సాగిన సాంస్కృతిక కార్యక్రమాలు, స్థానిక కళాకారులతో నిర్వహించిన స్వరాభిషేకం సభికులను ఎంతగానో అలరించాయి. ఘనంగా జరిగిన ఈ సంబరాలలో 250లకు పైగా స్థానిక కళాకారులు వేదికపై ప్రదర్శించి అందరినీ ఆకట్టుకున్నారు. కమ్యూనిటీ కార్యదర్శి శ్రీమతి ఉషా దరిసిపూడి, యువజన కార్యదర్శి శ్రీమతి జ్యోతి గండి మరియు తెలుగుజ్యోతి సంపాదకులు శ్రీ విజ్ఞాన్ కుమార్ గారి ఆధ్వర్యంలో సాహిత్య కార్యక్రమం, తెలుగు పద్యాల పోటీలు జరిగాయి. యువజన కార్యదర్శి శ్రీమతి జ్యోతి గండి ఆధ్వర్యంలో తెలుగు కళా సమితి వారి యువత పలు విభాగాలలో సేవలు అందించారు. కమ్యూనిటీ కార్యదర్శి శ్రీ మతి ఉషా దరిసిపూడి గారు వెండర్స్ నిర్వహణను సమర్ధవంతంగా నిర్వహించారు.

మధ్యాహ్న కార్యక్రమాల అనంతరం, సాయత్రం ఆరు గంటలకు తెలుగు కళా సమితి ట్రస్టీ శ్రీదాము గేదెల గారి ఆధ్వర్యంలో షడ్రసోపేతమయిన విందుభోజనంతో సాయంత్రం కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి.

విందు అనంతరం శ్రీమతి గిరిజ కొల్లూరి గారు స్వరపరిచిన దీపావళి బృంద గానాన్ని 30 మంది పైగా స్థానిక గాయకులు వేదికపై ఆలపించి సభికులను ఆనందింప జేశారు.

శ్రీ కోటి గారు, న్యూజెర్సీ ఎస్పి బ్రదర్స్ గా ప్రసిద్ధులైన శ్రీ శ్రీకాంత్ సందుగు, శ్రీ ప్రసాద్ సింహాద్రి, ప్రముఖ గాయనీమణులు శిల్ప రావు, సుమంగళి బృందం పలు సినీ గీతాలను ఆలపించి ప్రేక్షకులను ఓలలాడించారు. శ్రీ మెహర్ చంటి గారి బృందం వాద్య సహకారాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో శ్రీ కోటి గారు తన హుషారైన పాటలతో,

మాటలతో ఆహుతులను హుషారు పరిచారు. ప్రేక్షకుల హర్షధ్వానాలు, చప్పట్లతో వేదిక ప్రాంగణం మార్మోగిపోయింది. ప్రముఖ మిమిక్రీ కళా కారుడు, 'ఇమిటేషన్ రాజు' హాస్య భరితమైన మిమిక్రి, శబ్దాల అనుకరణతో ప్రేక్షకులను మురిపించారు. సాహిత్య వింజమూరి వ్యాఖ్యానం, ఇమిటేషన్ రాజుతో కలిసి చేసిన నాట్యం అందరినీ ఎంతో అలరించింది.

ఈ సందర్భంగా తెలుగు కళా సమితికి మరియు తెలుగు వారికి సేవ చేస్తున్న వారికి ప్రత్యేక పురస్కారాలు అందజేశారు. శ్రీ TP శ్రీనివాస రావు గారు, శ్రీ సీతాల రామకృష్ణ గారు మరియు శ్రీ తీవన్ (న్యూయార్క్ లైఫ్ ) గార్లు ఈ పురస్కారాన్ని అందుకొన్నారు. అలాగే ఎన్నో వేల మంది విద్యార్థులను భారత నాట్యం మరియు కూచిపూడి నృత్యంలో నిష్ణాతులను చేసిన ప్రముఖ గురువులకు ప్రత్యేక పురస్కారాలను అందజేశారు. శ్రీమతి సుధ దేవులపల్లి, శ్రీమతి దివ్య ఏలూరి, శ్రీమతి ఇందిర రెడ్డి మరియు శ్రీమతి శ్రీలక్ష్మి పర్చ గార్లు ఈ పురస్కారాలను అందుకొన్నారు. ఈ సందర్భంగా దీపావళి సంబరాలకు ధన సహాయం చేసిన దాతలకు, వివిధ సంస్థలకు కార్యవర్గ సభ్యులు సన్మానం చేశారు. ముఖ్య దాతలు NATS మరియు TATA నాయకులకు తమ కృతజ్ఞతలు తెలియ జేశారు.

తెలుగు కళా సమితి కార్య వర్గం, సలహాదారులు, ప్రముఖ వేద పండితులు శ్రీ రఘు శర్మ శంకరమంచి గారి అశీర్వచనంతో ముఖ్య అతిథి శ్రీ కోటి గారికి సన్మానం నిర్వహించి ప్రత్యేక పురస్కారం అందచేసారు. ఈ సందర్భంగా కోటి మాట్లాడుతూ తనకు లభించే ప్రతిఫల, సత్కారాలు, అభినందనలు తన తండ్రి రాజేశ్వరరావు, గురువు చక్రవర్తికే దక్కుతాయని అన్నారు. సంగీత కళాకారుడిగా పుట్టడం, వేలాది పాటలకు స్వరకల్పన చేయడం, ఇంతటి స్థాయికి రావడానికి కారణమైన తన గురువు శ్రీ చక్రవర్తి గారికి కృతజ్ఞతలని అన్నారు. తెలుగు కళా సమితి కార్యవర్గం ఈ వేడుకలను బాగా నిర్వహించిందని, సంప్రదాయాన్ని మరచిపోకుండా కార్యక్రమాలను నిర్వహిస్తున్నందుకు వక్తలంతా తెలుగు కళా సమితిను అభినందించారు.

కోశాధికారి శ్రీమతి రేణు తాడేపల్లి గారు ఈ దీపావళి కార్యక్రమం టిక్కట్లు అమ్మకం, రిజిస్ట్రేషన్ డెస్కు నిర్వహణను సమర్థవంతంగా నిర్వహించారు. ఈ దీపావళి వేదికను అలంకరించిన శ్రీమతి రజని సింగతి గారిని, సౌండ్ సిస్టమ్ ఏర్పాటు చేసిన శ్రీ సాలు జేమ్స్ గారిని, ఈ దీపావళి వేడుకలను చక్కగా చిత్రీకరించిన ఫోటోగ్రాఫర్ ఆనంద్ గారిని మరియు రుచికరమైన భోజనం అందించిన దక్షిన్ రెస్టారెంటు వారికి తెలుగు కళా సమితి కార్యవర్గం ప్రత్యేకంగా ధన్యవాదములు తెలియచేసింది.

మీడియా ప్రతినిధులుగా శ్రీ శ్రీధర్ చిల్లర, శ్రీ విలాస్ జంబుల, శ్రీ గోపి తాటి వ్యవహరించారు. చివరిగా కొత్తగా చేరిన సభ్యులకు, స్వచ్ఛంద సేవకులకు మరియు ఈ కార్యక్రమానికి హాజరైన సభ్యులకు, కార్యవర్గానికి, ధన సహకారాన్నందిస్తున్న దాతలకు కార్యదర్శి మధు రాచకుళ్ళ ధన్యవాదాలు చెపుతూ జనగణమన జాతీయగీతంతో కార్యక్రమాన్ని ముగించారు.



# ఉత్తరాధిపతి

## – సింహప్రసాద్

"మా నాన్నంత స్వార్థపరుడు ఈ భూప్రపం-చంలో ఎక్కడా ఉండడు" ఉత్తరాన్ని కసిగా చింపి ముక్కల్ని విసిరేస్తూ అన్నాను.

"మళ్ళీ డబ్బు పంపమని రాశారా?" సరళ అడిగింది.

"తనకేం బాగోలేదని కొత్త పాట ఎత్తుకున్నారు. డబ్బు కోసం మరీ ఇంతగా దిగజారతారనుకోలేదు"

"ఆ సంగతి మన పెళ్ళై కాపురానికొచ్చిన తొలిరోజుల్లోనే గ్రహించాను. అప్పట్నుంచి నెత్తీ నోరూ కొట్టుకుంటూ చెబుతూనే ఉన్నాను. మీరు నా మాట వింటేగా. మా నాన్న, మా నాన్న అంటూ వెనకేసుకొచ్చారు. ఇన్నేళ్ళకి మీకు తెలిసొచ్చింది!" అక్కసు వెళ్ళ గక్కింది సరళ.

"అరె. మరీ ఇంత దారుణమా. బొత్తిగా ఇంగిత జ్ఞానం లేకపోతే ఎలా. ఈ రోజుల్లో తల్లిదండ్రులు చచ్చారో బతికారో పట్టించుకునే వాళ్ళే కరువయ్యారు. అలాంటిది ఆయనకి పెన్షన్ వస్తున్నా సరే నేను నెల నెలా వెయ్యో, రెండు వేలో పంపిస్తున్నాను. ఆ మనిషికి కృతజ్ఞత వుండొద్దూ. ఇంకా ఇంకా పంపు ఎడం చేత్తోనూ దానధర్మాలు చేసేస్తానంటే ఎలా చచ్చేది? ఊరోళ్ళ మెప్పు కోసం నన్నింకా ఇంకా దోచేస్తానంటే ఎలా?"

"అదేం కాదు లెండి. పట్నంలో కొడుక్కి పెద్ద ఇల్లు ఉంది. ఇంటి వెనుక పెద్ద పెరడు ఉంది. ఆ పెరట్లో పెద్ద చెట్టు ఉంది. ఆ చెట్టుకి సీజన్తో సంబంధం లేకుండా ఏడాది పొడుగునా రూపాయలు కాస్తూ ఉంటాయని ఆయన గారి గట్టి నమ్మకం!"

"అలాగే వుంది వరస. అసలు సంపాదించిందంతా దోచి పెట్టెయాలంటే ఎలా కుదుర్తుందీ. మనకీ పిల్లలున్నారుగా. వాళ్ళ చదువులకే బోలెడు ఖర్చవుతోంది. ఆయనకేం, ఇంత పంపు అంత పంపు అంటూ ఓ కార్డు ముక్క రాసి పారేస్తారు!" నిరసనగా అన్నాను.

"ఈ కాలంలో కూడా ఇలా ఉత్తరాలు రాసే వాళ్ళని ఈయన్నే చూశాను. బుల్లి కార్డులో ఓ పెద్ద కథ రాసేస్తారు. ఆ గొలుసు కట్టు రాత చదివి అర్థం చేసుకునే సరికే తలపోటు వస్తుంది!"

"దానికేం లే. అది ఆయన అలవాటు. ఉత్తరం రాస్తేనే ఆయనకి తృప్తి..."

నాన్న ఉత్తరాల్లోంచి జాలు వారే ప్రేమాభిమానాలు గుర్తు చేసుకుంటూ అన్నాను. నిజానికి అవి ఎన్ని సార్లు చదివినా ఏదో తెలీని స్పర్శానుభూతి కలుగు తూంటుంది. గుండె గోడల్ని తడుముతుంది!

"ఇంకా ఆ గొడవ సాగదీసుకోవడం ఎందుకు లెండి. ఆ కార్డు రాలేదనుకుని మర్చిపోండి"

"పాయింటేనేవ్. డబ్బు పంపలేదేమని అడిగితే అసలా ఉత్తరమే రాలేదని బుకాయించొచ్చు" తేలిగ్గా నిట్టూరుస్తూ అన్నాను.

ఇది వరకు మా నాన్న మరీ ఇంత దాఋణంగా ఉండేవారు కాదు. ఏమైందో ఏంటో చాలా రాక్షసంగా మారిపోయారు.

"ఉద్యోగం రాగానే, నువ్వు సంపాదనా పరుడివి అయినందుకు చాలా సంతోషంగా ఉందిరా. నువ్విక ప్రయోజనా పరుడివి కావాలి" అన్నారు నా భుజం తడుతూ.

"నేనిప్పుడు ప్రభుత్వోద్యోగిని నాన్నా. ప్రజలకు రకరకాల సేవలు అందివ్వడమే నా బాధ్యత"

"అది జీతం తీసుకున్నందుకు నిర్వర్తిస్తున్న కర్తవ్యం. దాన్ని సేవ అనకూడదు. ఇక నువ్వీ స్థితిలో స్థాయిలో ఉండటానిక్కారణం మన చుట్టూ ఉన్న సమాజం. మనం తినడానికి సుఖంగా బ్రతకడానికి ఎన్నో రకాల సేవలూ, సౌకర్యాలూ అందిస్తోన్న జనం. మనం వాళ్ళకి తిరిగి కొంతైనా ఇవ్వాలి. దాన్నే సామాజిక ఋణం తీర్చుకోవడం అంటారు పెద్దలు. అది ఋణంగా గాక సామాజిక బాధ్యతగా మీ యువతరం భావించి నిర్వర్తించాలి. అప్పుడే సర్వజనాభివృద్ధి జరుగుతుంది"

"అంటే ఏం చేయాలంటారు? ఎవ్వరూ లేని అనాథౌలకి అన్నదానం చేస్తూ కూర్చోవాలంటారా?" నా మాటల్లోకి కించిత్తు వ్యంగ్యం తోసుకొచ్చింది.

"భూమ్మీద ఇంకో మనిషి ఉన్నంతకాలం ఏ మనిషీ అనాథ కాదు, కాకూడదు. నేను నీకు, నువ్వు ఇంకొకరికి, ఆ ఇంకొకరు మరొకరికి చేయూత నివ్వాలి. అప్పుడింక సమాజంలో అభాగ్యులు అన్నార్తులు ఉండనే ఉండరు"

"నేనేమీ సేవా కార్యకర్తని కాదు"

నాన్న చిన్నగా నవ్వారు. "సమాజపు సౌభాగ్యం నీలాంటి యువకుల భుజస్కంధాల మీద ఉందిరా. ఇనుప కండరాల, ఉక్కు నరాల యువకులు వజ్ర సంకల్పిస్తే ఏదైనా సాధించగలరన్నారు వివేకానందుడు"

"సరేలెండి. ఇప్పుడే కదా ఉద్యోగం వచ్చింది. స్థిరపడ్డాక, నేనూ మీ అంత అయ్యాక ఆ సాయాలేవో చెస్తాన్లెండి..."


"ఎప్పుడో కాదు ఇప్పుడే చెయ్యాలి. నువ్వే కాదు, నీ లాంటి యువకులంతా ఒక బాధ్యతగా ఒక నిష్ఠగా ఒక యజ్ఞంలా మనస్ఫూర్తిగా చేయాలి. యువత పూనుకుని తలో చెయ్యా వేస్తే, మీ మీ సంపాదనల్లోంచి కొంత అభాగ్యులకూ దీనులకూ వినియోగిస్తే ఈ సమాజంలో చాలా గొప్ప మార్పు వస్తుందిరా..."

"చూద్దాంలే నాన్నా..."

"విత్తనం మొక్క అయితేనే దాని అస్తిత్వానికి విలువ. సమాజానికి

With Best Compliments from

## Dr. Mohan Patalolla & Family



---

With Best Compliments from

## Amara Family



ప్రయోజనం. నువ్వు నీ సంపాదనలో 10 శాతం అనాథాశ్రమానికి పంపించు. వాళ్ళు మరికొందరికి నీరు పోసి నిలదొక్కుకునేలా చేస్తారు"

ఆయన్తో వాదించడం ఇష్టంలేక, "సరేలెండి" అని తప్పించుకున్నాను.

కాని ఆ మరుసటి నెల నుంచే "పంపేవా, పంపేవా" అని పీకుతుంటే ఒక నెల పంపి నాలుగు నెలలు ఎగ్గొడుతూ వచ్చాను. ఆయనకి తెలుస్తుందేవిట్లే అని పంపకుండానే పంపానని అబద్ధమాడాను.

ఆయన అనాథ శరణాలయానికెళ్ళి చెక్ చేస్తారని ఊహించలేకపోయాను.

"నేను పెంచి పోషించిన మొక్క తన పండ్లు తనే తినాలని ఆశ పడుతుందనీ, అందు కోసం అబద్ధాలాడటానికీ సిద్దపడుతుందనీ ఊహించలేక పోతున్నాన్రా" అన్నారు వేదనగా.

"ఇక నుంచి పంపుతాన్లే"

"తిన్నగా నాకు పంపు. రసీదులు నీకు అందేలా చూస్తాను"

మరేమీ అనలేక అయిష్టంగా అంగీకరించాను.

నాకు బోలెడు పెళ్లి సంబంధాలొచ్చాయి. భారీగా కట్నం ఇస్తామనీ వచ్చారు. సహోద్యోగులూ చక్కని సంబంధాలు తీసుకొచ్చారు.

కట్నం సొమ్ముతో ఇంటి స్థలం కొనుక్కోవచ్చనీ, తాపీగా స్వంతిల్లు కట్టుకోవచ్చనీ కన్న నా కలల్ని వమ్ము చేస్తూ పేదింటి సరళని నాకు కట్టబెట్టారు నాన్న. తూతూ మంత్రంగా పెళ్ళి జరిపించారు. పేద సాదలందరికీ అన్నదానం చెయ్యడం ఒక్కటే కాస్తంత ఓదార్పు!

మా నాన్నంటే సరళకి మొదట్లో ఎంతో గౌరవం ఉండేది. మరెంతో కృతజ్ఞతగా ఉండేది. కాని మాకు బిడ్డ పుట్టాక, ఖర్చులు పెరిగాక కూడా పదిశాతం దానధర్మాలు చెయ్యమనడం బొత్తిగా నచ్చలేదు.

"మనకు మిగిలిన దాంట్లోంచి కొంచెం దానం చెయ్యొచ్చుగాని మన కడుపులు మాడ్చుకుని, ఖర్చులు కుదించుకుని చేయడం తనకుమాలిన ధర్మం కాదా మావయ్యాగారూ" అని అడిగిందొకసారి

"సంతృప్తి లేకపోతే ఎంత ఉన్నా ఎంత వస్తున్నా సరిపోదమ్మా. ఇంతే వస్తోంది. ఇంతలోనే తృప్తిగా గడుపుకోవాలనుకుంటే సరిపోవడమే కాదు ఇంకా మిగులుతుంది. మనం ఎక్కి వచ్చిన మెట్లని ఎవరూ ఎప్పుడూ మరచిపోకూడదు తల్లీ" అన్నారు.

దెప్పి పొడుస్తున్నారని అర్ధమైంది. ఆ తర్వాత నుంచి మా నాన్నని సరళ కూడా విమర్శించడం మొదలెట్టింది.

నాకు ప్రమోషన్ వచ్చింది. వార్త చెప్పగానే అభినందించడం పోయి, "జీతం ఎంత పెరుగుతుందీ" అనడిగారు

గొప్పగా చెప్పాను.

"ఇక నుంచి పెరిగిన జీతంలోంచి 10 శాతం పంపించు. ఇంకా ఎక్కువ పంపగలిగితే ఇంకా మంచిది రా అబ్బాయ్" అన్నారు.

గొంతులో పచ్చి వెలక్కాయ పడింది. "10% కంటే ఎక్కువ పంపలేను. మేమూ ఇంట్లోకి చాలా సమకూర్చుకోవాలి. చదువులకీ ఆసుపత్రి ఖర్చులకీ కొంత నిలవేసుకోవద్దూ" అని కట్ చేశాను.

ఆ తర్వాతెన్నడూ జీతం ఎంత పెరిగినా నాన్నకి తెలీనివ్వలేదు. ఆయన కన్పిస్తే చాలు బీదార్పులు అరవడం మొదలెట్టాను. ఇక సరళ ఎన్నడూ ఆయన ముందు నగల్తో ఖరీదైన చీరల్తో తిరగలేదు.

"మన బాగు చూసి ఓర్వలేరు. పాపిష్టి కళ్ళు" అని తిట్టిపోయ సాగింది సరళ.

ఆయన పద్ధతి నచ్చకే ఆయనదగ్గరి కెళ్ళడం, రావడం ఎంచుమించు మానేశాం. మనవణ్ణీ, మనవరాల్నీ చూడాలన్పించినప్పుడల్లా అమ్మా నాన్నా వచ్చి చూసి రెండ్రోజులుండి వెళ్ళిపోయేవారు.

ఆ రెండ్రోజులూ ముళ్ళ మీద కూర్చున్నట్టుగా ఉగ్గబట్టుకుని ఉండేవాళ్ళం. ధర్మపన్నాలు చెప్పబోతే అర్జంటు పని అంటూ ఏవో పేపర్లు ముందేసుకునేవాణ్ణి.

ఏదోలా ఆయన్ని తప్పించుకుంటూ బతుకు తున్నాం. ఆ కటింగూ ఈ కటింగూ పోను చేతికెంతో రావట్లేదని గునుస్తూ నెల నెలా మూడు వేలు "తద్దినం" సమర్పించుకుంటున్నాం.

అయినా నాన్నకి తృప్తి లేదు తమకి ఆ అవసరం ఉంది, ఈ అవసరం ఉంది, ఫలానా వాళ్ళకి కాని రోగం వచ్చింది, పక్కింటి వారబ్బాయికి ఆపరేషన్ చెయ్యాలి - అంటూ తరచూ అంతో ఇంతో అదనంగా పంపమని కార్డు ముక్క గీకి పారేస్తూనే ఉన్నారు.

"ఇంకా దాని గురించే ఆలోచిస్తున్నారా?" నాలో నేను రగిలిపోతుంటే సరళ అడిగింది.

"ఇలాంటి నాన్న పగవాడిక్కూడా ఉండకూడదు" నిస్పృహగా అన్నాను.

"పగవాళ్ళ సంగతలా ఉంచండి. మనకి మాత్రం ఆయన బతికి వున్నన్నాళ్ళూ ఈ పీడ భరించక తప్పేట్టు లేదు"

"అంతకంటే ఏం చేయగలంలే"


"పోనీ ఓ పని చేస్తే?"

సాలోచనగా చూశాను.

"నాకో పిల్లలకో పెద్ద రోగం వచ్చిందనీ, బోలేడు ఖర్చు అవుతుందనీ చెప్పి నెల నెలా వూరికే అనాథాశ్రమానికి పంపుతోంది ఆపేద్దాం?"

"ప్చ్. లాభం లేదు. ఆయన తిరుగుటపాలో వచ్చేసి టెస్టులూ రిపోర్టులూ తిరగేస్తానంటారు. తెలిసిన డాక్టర్ల దగ్గరకి తీసుకుపోయి నానా హడావిడీ చేస్తారు. మా నాన్న టీచర్గా వెలగ బెట్టారుగా. ఆయన శిష్యులు అన్నిచోట్లా ఉన్నారు. వారిలో డాక్టర్లూ ఉన్నారు"

"మరైతే ఆయన హరీమనే వరకూ తప్పదా?"


Travel Bag
5:26
Travel Bag
Mobile
Password
Forgot Password?
SIGN IN
Don't have account ? SIGNUP
Domestic or International Travellers Network Across 195 Countries
looking for travel companion for your parents coming from india?
Send or Receive Medicine, Documents, Phones, Laptop to your beloved ones In India or USA?
Traveling to India or USA and have some empty space in your suitecase to carry items?
App Store
Google Play
Don't worry Travel Bag App Is here to solve all your problems

తల అడ్డంగా ఊపాను. "ఎవరి గొడవలు వాళ్ళు చూసుకోడానికే టైం చాలక అంతా కిందా మీదా అయిపోతోంటే ఈయన ఊళ్ళో సమస్యలు నెత్తినేసుకుని ఎందుకు ఊరేగుతారో తెలీదు" అక్కసుగా అన్నాను.

"గొప్ప కోసం! అందరి చేతా పొగిడించుకోవాలన్న దురద!"

"అలాగే వుంది వరస..."

"ఆ గోలకేం గాని వచ్చేవారమే అక్షయ తృతీయ. ఈ సారి నాకు చంద్రహారం కొనాల్సిందే" మొండిగా అంది సరళ.

"నాన్నకి సుస్తీగా ఉందన్నా డబ్బు పంపకుండా మనం బంగారం కొనుక్కుంటే బాగోదేమోనే"

"మనది అక్షయం, ఆయనది క్షయం. ఇప్పటి దాకా చేసింది చాలు లెండి ఇంకా ఇంకా ఇల్లు తవ్వి ఆయన మొఖాన పోసేస్తానంటే నేను చూస్తూ ఊరుకోను"

"ఛా ఛా నేనిస్తాననటం లేదే. ఇప్పటికే చాలా చేశాను. నెల నెలా ఎవరూ చేయనంత సాయం చేస్తున్నా దాని గురించి కాదు. నాన్నకి మొండి చెయ్యిచూపి మనం బంగారం కొనుక్కోవడం - ఎందుకో ఇబ్బందిగా అన్పిస్తోంది"

"మీ నాన్న దగ్గర్నుంచి కార్డు ముక్క వస్తే చాలు మీ మనసు పాడైపోతుంది. సినిమాకెళ్దాం పదండి. మహర్షి సినిమా చూపించమని పిల్లలూ గొడవ చేస్తున్నారు. సినిమా చూసి హోటల్లో భోంచేసి వద్దాం పదండి. ఫ్రెష్ గాలి తగిలితే మీకు తేలిగ్గా తేటగా ఉంటుంది"

"అదీ నిజమేలే. పిల్లల్ని రెడీ చెయ్యి..."

రెస్టారెంట్లో 5 రకాల ఐటెమ్స్ ఆర్డరిచ్చాం. అంతా ఉత్సాహంగా కబుర్లు చెప్పుకుంటూ తింటోంటే నాన్న గుర్తొచ్చారు. నా పెదాలు వంకరయ్యాయి.

"ఇప్పుడు మా నాన్న మనల్నిలా చూస్తే గుండెలు బాదేసుకుంటారు. తన ప్రాణానికి ముప్పొచ్చేంత ఖర్చులొచ్చి పడ్డాయంటూ వెయ్యో రెండు వేలో అర్జంటుగా పంపమంటారు" నవ్వాను.

"అసలు తప్పు ఆయన్ది కాదు, మీది. మీ జీతభత్యాల గురించి పూసగుచ్చినట్టు ఆయనకి చెప్పేస్తారు. ఎంత కన్న వాళ్ళైనా నిజం చెబితే కళ్ళు కుట్టకుండా ఎలా వుంటాయి!"

"ఈ మధ్య అదే చేస్తున్నాలే. మంచి తనానికివి రోజులు కావని కట్టుకథలూ పిట్టకథలూ చెప్పి తప్పించుకుంటున్నా"

"అలాంటి వాళ్ళకి అదే తగిన శాస్తి. డబ్బు వాళ్ళ మోహానా, వీళ్ళ మోహానా కొట్టే కన్నా మన పిల్లల కోసం ఉపయోగిద్దాం. సినిమా చూపించి, హోటల్లో కోరిన ఫుడ్ పెట్టించే సరికి వాళ్ళెంత సంబరంగా ఉన్నారో చూడండి. వాళ్ళ ఆనందం కన్నా మనకింకేం కావాలి చెప్పండి!"

ఆవిడతో ఏకీభవిస్తూ తలాడించాను.

ఆఫీసు నుంచి వచ్చి ఇంట్లో అడుగుపెడుతోంటే మా ఊర్నుంచి ఫోన్ వచ్చింది. వార్త చెవినబడే సరికి దు:ఖం కట్టలు త్రెంచుకుంది. బావురుమంటూ కూలబడ్డాను.

"ఏమైందండీ..."

"మా నాన్న... మా నాన్న చనిపోయారంట..."

"మైగాడ్. ఇంత హఠాత్తుగా అసలెలా పోయారంట?"

"హార్ట్ ఎటాక్ అంటున్నారు. ఈ మధ్య ఆరోగ్యం బావోటం లేదుట"

"హు. అందరి గొడవలూ నెత్తినెసుకుంటే అలాటివే వస్తాయి!" నిరసనగా అంది.

"చాలు చాల్లే. పోయినాయన గురించి ఒక్క మాట చెడుగా అన్నా నేను భరించలేను. నీకు తెలీదు సరళా. ఇప్పుడంటే పచ్చి స్వార్థపరుడిలా మారిపోయారు గాని నా చిన్నప్పుడు ఎంత చక్కగా సరదాగా ఉండేవారనీ. నేను ఏం అడిగినా సరే క్షణాల్లో తెచ్చిచ్చేవారు. నా ప్రోగ్రెస్ రిపోర్టు చూసి ఎంత మురిసిపోయేవారనీ, నువ్విలాగే బాగా చదివి గొప్పవాడి వవ్వాలి. అన్నిటా గొప్పవాడన్పించుకోవాలి. పదుగురికి నీడనిచ్చే చెట్టువి కావాలి- అనేవారు!"

"మీకు మీ అమ్మగారితో కంటే నాన్న గారితోనే ఎటాచ్‌మెంట్ ఎక్కువనుకుంటా"

"అదీ నిజమే. తిండికి తప్ప మిగతా అన్నిటికీ నాన్న మీదే ఆధారపడేవాణ్ణి. బంధువులు నాన్న కూచి అనేవారు తెలుసా. అలాంటి నాన్న ఇక లేరంటే భరించలేకపోతున్నాను. గుండెలు బ్రద్దలైపోతున్నాయి..."

"పండిన కాయ అయినా మనిషి అయినా రాలిపోవాల్సిందే. ఎలాంటి వారికైనా చావు తప్పదు. మీరేదేదో ఊహించుకుని బెంబేలు పడొద్దు. నిత్యం లోకంలో జరిగేదే కాని ఇప్పుడు కొత్తగా మనింట్లో జరిగింది కాదు. గుండె రాయి చేసుకోండి..."

"అస్వస్థతగా ఉందంటూ డబ్బు పంపమని నాన్న ఉత్తరం రాసినా పంపలేక పోయిన పాపాత్ముణ్ణి..." చెంపలు వాయించుకున్నాను.

"చాల్లెద్దురూ. ఇలా జరుగుద్దని కలగన్నారా ఏవిటి!"

"మా నాన్న..."

"మీ నాన్నే గాని ఇప్పుడు కర్మకాండలకి మీ నెత్తి మీదకి ఎంత ఖర్చొచ్చి పడుతుందో ఆలోచించారా? అన్నట్టు ఇప్పుడు మనం బయల్దేరి ఆ పల్లెటూరికెళ్ళాలా?"

"వెళ్ళాలి. ముఖ్యమైనవి సర్దు... 15 రోజుల దాకా అక్కడే ఉండాల్సొస్తుంది"

"ఒక్కడే కొడుకువి కదాని అంతా ఎక్కేస్తారు. వారి మాటలకు

PLATINUM

# LET US HELP YOUR DREAM COME TRUE

**1430 OAK TREE ROAD, STE-7**

**ISELIN, NJ 08830**

**OFFICE: 732-515-2997 CELL: 732-208-4389**

## ARE YOU THINKING OF BUYING OR SELLING YOUR BUSINESS, COMMERAL AND RESIDENTIAL IN NEW JERSEY AND PENSYLVANIA.

**We give you our best service for all your**

**REAL ESTATE/RESIDENTIAL/COMMERCIAL NEEDS**

PLEASE CONTACT **RAO** : 732-515-2997/ 732-208-4389

---

You're in good hands.

**Venkat Malladi**
Agency Owner
Astute Financial Services, LLC

**Allstate Insurance Company**
123 Morris Street
Morristown, NJ 07960

Office 9736319700
Cell 7322667983
Fax 9735389022
venkatmalladi@allstate.com
www.allstate.com/venkatmalladi



**Your trusted Allstate advisor**

ఉబ్బిపోయి కర్మకాండలు భారీగా చెయ్యొద్దు. మనం ఆ ఊళ్ళో ఉండేదీ లేదు పెట్టేదీ లేదు. ఎవర్నీ పట్టించుకోనక్కర్లేదు. ఎంత సింపుల్‌గా వీలైతే అంత సింపుల్‌గా చేసెయ్యండి"

"అమ్మ ఏమంటుందో..."

"ఏమీ అనరు. ఆవిడకిలాంటి విషయాలు సరిగ్గా తెలీవు. తొందరపడి ఆవిడ్ని ఇక్కడికి తీసుకు వచ్చేరు సుమా. చాకిరీ చెయ్యడం నా వల్ల కాదు"

"ఆ ఊరు ఆ ఇల్లూ వదిలి రాదులే..."

"ఏం చెబుతాం. ఒంటరిగా ఉండాటానికి భయపడొచ్చుగా!"

అమ్మ సంగతేమోగాని నా గుండెలు భయంతో మూల్గాయి.

అమ్మ నా దగ్గరికొస్తే ఖర్చు తడిసి మోపెడవుతుంది. ఎప్పుడూ ఏదో రోగాలంటూ ఏకరువు పెడుతూనే ఉంటుంది ఆవిడ పెన్షన్ మందులకే చాలదు. పైగా బోలెడు చాకిరీ చెయ్యాలి. పాపం సరళ అసలే పిల్లల్తో నెగ్గుకు రావడానికి నానా యాతన పడుతోంది. తన నెత్తి మీద మరింత బరువు పెట్టడం సమంజసం కాదు!

ప్రయాణానికి అన్నీ సిద్ధం చేసి అంది. "నేనెందుకు మళ్ళీ మళ్ళీ చెబుతున్నానో వినండి. ఎలాంటి కొత్త బరువులూ ఎత్తుకోవద్దు. ఇక నుంచి ఇది వరకట్లా నెల నెలా దానధర్మాలకి డబ్బు పంపలేమని ఎవరా వూసెత్తినా తెగేసి చెప్పేయండి. మీమీద ఒత్తిడి తేవడానికెవరూ సరిపోరు"

అదీ నిజమే - అనుకుంటూ తలాడించాను. నాన్న పోరు పడలేకే ఆదాయంలో కొంత పంపిస్తున్నాను. నాన్నే లేకపోయాక ఇంకెవరికీ పైసా విదల్చాల్సిన పనే లేదు!

తెల తెలవారుతూండగా రైలు దిగాం. ఆటో స్టాండ్ వైపెళ్తోంటే ఒక ఆటో ఎదురొచ్చింది.

"రండి అబ్బాయిగారూ, మీ కోసమే చూస్తున్నా..." ఆటో అతను అన్నాడు.

మౌనంగా ఎక్కి సామాను సర్దుకుని కూర్చున్నాం.

దారి పొడవునా నాన్నని దేవుడంటూ పొగుడుతూనే ఉన్నాడు.

ఆటో దిగుతూ డబ్బివ్వడానికి పర్సు తీశాను. "వద్దు ఉంచండి, ఈ జీవనాధారం చూపింది నాన్నగారేనండి. ఇది కొనుక్కోడానికి తమరూ ఓ చేయి వేశారు. మీ దయ వల్ల చల్లగా బతుకుతున్నాం" చేతులు జోడించి దణ్ణం పెట్టాడు.

నేను పంపిన డబ్బులో కొంత నాన్న ఇతడికి ఇచ్చాడని అర్థమైంది.

గుండెల్లో ఆనందం గజ్జె కట్టి గంతేసింది.

ఇంటి కెళ్ళాం. హాలులో తాటాకు చాపమీద నాన్న భౌతిక కాయాన్ని పడుకోబెట్టారు. నన్ను చూసి ఘొల్లుమంది అమ్మ. నాకూ ఏడుపు ఆగలేదు.

మెల్లగా ఊళ్ళో వాళ్ళొచ్చారు. శవయాత్ర కేర్పాట్లు మొదలెట్టారు.

"ఇతగాడు మా పెదనాన్న కొడుకే కాదు. ఇతడు తల కొరివి పెట్టడానికి వీల్లేదు. ఇంటిపేరు వాణ్ణీ, కొడుకు వరసయ్యేవాణ్ణి- నేనే పెట్టాలి" అంటూ గొడవపెట్టాడు మా కజిన్.

అతడి మాటలు అర్థం గాక నివ్వెరబోయాను. అయోమయంగా చూశాను.

"ఆస్తి కాజేద్దామని భలే ఎత్తు వేశావురా" అతడి మీదకి ఊరంతా ఒక్కటై ఒంటికాలు మీద లేచింది.

దాంతో అతడు గమ్మునుండిపోయాడు. అతడెందుకు నా గురించలా మాట్లాడుతున్నాడో నాకు బొత్తిగా బోధపడలేదు. అమ్మని అడిగి సంగతి కనుక్కోవాలనుకున్నాను.

శ్మశానానికి ఊరంతా కదిలి వచ్చింది. శవ దహనానికీ దానికీ చాలా ఖర్చు అయి వుంటుంది. అయినా ఎవరూ నన్ను ఒక్క రూపాయి అడగలేదు. అంతా తలో చేయీ వేశారు!

గుండెలు ఆర్ద్రమయ్యాయి.

మనిషి కోరుకోవాల్సింది ఏమిటో మిగిలేదీ ఏమిటో తెలిసొస్తోంది!

నాన్నని నేను సరిగ్గా అర్థం చేసుకోలేక పోయానా?

నాలో తలెత్తిన ఆత్మ విమర్శ.

దాన్ని అడ్డంగా అణిచేసి ఇతర పనుల్లో పడ్డాను.

మర్నాడు ఒకతను ఒక చిన్న అమ్మాయిని తీసుకొచ్చాడు. "నీ చదువుకి సాయం చేస్తోంది ఈయనే. కాళ్ళకి దణ్ణం పెట్టి ఆశీస్సులు తీసుకో" అన్నాడు.

ఆ అమ్మాయి వచ్చి నాకు పాదాభివందనం చేస్తోంటే ఏదో వింతైన భావం నన్ను కుదిపేసింది.

నేను పంపిన డబ్బుకి నాన్న మరి కొంత జోడించి, నాపేరు మీదనే అందరికీ సాయం చేశారన్నమాట. అందుకనే వాళ్ళని నేను ఎరక్కపోయినా అంతా ఎంతో అభిమానం కురిపిస్తున్నారన్న మాట!

కర్మకాండలన్నీ యథావిధిగా పూర్తయ్యాయి.

ఊరివాళ్ళు కొందరొచ్చి "మీ నాన్నగారి స్థానాన్ని మీరు భర్తీ చేయాలి. అందరికీ ఆప్తుడిగా ఆపద్బాంధవుడిగా నిలవాలి" అని అర్థించారు.

"సారీ. నెనెక్కడో సిటీలో ఉంటాను. ఉద్యోగం, భార్య, పిల్లలు ఉన్నారు. వాటితోనే నాకు సరిపోతుంది. ఇటు తొంగి చూడటం నాకు కుదర్దు. నమస్తే." నిర్ద్వంద్వంగా తిరస్కరించాను

వాళ్ళు తీవ్ర ఆశాభంగానికి లోనయ్యారు. నా వంక అదోలా

**With Best Compliments from**




With Best Wishes from



# Dr. Satyaveni Rao

# &

# Late Dr. Srinivasa K Rao

చూసి వెళ్ళిపోయారు.

వారి చూపులు నన్ను కలవరపరిచినా మెల్లగా సర్ది చెప్పుకున్నాను.

అంతదాకా ఒకటి రెండు మాటలు మించి మాట్లాడని అమ్మ ఆ రాత్రి నన్ను పిలిచి పక్కన కూర్చోబెట్టుకుంది.

"నీ కిక్కడే బావుంటుందని నాకు తెలుసమ్మా. ఊరితో, ఊరి వాళ్ళతో నీకున్న అనుబంధం అలాంటిది. వాటికి నిన్ను దూరం చెయ్యాలనుకోవట్లేదు. సిటీకి తీసుకెళ్ళి నిన్ను ఇబ్బంది పెట్టాలనీ అనుకోవట్లేదు. నువ్వు ఇదివరకట్లానే ఉందువుగాని. ఇక్కడే ఉందువుగాని" ఉపోద్ఘాతాలకు తావులేకుండా నా అభిప్రాయం సూటిగా చెప్పేశాను.

"నా గురించి కాదు మీనాన్న గురించి ఆలోచించరా. ఆయనకే కాదు ఆయన ఆశయాలకూ నువ్వు వారసుడివి కావాలి. ఆయన అందరికీ చెప్పే మాటని నువ్వు ఆచరించి చూపాలి. ఎప్పట్లానే నెల నెలా ఎంతో కొంత పక్కనపెట్టి బాధితులకీ బడుగులకీ సాయం చెయ్యి. నీకు సాధ్యమైనంత చేయూతనియ్యి. నలుగురూ నిలదొక్కుకునేందుకు కాసిని నీళ్ళుపొయ్"

"నాన్న నాకు లక్షల ఆస్తులేమీ ఇచ్చి పోలేదు. నీకు ఫ్యామిలీ పెన్షనైనా వస్తుంది. నాకు రెక్కలు తప్ప ఏమీ లేవు. ఇదివరకు చేసిందే ఎక్కువ. ఇక నేనేమీ ఇవ్వలేను" ఖరాఖండీగా చెప్పాను.

"ఎంత చెట్టుకు అంత గాలి అనీ మాకు తగ్గ ఖర్చులూ సమస్యలూ ఇబ్బందులూ మాకూ ఉంటాయి. ఎడం చేత్తో దానాలు చేస్తూ పోవడానికి మా పెరట్లో డబ్బు చెట్టు ఏమీ లేదు" కల్పించుకుని అంది సరళ.

"సాయం చేయడానిక్కావాల్సింది డబ్బు చెట్టు కాదమ్మా మంచి మనస్సు. అదే నిన్నీ ఇంటికి కోడల్ని చేసిందని మర్చిపోకు..."

అమ్మ మాటలకు మూతి ముడిచింది సరళ.

"అవన్నీ దెప్పుకోవడం అనవసరం. మా పరిస్థితి చెప్పాను. ఇక డిస్కషన్ అనవసరం. రేపే వెళ్లిపోతున్నాం" విసురుగా లేచాను.

అమ్మ నిలువునా ఓడిపోయినట్టు బాధగా వేదనగా నావంక చూసింది. కళ్ళనీళ్ళతో నిరాశగా చూస్తూండిపోయింది.

మర్నాడు మేం బయలుదేరుతోంటే ఒక పెద్దాయన వచ్చాడు.

"ఏరా అబ్బాయ్. నీ గురించి నలుగురూ నాలుగు రకాలుగా చెబుతున్నారు. నువ్వు నిజంగానే పెద్దవాడివైపోయినట్టున్నావే"

ఆయన మాటల్లోని వ్యంగ్యం అర్థమవుతున్నా, "మీరేమనుకున్నా నా స్థాయి మీరనుకుంటున్నదాని కన్నా పెద్దదే" అన్నాను.

"చాలా సంతోషంరా అబ్బాయ్. ఆ నాన్న కొడుకువే అయినా నేన్నీకో మాట చెప్పాల్రా..."

"ట్రెయిన్‌కి టైమవుతోంది" విసుగ్గా అన్నాను.

"అది తప్పితే ఇంకోటి వుంటుందిలే. కాని బతుకు ఒక్కటే వుంటుందిరా అబ్బాయ్. నువ్వేంటో నీకు తెలుసు. కాని నువ్వెవరో నీకు తెలీదు"

నవ్వబోయే నిగ్రహించుకున్నాను. తల కొరివి పెట్టడం గురించి జరిగిన వాదనలు గుర్తొచ్చాయి. గుండెలు గుబగుబలాడుతోంటే గుటలు మింగాను.

"నువ్వెవరివో ఎవరికీ తెలీదు. మీ నాన్నకీ తెలీదు. నువ్వు ఇంతున్నప్పుడు రోడ్ల మీద అడుక్కుంటూ తిరుగుతోంటే మీ నాన్న నిన్ను చేరదీశాడు. నీకో పేరు ఇచ్చాడు. ఒక బంధం కల్పించాడు, ప్రేమ పంచాడు. బతుకు ఇచ్చాడు. దాంతో నువ్వింతవాడివయ్యావు...!"

నా కళ్ళకు కప్పిన దళసరి పొరలు ఫట్ ఫట్ మని తెగిపోతోంటే నిస్త్రాణంగా చూశాను. బేలగా చూశాను. కన్నీటి తెరలోంచి చూశాను.

నా భుజం తట్టి విసవిసా నడుచుకుంటూ వెళ్ళిపోయాడా పెద్దాయన.

అతడు పెద్దాయనే. కాని ఆ మాటలు నాన్నవి. మా నాన్నవి. నా దేవుడివి!


లాగి విడిచిన బాణంలా ఏడుస్తూ లోపలికి దూసుకెళ్ళాను. అమ్మ పాదాల మీద పడ్డాను.

"నాన్న అప్పగించిన బాధ్యతలు మరచిపోయాను. నన్ను క్షమించమ్మా. నాన్న అడుగుజాడల్లో నడిచేట్లు దీవించమ్మా....!"

"నాకు తెలుసురా. నా చిన్ని కొండ నాన్న కూచే" అంది అమ్మ నా తల నిమురుతూ.

అప్పుడు అమ్మ నవ్విన నవ్వు, చూసిన చూపు ఎంత అపురూపంగా ఉన్నాయో మాటల్లో వర్ణించలేను!

బహూశా దాన్నే పుత్రోత్సాహం అంటారేమో! అవును నేను పుత్రుణ్ణే. నాన్న ఆశయాలకు ఉత్తరాధికారినే"



1904 సంవత్సరంలో కీ.శే.వడ్డాది పాపయ్య శాస్త్రి గారు గీసిన చిత్రం. కోపంలో ఉన్న కైకేయి దుఃఖంలో ఉన్న దశరధుడు. విశేషం ఏమంటే తిరగేసి చూసినా అదే చిత్రం....

## అద్వితీయం, అమోఘం అమెరికా (న్యూ జెర్సీ) లో

# శతావధాని డా. రాంభట్ల పార్వతీశ్వర శర్మ గారి అష్టావధానం

తెలుగు సాహిత్యంలో 'అవధానం' యొక్క విశిష్టత, ప్రత్యేకత మీ అందరికీ తెలుసు. తెలుగు వారికే, తెలుగు భాషకే పరిమితమైన అద్భుత ప్రక్రియ "అవధానం". న్యూ జెర్సీలో అవధానం జరిగి చాలా చాలా సంవత్సరాలయ్యింది. మన అదృష్టవశాత్తు శతావధాని డా. రాంభట్ల పార్వతీశ్వర శర్మ గారు, అమెరికా రావడం, వారు ఇక్కడ అవధానం చేయడానికి ఒప్పుకోవడం ముదావహం. డిసెంబర్ 8 న తెలుగు కళా సమితి ఆధ్వర్యంలో నిర్వహింపబడిన ఈ అవధాన ప్రక్రియ రసవత్తరంగా జరిగింది. అవధాని గారి గళం నుండి శ్రావ్యంగా వెలువడిన పద్య రత్నాలు శ్రోతలను మంత్ర ముగ్ధులను చేశాయి. ఈ సాహితీ ప్రక్రియలో తొమ్మిది మంది పృచ్ఛకులు పాల్గొన్నారు. డా. కాశీనాధుని మహేశ్వర ప్రసాద్ (సమస్య, ఛందోభాషణం), డా. జననీ కృష్ణ (ఆశువు), శ్రీ గానుగపాటి హరనాథ్ (నిషిద్ధాక్షరి), శ్రీ. తాతా ప్రసాద్ (న్యస్తాక్షరి), శ్రీ బండారు రాజారావు (కావ్య పఠనం), శ్రీ ఊటుకూరి విజ్ఞాన్ కుమార్ (వర్ణన), డా. వైదేహి శశిధర్ (వర్ణన), శ్రీ ఓరుగంటి వేణు (అప్రస్తుత ప్రసంగం), శ్రీ ఉప్పల సుధాకర్ (దత్తపది) గార్లు పృచ్ఛకులుగా వ్యవహరించారు. శ్రీమతి ఏలూరిపాటి అపర్ణ గారు లేఖకులుగా వ్యవహరించారు. ఈ అవధాన ప్రక్రియలో జనించిన, అవధాని గారి మేధస్సుకు ఉదాహరణాలు ఈ క్రింది పద్య సుమ కుసుమాలు,

**సమస్య: డా. మహేశ్వర ప్రసాద్, కాశీనాధుని.**

***తినరుగదా క్షుధార్తు లతితీవ్రతరంబగు క్షుత్తుకల్గినన్.***

ఉనికికి భంగమయ్యె కలినోక్తుల; నాంధ్రమునుద్ధరింపగా
వినదగు వారలక్కట ద్రవింపగ చేయగ తెన్గు ఖ్యాతి; యే
మనెద? మనంబు క్రుంగ! కల లావిరులౌ తరి నాంధ్రులెచ్చటన్
తినరుగదా క్షుధార్తు లతితీవ్రతరంబగు క్షుత్తుకల్గినన్!!

**నిషిద్ధాక్షరి: శ్రీ గానుగపాటి హరనాథ్ గారు**

***పార్వతీపరమేశ్వరుల నాట్యం మంచు కొండపై, కందంలో చెప్పాలి.***

ఏ (ద) శ్రీ (పా) లన్ మా (న) కి (ల) డ (గ) నో
శ్రీ శ్రీ లన్ (క) భూ (ర) తియ న వసిం(ప)చగ (ప) లీ (లా) శుల్
ఏ శ్రీలన్ మాకిడనో
శ్రీశ్రీలన్ భూతియన వసించ గలీశుల్
శ్రీ శ్రీకరి పార్వతియ! హి
మశ్రీలన్ గురియ లాస్య మాన్యతగాచున్.

**దత్తపది : శ్రీ ఉప్పల అనంత సుధాకర్ గారు**

***తెలుగు, కళా, సమితి, అమెరికా – గజేంద్ర మోక్షం.***

గాఢతెలుగెత్తి చాటగా గజవరుండె
ఓడె గర్వ కళార్తి పోరాడి సరసి!
అండ హరియౌట సమితింజయుండునయ్యె;
మోక్షదము కథ నమెరికాన్ ముచ్చటింప.



**వర్ణన: శ్రీమతి జననీ కృష్ణ కొచ్చెర్లకోట గారు**

***గురువు, గాయత్రీ, గంగ... ఇలా 'గ' కారానికి ఎంతో ప్రాధాన్యం ఉంది. ఆ "గ" కారం పై పద్యం.***

"గురువు" నందు నున్నదేది? కోవిదుల్ స్మరింపగా!
"గురువు" లందు నదియె పద్య కోవిదుల్ రచింపగా!
గురుడటన్న"దేవగురుడు" గురుబృహస్పతీ నతుల్!!
"గురులు" కారె మీరలెల్ల "గొప్ప"గా వచింపగా.

మొదటి పాదంలో గురువు అంటే – ఆచార్యులు, ఉపాధ్యాయుడు మొదలైన
రెండో పాదంలో గురువు అంటే – ఛందస్సులో గురులఘువుల్లో "గురువు"
మూడో పాదంలో గురుడు అంటే – దేవతల గురువైన "బృహస్పతి"
నాలుగో పాదంలో "గురులు" అంటే – సభలోని వారంతా "గొప్పవారు" అని నాలుగు పాదాల్లో వేరు వేరు అర్థాల్లో గురు శబ్దాన్ని ఉపయోగించిన పూరణ.

**న్యస్తాక్షరి : డా. తాతా ప్రసాద్ గారు.**

***అహల్యా శాపవిమోచనం – ఆటవెలదిలో చెప్పాలి.***

**1 వ పాదం – 'ర' మూడవ అక్షరం, 2 వ పాదం – 'ద' ఐదవ అక్షరం**

**3 వ పాదం – 'క' మొదటి అక్షరం, 4. వ పాదం – 'ప' ఏడవ అక్షరం**

వర రఘూత్తముండు వరలెడు వేళలో
అతని పాద ధూళి నవతరించి
కఠిన శిలయె లేచి కాంచనాహల్యయై
తనిసె; రామ నీ పదమ్ము రక్ష.

**ఆశువులు : శ్రీమతి వైదేహి శశిధర్ గారు.**

***1. విశ్వనాథ సత్యనారాయణ గారి రామాయణ కల్పవృక్షం లోని రాఘవాకృతిని వర్ణించిన స్ఫూర్తితో – అగ్నిద్యోతనుడు రుక్మిణీ కృష్ణుల సామ్యాన్ని వర్ణించుట.***

ఆమె కురుల ఛాయ అతని దేహచ్ఛాయ
ఆమె మోము చూడ నతని పదము
ఆమె హృది వసించు నంతయు నాతడే
రుక్మిణమ్మ వేణులోలురొకరె.!

**ఆశువులు : శ్రీ ఊటుకూరి విజ్ఞాన్ కుమార్ గారు,**

***2. ఆంధ్రులందరికీ ఇష్టమైన ఘట్టం – సత్యభామ కృష్ణుణ్ణి కాలితో తన్నడం. ముక్కుతిమ్మన "ఉచితవ్యాపారముల్ నేర్తురే" అని సమర్థించాడు. కానీ అలా చేయడం తప్పు సుమా అని ఆ ఘట్టానికి వ్యతిరేకంగా ఓ పద్యం చెప్పాలి.***

లలనల్ మెత్తని వారలంచు దలతున్ లావణ్యమింపారగా!
వలయున్ కోపము! దాని మెచ్చవలయున్ వాల్లభ్యమున్ భర్తలే!
కలికాలంబున తగ్గగా వలయు! కాఠిన్యమేపారుచో
విలపింపన్ వలె పౌరుషాళి యకటా! విఖ్యాతమౌ కావ్యమై!

**కావ్యపఠనం: శ్రీ బండారు రాజారావు గారు**

అంబ నవాంబుజోజ్వల కరాంబుజ శారద చంద్ర చంద్రికా
డంబర చారుమూర్తి ప్రకటస్ఫుట భూషణ రత్నదీప్తికా
చుంబిత దిగ్విభాగ శ్రుతిసూక్త వివిక్త నిజ ప్రభావ భా
వాంబర వీధి విశ్రుత విహారి ననుం గృపఁచూడు భారతీ!

నల్లనివాఁడు పద్మనయనంబులవాఁడు మహాశుగంబులున్
విల్లును దాల్చువాఁడు గడు విప్పగు వక్షమువాఁడు మేలు పైఁ
జల్లెడువాఁడు నిక్కిన భుజంబులవాఁడు యశంబు దిక్కులం
జల్లెడువాఁడు నైన రఘుసత్తముఁ డిచ్చుత మా కభీష్టముల్

**ఛందోభాషణం: శ్రీ కాశీనాథుని మహేశ్వర ప్రసాద్ గారు**

*ప్రశ్నలు: 1. కోడిని కోసి తింటిరొకొ? కూడి గతించిన వారమందునన్? (Thanks Giving Week – Turkey కోడి గురించి)*
*2. వేడికి మద్యముంగొని కవిత్వపుటేరులు పారఁ జేసిరో?*

**అప్రస్తుత ప్రసంగం : శ్రీ ఓరుగంటి వేణు గారు.**
**విలేఖినీమణి: డా. ఏలూరిపాటి అపర్ణ గారు.**

ఈ సందర్భంగా అవధాని శ్రీ. డా. రాంభొట్ల పార్వతీశ్వర శర్మ గారికి నిర్వాహకులు
**“క్షేమేంద్ర సారస్వత సరస్వతీ”** అనే బిరుదుతో సత్కరించారు.





## తెలుగు కళా సమితి దీపావళి

## అష్టావధానం

## చిత్ర మాలిక







# ఇప్పుడు ఎక్కడ చూసినా మౌనమే

## చొక్కర తాతారావు

అడగాల్సిన చోట అడగటం
ప్రశ్నించే చోట ప్రశ్నించడం మానేశాం
ప్రశ్న ముందు మౌనం తలదించుకుంది
ఇప్పుడు ఎక్కడ చూసినా మౌనమే
నీ చుట్టూ ఓ ముళ్ళ కంచె కట్టుకుని
నీకు నువ్వే ఓ మౌనలోకం సృష్టించు  కున్నావు
మనిషి కన్న ముందు మౌనం మాట్లాడుతోంది
నీలో నిన్ను చూసుకోకుండా
మరొకరికి భరోసా ఇస్తున్నావు
నీ బాధను నీలో దాచుకోకుండా
ఎదుటివాడి పుండుమీద కారం జల్లుతున్నావు
ప్రశ్న ఇప్పుడు అవినీతికి చేతులందించి
పోరాటం చేయడం మానేసింది
కులం నీడన కునుకు తీసి మౌనంగా బతికే స్తోంది
ఎదుటివాడు చేస్తే అవినీతి
తన వర్గం వాడు చేస్తే అది రాజనీతి
ఇప్పుడు అందరికీ అదే నీతి
మౌనం ఇప్పుడు కాలం చుట్టూ తిరుగుతోంది
మౌనాన్ని మోకాళ్లలో దాచేసుకున్న కాలం
మనుషుల్ని పట్టించుకోవటం ఎప్పుడో మానేసింది
ఇప్పుడు కాలం మీద దండయాత్ర చేసే దండొకటి వచ్చింది
పోరాటం చేయకుండా  మనుషుల
మీద మౌనం చల్లేసిపోయింది
గొంతు విప్పకపోతే మౌనం అంగీకారమే
నీ మౌనాన్ని పాలకులు ఓట్లుగా కొనేశారు
మనుషుల్ని ఓట్లుగా చీల్చి సమూహాలుగా కొన్నప్పుడే
ఈ దేశంలోప్రజాస్వామ్యం ఖూనీ అయ్యింది
మనిషిని మనిషి దోచుకున్నా
ఇక్కడ మౌనం ప్రేక్షక పాత్ర వహిస్తుంది
మనిషిని మనిషి చంపుతున్నా
మౌనం కళ్ళకి గంతలు కట్టుకుని చూస్తోంది
మనిషి మనిషి పక్క పక్కనే ఉన్నా
మౌనం వాళ్ళని విడదీస్తుంది
ఇప్పుడు అక్షరానికీ చీడ పట్టేసింది
అక్షరం అక్షరం కలవాల్సిన చోట
మనుషులు సమూహాలుగా విడిపోతున్నారు
జనం కోసం నినదించవలసిన అక్షరం
పురస్కారాల కోసం పైరవీలు చేస్తోంది
నువ్వు మౌనంగా ఉన్నప్పుడే వాడు నిన్ను దోచేశాడు
సంపద దోస్తేనే దోపిడి కాదు మౌనం దోచినా దోపిడే
మనిషిని మనిషి మాయం చేసే కాలంలో
మౌనం ఓ దండయాత్ర కావాలి ★★★



# ఈనాటి కుటుంబం

## భావరాజు భారతి

ఈమధ్య ఒక TV కామెడీ షో లో చూసిన విషయం మీతో పంచుకోవాలనిపించింది. షో లో 'ఫ్యామిలీ టైం' అంటే తల్లి, తండ్రి, పిల్లలిద్దరూ భోజనానికని వచ్చి, భోజనం మొదలవగానే, ఏ కబుర్లు చెప్పుకుంటారో అనుకుంటుండగానే, నిశ్శబ్దంగా అంతా ఒక్క సారిగా తలలు వంచి చేతులలో వున్న స్మార్ట్ ఫోన్ లో మొహం పెట్టి, 14 ఏళ్ల కూతురు నవ్వుతూ, తల్లి ఆశ్చర్యంగానూ, తండ్రి విచారంగాను, చివర 11 ఏళ్ల కొడుకు తన చూపుడు వేలుతో చేతిలోవున్న సెల్ ఫోన్ స్క్రీన్ ని తెగ కదిలిస్తూ కనిపించారు. మిగత షో చూడకుండానే మనలో ఈ 21వ శతాబ్దంలో కుటుంబ సమావేశాలలో, ఇప్పటి పరిస్థితులలో ఎటువంటి మార్పులు వచ్చాయా అని ఆశ్చర్యపడడం నావంతయింది.

ఆనాటి టీవీషో లో ఉన్న కుటుంబాన్ని, మా కుటుంబంతో పోలిస్తే, నాకు 14 సంవత్సరాల వయస్సున్నప్పటి రోజులలో అంటే, 20వ శతాబ్దం అన్నమాట! ఇండియాలో పెరిగిన రోజులవి. పగలంతా ఎవరి పనులతో వారు ఉండడంతో, అందరం కలవడం కుదిరేది కాదు ఇప్పటిలాగే. కాని, మా నాన్నగారు ఆఫీసు నుంచి సాయంత్రం 7 గంటలకి వచ్చాక, అమ్మ అలవాటు గా భోజనానికి రమ్మనడం, నాన్నగారు, అమ్మతో బాటు నేను, తమ్ముళ్ళు టేబుల్ దగ్గర చేరడం బాగా గుర్తుకొస్తున్నాయి. భోజనం చేస్తూ, ఆరోజు తాజా వార్తల గురించో, మాకు జరిగిన అనుభావాల గురించో, లేదా విన్న జోక్, ఇంకాపోతే, అమ్మ చెప్పే ప్రక్కింటి మామ్మగారు చెప్పగా విన్న పుక్కిటి పురాణాలో చెప్పుకుంటూ సరదాగా గడిపేవాళ్ళం. "ఇంక లేవండి" అన్న అమ్మ మాటలతో ఆరోజు గడిచేది. భోజనాల తరువాత మాత్రం ఎవరి లోకం వారిదే! ఒక విధంగా ఆలోచిస్తే, ఆమాత్రం అందరం కలవడం, మాట్లాడడం జరిగాయంటే, కంప్యూటర్స్, సెల్ ఫోన్స్ లేని రోజులవి. ఇంకా చెప్పాలంటే, టి.వి., టెలిఫోన్ కూడా లేని రోజులవి. ఇంతవరకు చదివారంటే ప్రస్తుతం నా వయస్సు సుమారుగా గుర్తించే వుంటారు!!

అమెరికాలో పుట్టి పెరిగినా మా ఇద్దరు అమ్మాయిలని కాలేజీ కి వెళ్ళేదాకా, అంటే 18 ఏళ్ల దాకా అలాగే పెంచామని చెప్పగలను. సాయంత్రం 7 అయ్యేసరికి నేను, మావారూ అమ్మాయిలతో ఆనాటి కబుర్లు చెప్పుకంటూ, ప్రపంచంలోని కష్ట సుఖాలని చర్చిస్తూ వుండేవాళ్ళం. కంప్యూటర్స్ అక్కడక్కడ వున్నా సెల్ ఫోన్స్ మాత్రం లేని రోజులవి. కానీ ఈనాడు మా 18 ఏళ్ల మనుమరాలు 10 సంవత్సరాలప్పుడు చేతికొచ్చిన స్మార్ట్ ఫోన్ ఇంతవరకు వదల లేదనేది ఏమాత్రం అతిశయోక్తి కాదు. మా ఇంటికి వచ్చినా, మనుమలు సెల్ ఫోన్ వదలకుండా ఈ స్మార్ట్ సెల్ ఫోన్ లకి 'బానిసల'వడం మాత్రం నిజం. క్రొత్తల్లో సెల్ ఫోన్ లో మాట్లాడడం లేదా, ఫోన్ కేసే చూస్తూ (e.g. YouTube తో) గడపడం మంచి లక్షణం కాదని చెప్పి చూశా. నాతో మాట్లాడమని, తలవంచుకునే వుంటే మెడ వంగిపోయే ప్రమాదం ఉన్నదని జోకేసినా, ఆ మాటలు గాలిలోనే కలిసిపోయేవి.

పిల్లలు, మనవల సంగతే ఇలా వుందనుకునేరు, పెద్దవాళ్ళు పిల్లలని వేలెత్తి చూపుతోనే, తాము కూడా సెల్ ఫోన్స్, ఐ-పాడ్స్, కంప్యూటర్లు వదలలేకున్నారంటే ఆశ్చర్యపడ నఖ్ఖర్లేదు. కొన్నాళ్ళ క్రితం, డాక్టరాఫీసు లో ముందు గదిలో కూర్చున్న 6 గురు పెద్దలు ఎవరి సెల్ ఫోన్స్ లో వాళ్ళు తలెత్తకుండా వేళ్ళు త్రిప్పుతూ సెల్ ఫోన్ లో చదువుతూ కూర్చున్నారు. వాళ్ళ చుట్టూ వున్న వార్తా పత్రికలు, వార, మాస పత్రికలు, ఆరోగ్యానికి ఉపయోగపడే కరపత్రాలు ఈరోజులలో చదివేవారెవరా అనిపించింది. నాకు మాత్రం చేతిలో పట్టుకుని చదివే అచ్చైన పత్రికలంటే ఇప్పటికీ ఇష్టమే.

ఆ విషయం సరే, మరొక అనుభవం. తెలిసిన స్నేహితుల ఇంటికి, సత్యన్నారాయణ వ్రతమని పిలిస్తే నేను మావారు వెళ్లాం. పాతికపైనే ఉన్నారు అతిథులు. పూజారి మంత్రాలు చదువుతున్నారు, దంపతులు పూజ జరుపు తున్నారు, కాని వచ్చిన అతిథులలో కొందరు సెల్ ఫోన్స్ లో మాట్లాడటమో, మరి కొందరు తమ సెల్ ఫోన్స్ లో సందేశాలు, సమాచారాలు చదువుకోవటం చేస్తున్నారు. పూజకని వచ్చి, ఇంటిలోనే కాకుండా, ఇంటి బయటకు వెళ్ళిపోయి సెల్ ఫోన్ లో చేతులూపుతూ నిమగ్నమైన పెద్దమనిషి ఒకరు. సరే! పూజ పూర్తిచేసి, పూజారి గారు అతిథులనుద్దేసించి గట్టిగా, అందరూ పువ్వులు, అక్షింతలు శ్రీ సత్యన్నారాయణ స్వామికి భక్తితో సమర్పించి మీ మనసులోని కోరికని స్వామికి చెప్పుకోండన్నారు. అంతవరకు శ్రద్ధగా పూజ చూస్తున్న కొందరు

With Best Compliments from



Ram & Girija Kolluri

---

With Best Compliments from



Eppanapally Family

లేవడంతో, ఈ లోకంలోకి అప్పుడే వచ్చినట్లుగా చేతులలో వున్న సెల్ ఫోన్ అతిథులంతా హడావిడిగా లేచారు.

మనం మాట్లాడుతున్నా సెల్ ఫోన్ కేసి చూస్తూ, వింటున్నట్టు నటిస్తున్న మన పిల్లలూ, మీటింగ్స్ లోను, కాలేజీలలో తల వంచి, టేబుల్ క్రింద ఎవరకి కనబడకుండా సెల్ ఫోన్స్ చూసుకునే జనాభాని చూస్తుంటే, సెల్ ఫోన్స్ ప్రపంచం తో మనం కూడా మారాలని అనిపించినా, నాలాంటి పాతకాలపు మనుష్యులకి పాతరోజులే నయమేమో ననిపిస్తుంది ఒకరితో ఒకరు మాట్లాడుకోవాలంటే.

నేను మరీ అంత పాతకాలంలో ఆగి పోయాననుకున్నారా? అబ్బే! నాకూ కంప్యుటర్, స్మార్ట్ ఫోన్ ఉన్నాయి. ప్రతి వస్తువుకీ మంచి చెడులు వున్నట్టే, కంప్యూటర్స్, స్మార్ట్ సెల్ ఫోన్స్ మనకి ఎంత ఉపకారం చేశాయో అంత అపకారం కూడా చేస్తున్న విషయం మనందరికి తెలిసేనదే! ఆ విషయం ఎవరి అనుభవాలు వారివే. చెడు సంగతులు, ఎలావున్నా, పైన చెప్పిన ఆ మనుమలే నాకు కంప్యూటర్, సెల్ ఫోన్ లని ఎలా వాడాలో నేర్పించారు, ఇంకా నేర్పిస్తూనే వున్నారు. ఆ అనుభవాలకి, నా అవసరాలకి ఆదుకుంటున్న మా మనవలకి ఎంతైనా ఋణపడి ఉన్నాను. నిజం చెప్పాలంటే, మావారు, ఇంజనీరుగా ఈ విషయంలో, సహాయం చేస్తూనే, నా కంప్యూటర్ గురించి కానీ, సెల్ ఫోన్ గురించి కానీ ప్రశ్న అడగగానే, నాకెంత తెలిదో, లేకపోతే ఆలోచించకుండా ఎందుకు ప్రశ్న లడుగుతున్నాననో అంటూ నా అజ్ఞానాన్ని చాటిస్తున్నారా అనిపించేలా మాట్లాడడం మామూలే. కాని ఏమాటకామాటే చెప్పాలి. మా మనుమలు మాత్రం కంప్యూటర్లో కానీ, నా సెల్ ఫోన్ లో కాని నాకు అర్థం కాకుండా నేను వేసే అమాయకపు ప్రశ్నలకు, చేసిన తప్పులకు, ఎంతో ఓపికతో అర్ధమయ్యేలా బోధిస్తారు. నేను కంప్యూటర్లో కానీ, నా సెల్ ఫోన్ లో పడిన చిక్కులనుంచి బయటపడేది కూడా మనవల చాకచాక్యంతోనే!

ఎంతసేపు మన పిల్లలు, మనవల గురించే కాదు, ఈ తరం పెద్దలు కూడా సెల్ ఫోన్ మన జీవితంలో ప్రవేశమవగానే చాలా మారారు. పిల్లలు, మనుమల కోసమే కాదు, తమ ఆనందం కోసమో, బంధు మిత్రులని మెప్పించటానికో, కంప్యూటర్లు, సెల్ ఫోన్లు అలవాటు చేసుకున్నారు. ఈమైల్స్, టెక్ట్స్ పంపడం, వాట్స్ యాప్, స్కైప్ లో మాట్లాడడం, పేస్ బుక్ లో ఫోటోలు పంపడం ఇల్లాంటి కొత్త విద్యలెన్నో నేర్చుకున్నాం. అవన్నీటి తోబాటు తెలీని ఇరుకులలో పడడం కూడా జరుగుతూనే వున్నాయి. మనకు కావాలన్నా, వద్దనుకున్నా, తెల్లవారేసరికి 'డ్యూటీ' అన్నట్టుగా తమకు తెలిసిన 10 – 15 మందికి విశేషాలతో బాటు, జోకులు, కార్టూన్లు, దైవ భక్తి తో స్తోత్రాలు, పద్యాలు, పాటలు, వ్యాసాలు, ప్రవచనాలు, హితబోధలు వాట్స్ యాప్ ద్వారా మరెన్నో సందేశాలు పంపేవారు ఎంతోమంది ఉన్నారు. ఎటొచ్చి ఒక చిన్న సలహా. అందరికి మంచి ఉద్దేశ్యంతో మీరు పంపుతున్నా, అందరికి మీరు పంపినవన్నీ మీకు నచ్చినంతగా వారందరికి నచ్చుతాయనుకోక, ఒకసారి అడిగి చూడండి వారికి మళ్ళీ పంపేముందు. లేకపోతే, 'అక్కరకురాని చుట్టం' సామెత అవచ్చు. మనకు అవన్నీ ఇప్పుడు ఎందుకులెండి.

స్మార్ట్ ఫోన్ అనగానే మరొక విషయం చెప్పాలి మీకు. నేను, మావారు కొన్నేళ్ళక్రితం క్రొత్త సెల్ ఫోన్ కొనాలని స్టోర్ కి వెళ్ళిన అనుభవం గుర్తుకొస్తోంది. అక్కడి ఫోన్లు అమ్మే వ్యక్తి మామాట వినకుండా, అక్కడ వున్న వాటిల్లో ఏ ఫోన్ కెమెరాతో ఎంత మంచి ఫోటోలు, విడియోలు తీయవచ్చో, ఎంత త్వరగా అంతర్జాల (Wi Fi, Internet, Websites) ప్రపంచంతో కలవగలమో చెప్పుకెళ్ళి పోతున్నాడు. అంత ఉపన్యాసం విన్నాక నాకు కావాల్సిందల్లా సేలఫోన్ లో, ఇంటిఫోన్ లాగ నలుగురితో ఎక్కడున్నా మాట్లాడితే చాలని, మిగత హంగులన్నీ అవసరం లేదని చెప్పాలని అనుకుంటుండగా, మావారు ముచ్చటపడో, మొహమ్మాటపడో $400 ఫోన్ కొనే ఉద్దేశ్యం గట్టిగా చెప్పేశారు. నిజం చెప్పొద్దూ, పైకి ఆశ్చర్యంగా కనిపించినా, మనసులో అరచేతిలో ఇమిడే స్మార్ట్ ఫోన్ తో పెద్ద కంప్యూటర్ కన్నా మరెన్నో విధాల వాడవచ్చని మురిసిపోయాను. ఆ సేల్స్ మన్ తెలివిగా మాటలలో మాకు తెలీకుండానే మాకిద్దరికి రెండు వేరు వేరు రంగుల ఫోనులు కొనిపించేశాడు!! అల్లా మొదలైనా, అసలు విషయమేమంటే ఇప్పుడు స్మార్ట్ ఫోన్ లేకపోతే రోజేలా గడుస్తుంది అనే పరిస్థితికి వచ్చేశాము నేను మావారు.

ఇల్లా చెప్పుకుంటూ పోతే, స్మార్ట్ ఫోన్ ప్రపంచం లో వున్న మంచి చెడులు ఎవరికీ వారే తెలుసుకొని మన జాగ్రత్తలలో మనం వుండాలి లేదా ఇతరుల అనుభవాలు విన్నవి, చదివినవి, చూసిన వాటివల్ల తెలుసుకోవాలి. నేను స్మార్ట్ ఫోన్ ప్రపంచం గురించి ఇంతవరకు మీతో పంచుకున్నవి నా అనుభవాలు మాత్రమే! ***

With Best Wishes from,

# Dr. Janani Krishna
# &
# Dr. Krishna Kocherlakota

With Best Wishes from



# Rohini Kumar Vemula & Family

# నీకు నేను! నాకు నువ్వు

## చాగంటి ప్రసాద్

కాకులు కావు కావు మంటున్నా, చుట్టూ ఉన్న జనం గోల వినబడుతున్నా, వంటింట్లోంచి కాంతం చేస్తున్న సామాన్ల చప్పుడు గట్టిగా వినబడుతున్నా మంచం నిండా పడుకున్న కిట్టయ్య మాత్రం ముసుగు తీసి చూడలేదు, మంచంమీద నుంచి లేవలేదు. కాంతం వంటింట్లో పనులన్నీ చక్కబెట్టుకొని కిట్టయ్య మంచం దగ్గరకు వచ్చి ఒక కుదుపు కుదిపి లేవండి! బారెడు పొద్దుఎక్కింది. ఉండు కాంతం! కాసేపు పడుకోనియ్యి అని మళ్ళీ మునగదీసుకొని పడుకున్నాడు.

కాంతం ఉసూరుమంటూ తన పనుల్లో పడిపోయింది. అలా గంట గడిచాకా తన నూట పది కేజీల భారీ కాయాన్ని మంచం లోంచి లేపి బాత్ రూమ్ లోకి వెళ్ళి దంతావధానం చేసుకొని వచ్చి హాలులో కుర్చీలో తన భారీకాయాన్ని కుదేసి కూర్చొని కాఫీ! కాంతం! అని ఘీంకరించగానే ఆ ఇల్లాలు వచ్చే! వచ్చే! అంటూ ఒక సోలడు గళాసులో వేడి వేడి కాఫీ తెచ్చిచ్చింది. చప్పరిస్తూ పేపరు చూస్తూ వంటింట్లోంచి వచ్చే తాళింపు సువాసనలు ఆఘ్రాణిస్తూ ఈ రోజు కాంతం ఏం టిఫిన్ చేసిందో అనుకుంటూ వంటింటి కేసి చూస్తున్న కిట్టయ్యనిపక్కింటి పంకజం గారు అన్నయ్య గారూ వదిన ఉందా? పంచదార కావాలి అని గిన్నెతో సిద్ధమైంది. శుక్రవారం మహాలక్ష్మి కోసం ఎదురుచూస్తున్న కాంతానికి ఈవిడగారి దర్శనం చిరాకు తెప్పించింది. ఆ విసుగులోనే "మాడిన అట్టు" కిట్టయ్య పాలైంది.

కాంతం ఆ పిల్లెంక అనే ఊరులోనే టీచర్. కొన్నికారణాలవల్ల ఆవిడ దూరపు చుట్టం అయిన ఈ కిట్టయ్య "మగడయ్యాడు మగదిక్కయ్యాడు." కిట్టయ్య కొద్దిగా అమాయకుడు. అదీకాక ఏ పని చెయ్యడానికి ఒళ్ళు కదపకపోవడం వల్ల స్వతసిద్ధమైన ఒళ్ళు, వంశపారంపర్యమైన ఊబకాయం వల్ల అతని శరీరం పెరిగి కొండంతైంది పాపం. అప్పుడప్పుడు రియల్ ఎస్టేటు, ఇన్సూరెన్స్ వ్యాపారాలు చేద్దామని, ప్రయత్నాలు చేసి వాటిల్లో హామీలు అవి ఇచ్చి డబ్బులు పోగొట్టుకుంటుంటే కాంతం మీ నిర్వాకం చాల్లెండి, నాకు తప్పదు కదా! వండి పడేస్తాను తిని ఇంట్లో పడుండండి. అని అల్టిమేటం ఇచ్చాక ఆ పని కూడా మానేసి మరింత ఒళ్ళు చేసాడు.

ఈ దంపతులకి అన్నీ ఉన్నా పిల్లలు లేని లోటొకటి. పిల్లలు లేని లోటు వల్ల తిక్కలో కాంతం ఒకోసారి కిట్టయ్యని సాధిస్తూ ఉంటుంది. స్కూలుకి వెడుతూ డాబా మీద వడియాలు ఎండబెట్టాను కాస్త ఒక కన్నేసి ఉంచండి. వానొచ్చిన గాలొచ్చినా డాబామీద నుంచి దింపెయ్యండి. అని చెప్పి వెళ్ళగానే కిట్టయ్యకి కాళ్ళూ చేతులు ఆడలేదు. ఎక్కడ వానొస్తుందో, గాలెస్తుందో అని అరుగెక్కి ఆకాశం కేసి చూస్తుంటే పక్కనున్న సుబ్బారావు కిట్టయ్యా! ఏంటి చూస్తున్నావు? అని అడిగితే అబ్బే ఏం లేదు అని నసిగి ఇంట్లోకి వెళ్ళిపోయాడు.

మధ్యాహ్నం ఒంటి గంట. వేసవికాలం మొదలైపోయిందని అనుకున్నాడు. ఇహ ఆకలి మొదలైంది. కాంతం ఒంటిపూట స్కూలు కదా అని వచ్చేకా భోజనం వడ్డిస్తాను అప్పటి దాకా ఆగమని చెప్పిందని ఎదురుచూస్తున్నాడు. ఈ లోగా ఫోన్ మోగింది. గబుక్కుని ఫోను ఎత్తే సావకాశం లేక, లేవలేక లేవలేక లేస్తూ వెళ్ళేసరికి ఫోను కట్ అయిపోయింది. ఎవర్తై ఉంటారా ఇని ఇరుసుమండలో ఉన్న తన తల్లికి ఫోను చేసి ఏదో అడగాలని అమ్మ! కాఫీ తాగావా? అనగానే ఇప్పుడు కాఫీ ఏమిట్రా భోజనాల వేళ! అని కస్సుమంది. ఏమ్మా ఫోన్ చేసావా? అనడిగితే అదేమిట్రా నువ్వేగదా ఫోను చేసావు? తిరిగి నన్నడుగుతావూ అని కయ్యిమని మళ్లీ జాలేసి ఏం నాన్నా! భోజనం చేసావా? అని అడిగితే, లేదు కాంతం స్కూల్ నుంచి వచ్చి పెడుతుంద అని ఇంక ఏమిటిమ్మ విశేషాలు అనిఅడగ్గానే ఏముంటాయి నా దగ్గర అని ఫోను పెట్టేసింది.

ఆవిడకి కోడలు మీద కోపం, తను నాలుగు రోజులు వచ్చి కొడుకు దగ్గర ఉందామని వస్తే కోడలు తనని ఎంత త్వరగా పంపించేద్దామా అని కొడుకు వంక పెట్టి ఏ పని చేయకుండా తింటూ ఊరికే కూర్చొని తిన్న వాళ్ళకు వండి పెట్టడం నా వల్ల కాదు, అంటూ పరోక్షంగా తిడుతూ ఉండే కోడలంటే ఆవిడకి కోపం! అందుకే అలా కొడుకుతో నిష్ఠూరంగా మాట్లాడుతూ ఉంటుంది. అలా మాటాడినా కిట్టయ్యకి అర్థం అవదు. అతనో మా"లోకం". ఆ ఫోనెక్కడనుంచి వచ్చిందో అన్న ఆలోచల్లో పద్ద కిట్టయ్య కాంతం చెప్పిన ముఖ్యమైన పని మర్చిపోయాడు.

ఈ లోగా అతని లాగే ఉన్న ఒక "మోటుమబ్బు" ఆకాశం అంతా కమ్మేసి ఒకజల్లు వేసుకుంది. డాబామీద ఉన్న గుమ్మడి వడియాలు ముద్దలై కూర్చున్నాయి. సరిగ్గా అదే టైముకి గొడుగుతో కాంతం ఇంట్లోకి అడుగు పెట్టి కంగారుగా వడియాలు తీసారా వానొచ్చింది అని కళ్ళజోడు లోంచి ఇంతింత కళ్ళేసుకొని తీక్షణంగా చూస్తూ అడిగింది.

కంగారుగా ఈ లోకంలో వచ్చిన కిట్టయ్య వడియాలా కాంతం! అని తత్తర పడుతూ మర్చిపోయిన కిట్టయ్య వంక చూసి ఏ పని సరిగ్గా చేసారు కనక అంటూ తలబాదుకుంటూ డాబామీదకి వెళ్ళింది ఆమెవెనకే వెళ్ళలేక వెళ్ళలేక డాబామీదకి వెళ్ళి ముద్దలుగా పడి ఉన్న వడియాలని చూసిన కాంతం అగ్గిమీద గుగ్గిలం అయ్యింది. అవేవి పట్టించుకోని కిట్టయ్య కాంతం! పచ్చివడియాలు వేగించుకుంటే చాలా రుచిగా ఉంటాయి కదా! అనగానే పచ్చివి అన్నీ ఒకేసారి తినేస్తారా? అని ఖస్సుమంటూ, ఉసూరుమంటూ కిందకి దింపే ఏర్పాట్లు చూడండి ముందు అని అరిచింది.

# తెలుగు కళా సమితి దీపావళి (2019) సంబరాలు : చిత్ర మాలిక









ఆరబెట్టిన చాప చివర్లు పట్టుకోమని గదమాయించే సరికి, సర్లే అంటూ ఆయాస పడుతూ మెట్లు దింపాడు.ఇలాంటి సంఘటనలు నెలలో బోల్డుసార్లు జరగడం, ఇద్దరు ఘర్షణ పడడం, పిల్లలు లేకపోవడం కూడా వాళ్ళ గొడవలకి ఒక కారణం కూడా!

కిట్టయ్యకి ఒక అన్నయ్య కూడా ఉన్నాడు. అతనికి తమ్ముడంటే చాలా ప్రేమ. అతను గల్ఫ్ లో పనిచేస్తూ చాలాసంపాదిస్తున్నాడు. వారానికి ఒకసారైనా ఫోను చేసి తన తల్లి, తమ్ముళ్ళ యోగక్షేమాలు కనుక్కుంటూ ఉంటాడు. అతను ఫోను చేస్తే కిట్టయ్యకి సంబరం, ఆనందం. నెలకు కొంత డబ్బుకూడా అతని అక్కౌంటులో వేసి అమ్మ నువ్వూ వాడుకోండని చెప్తుతాడు. ఆ రోజు ఆదివారం, కాంతంకి సెలవు. కిట్టయ్య లేచి కాఫీ డికాక్షన్ వేసాడు, అతనికి అదొక్కటే వచ్చిన పని పాపం. ఈ లోగా ముసలయ్య పాలు తెచ్చి పోసాడు. పాలు పోస్తూ "ఏం కిట్టయ్య గారు! ఏంటండి ఇశేసాలు" అని అడగ్గానే, " ఏముంటాయి నా దగ్గర! నువ్వే ఊళ్ళో తిరుగుతావు, నువ్వే చెప్పు" అనగానే, "మీకు తెలుసా? లక్ష్మీపతి గారు తీర్థయాత్రల కి జనాన్ని తీసుకెల్తున్నారుట. మీరు కూడా ఎల్లచ్చు" కదా! అనేసి టైమైపోతోందని సైకిలెక్కి చక్కా పోయాడు. కిట్టయ్య బుర్రలో కొత్త ఆలోచన పుట్టింది. కాంతానికి కాఫి కలిపిచ్చి, నెమ్మదిగా కాంతం నీకు వేసవి సెలవులు కదా! సరదాగా ఎక్కడకైనా వెడదామా?

అడగ్గానే కాంతం నాకంత ఖాళీ లేదు నేను ఈ సెలవుల్లో ఇంటింటికి తిరిగి ఓటర్ల లిస్టు తయారుచేయాలి, అని లేచి కాఫీ త్రాగి స్నానానికి వెళ్ళింది. కిట్టయ్యకి ఆమెని ఎలా ఒప్పించాలో తెలియక కాంతం! అలా వాకింగ్ కి వెళ్ళొస్తాను అని చొక్కా పాంటు వేసుకొని రోడ్డెక్కాడు. పిల్లంక ఊరి అరుగుల మీద కూర్చున్న కొందరు ఆడవాళ్ళందరు అప్పటికే  పిచ్చాపాటిలో ఉన్నారు. ఒకళ్ళిద్దరు అన్నయ్యగారు! బావున్నారా? అని పలకరించారు. వాళ్ళందరు అతని కన్నా పెద్దవాళ్ళే! అది అతనికి తెలుసు! వీళ్ళదుంప తెగ! వీళ్ళకళ్ళకి నేను అన్నయ్యలా కనబడుతున్నాను అని భారంగా నిట్టూర్చి పక్కవీధిలోకి తిరిగి లక్ష్మీపతి ఇంటితలుపు కొట్టాడు. అతను తలుపు తీసి కిట్టయ్యని చూసి ఈయనేమిటి ఇలా తనింటికి వచ్చాడు అని ఏమిటి విషయం అని అడిగాడు?

ఇంట్లోకి వచ్చాక మంచినీళ్ళు తాగి, అవునూ మీరు మళ్ళీ యాత్రలు అవీ వేస్తున్నారుట! ఎక్కడికి? అనగానే లక్ష్మీపతి మొహంలో నవ్వు మొలిచింది. వెంటనే అతనికి కాఫీ ఇచ్చి, చార్ ధామ్ యాత్ర! మధుర, ఆగ్రా, బృందావనం తో పాటుగా అని చెప్పాడు. చార్ ధామ్ అంటే ఈ క్షేత్రాలో వివరంగా చెప్పాడు.

తల ఒక్కంటికి ముప్ఫై ఐదువేలు అందులోనే భోజనం, టిఫిను, రూములు, అన్నికలిపి అని వివరించాడు, ఒకవారంలో బయలుదేరుతాం అనికూడా చెప్పాడు. ఆలోచించి చెప్తాను అని కాంతాన్ని కన్విన్స్ చేయాలని మనసులో అనుకుని ఇంటిదారిపట్టాడు. వీథిలో పనసుపొట్టు కనబడగానే ఒక శేరు కొనుక్కొని ఇంటికి పట్టుకువెళ్ళి కాంతం! నీకు ఇష్టమని తెచ్చాను "ఆవపెట్టి" వండు! అనగానే మీరు తిందామని తెచ్చి నాకిష్టమంటారే! దెప్పుతూ వంటింట్లో కి తీసుకెళ్ళి వంటపనిలో పడింది పక్కనే ఫ్రిజ్ లోకి బాటిల్స్ లో నీళ్ళు పడుతూ అసలు విషయానికి వచ్చి, "లక్ష్మీపతి గారు ఉత్తర భారత యాత్రల కి తీసుకెళ్తున్నారుట కాంతం! సరదాగా వెడదామా" అని ఆశగా అడిగితే, "ఎన్నిసార్లు చెప్పనూ నాకు కుదరదు అని, మీరు వెళ్తే వెళ్ళండి, నేను ఈ సెలవల్లో నైనా నాకు కాస్త మీకు వండిపెట్టే చాకిరీ అయినా తప్పుతుంది అంది." సరే! మరి తల ఒక్కంటికి ముప్ఫై ఐదు వేలు అవుతుందిట, కాఫీ, టిఫిను, భోజనాలు, రూమ్ము, అన్నీ అందలోనేట పైఖర్చులుకి ఒక పదివేలు ఇయ్యి సర్దుకుంటాను అని గబగబ పాఠం ఒప్పచెప్పేసాడు, ఎక్కడ ఆవిడ మనసు మారిపోతుందేమో అని. నా దగ్గర అంతా సొమ్ము లేదు, మీ అన్నయ్యని అడగండి కొంత! అని హాల్లో టీ. వీ చూడ్డం లో నిమగ్నమయ్యింది.

కిట్టయ్య అన్నయ్య ఫోను రావాలంటే ఆదివారం వరకు వేచి చూడాలి, వడియాలు వేసి, ఆవపెట్టి వండిన పనసు పొట్టు కూరతో సుష్టుగా భోజనం చేసిన గురకపెట్టి నిద్రలో ఉన్న కిట్టయ్యకి ఫోను రింగు వినబడగానే లేచి ఆదివారం తప్ప మిగిలిన రోజుల్లో చేయని అతని అన్నయ్య ఫోనుచేయడం, కిట్టయ్య తన యాత్రగురించి చెప్పడం, అతను ఖర్చులకి కొంత డబ్బు పంపించేస్తాను అనడం క్షణాల్లో జరిగిపోయింది. ఆనందంగా తన తల్లికి కూడా ఆ విషయాలు చెప్తే, అంతదూరం ఒంటరిగా ప్రయాణం చేయగలవురా? అని జాగ్రత్తలు చెప్పిందావిడ.

కాంతం పోట్లాడుతుంది కానీ, ముందు అంత డబ్బు ఇవ్వనూ అంది కానీ తనే డబ్బు ఇచ్చింది. కిట్టకయ్య ఊరు వెడతాడగానే కొంత బెంగపడినమాట నిజమే! ఇద్దరిమధ్య తెలియని ప్రేమ ఉందని ఆమెకి కిట్టయ్య యాత్రకి వెడుతున్నప్పుడు అనిపించింది, లక్ష్మీపతికి తన భర్తను జాగ్రత్తగా చూడమని చెప్పింది. కాకినాడ రైల్వేస్టేషన్లో చాలా జాగ్రత్తలు చెప్తుతున్న భార్యని చూసి అమాయకంగా మొహం పెట్టాడు అర్థమవక.

యాత్ర పన్నెండు రోజులని లక్ష్మీపతి ఎనౌన్స్ చేసాడు, ఢిల్లీలో ట్రైను దిగిన కిట్టయ్య ఎప్పుడూ ఊరు వదలని అతనికి ఆ సిటీని చూసి నోరు వెళ్ళబెట్టాడు. అక్కడనుండి బృందావనం, మథుర, అలాగే ఆగ్రాలో తాజమహల్ చూసాడు, అక్కడ అమ్ముతున్న తాజమహల్ బొమ్మలు, తోటి యాత్రికులు కొంటూంటే, ఎందుకండీ కొంటున్నారని అడిగితే ఇది ప్రేమికుల ప్రేమ గుర్తు.. ఆనాడు షాజహాన్ ముంతాజ్ కోసం కట్టిన ప్రేమచిహ్నం ఈ తాజమహల్, కనీసం మనల్ని లేదా మనం ప్రేమించే వాళ్ళకి ఇది కొనిస్తే బావుంటుంది కదా! అని వివరిస్తే, తను ప్రేమించే ప్రేమించబడేది ఎవరాని ఆలోచించి, అవును పాపం, కాంతం నాకోసం రోజూ బోల్డు వండిపెడుతుంది అని ఒకటి కొని పెట్టెలో పెట్టుకున్నాడు. అది తీసుకున్నాకా అతనికి ఏదో తెలియని ఆనందం కలిగింది.

యాత్రలో భాగంగా ఆ రోజునించి హరిద్వార్ మీదుగా బస్ లో

# తెలుగు కళా సమితి దీపావళి (2019) సంబరాలు : చిత్ర మాలిక




















బయలుదేరి ఘాట్ రోడ్డులో మిగిలిన ప్రయాణం, బస్ లో అందరూ కబుర్లు చెప్పుకుంటూ భక్తి పారాయణాలు చేస్తుంటే అతను ఒక్కడు వెనకాల సీటులో చిన్నపిల్లాడిలా బయటకి  బస్సు కిటికీ లోంచి చూస్తున్నాడు.

అతనితో అందరూ బాగా కలిసి పోయారు. ఏం కిట్టయ్య గారు మీ ఆవిడని కూడా తీసుకు రాలేకపోయారూ అంటే,

"మా ఆవిడ ఎక్కడికి కదలదండి, ఆవిడ కనీసం పక్కనున్న అన్నవరం కూడా వెళ్ళదు, గుళ్ళల్లో జనం ఎక్కువ ఉంటారు నేను రాను అంటుందండి ఆవిడదంతా అదో ధోరణి" అన్నాడు.

గబుక్కున ఆవిడ జ్ఞాపకం వచ్చి ఇంటికి ఫోన్ చేసి కాంతం ఎలా ఉన్నావు? కాఫీతాగావా? అని అడిగాడు. నేను చాలా బిజీగా ఉన్నాను తర్వాత చేస్తాను అని చెప్పగానే, అతని అమ్మకి ఫోను చేసి రోజూ మొత్తం జరిగిన విశేషాలు ఈ రోజు గంగోత్రి వెడుతున్నాం, ఈ రోజు ఉత్తరకాశీ వెడుతున్నాం అని అన్నీ పూసగుచ్చినట్టు చెప్తూంటే అందరు నవ్వేవారు. ఒక వారం గడిచాకా అతనికి ఇంటిమీద బెంగ మొదలైంది. ఇప్పుడు కాంతం ఏం చేస్తూ ఉంటుందో అని అనుకున్నాడు.

పిల్లెంకలో కాంతం చావిట్లో ఉయ్యాల బల్లమీద ఊగుతోంది. ఆమెకి చాలా బోరుకొడుతోంది, ఇల్లంతా బావురుమంటోంది, ఏదో వెలితి, దిగులు ఆమెకి మొదలయ్యాయి.ఇంట్లో ఉన్నంత సేపూ ఆయన్ని ఏదో మాటలతో సాధించేదాన్ని, పాపం ఒక్కసారికూడా ఎదురు పల్లెత్తు మాటాడి ఎరగరు? అని మథన పడింది. ఆమెకి భర్తకి ఫోన్ చేయాలనిపిం చేసింది. అవతల కిట్టయ్య ఫోను ఎత్తి హలో! అని ఎవరూ కాంతం! అని ఫోను మరీ చెవిదగ్గరకు పెట్టుకొని ఆశ్చర్యంగా ఏం చెప్తుందా అని ఎదురు చూస్తున్నాడు. ఆమెకి అతనితో ఎప్పుడూ కరకుగా మాట్లాడడం అలవాటైపోయి సున్నితంగా, ఏం మాట్లాడాలో తెలియక ఎలాఉన్నారండి అని అతికష్టం మీద అంది. కాఫీ తాగావా కాంతం! అని అడిగాడు, అదే అతని పలకరింపు! మీరు జాగ్రత్త అని ఫోను పెట్టేసింది.

యాత్రలో అతనితో కలసిన మిగిలిన వాళ్ళందరు ఈ భారీశరీరంతో అతను ఎలా ఈ ఎత్తైన కొండలు గుట్టలు ఎక్కగలడో లేదో అనుకున్నా ఏదో దైవానుగ్రహం వల్ల బాగానే అతను నడవగలిగాడు. అన్నీ చూడగలిగాడు. కేదార్ నాథ్ కి హెలికాప్టర్ దగ్గర మాత్రం పాపం అతని ఓవర్ వెయిట్ కి మరింత అదనపు చార్జీలు పడ్డాయి. లక్ష్మీపతి గారు మేనేజ్ చేయబట్టి కొంతవరకు తగ్గాయి. ఖర్చు అయినా అతను కేదారేశ్వర దర్శనానికి పొంగిపోయి "ఉబ్బులింగడు " అయ్యాడు.

బ్రహ్మ కపాలానికి వచ్చే ముందు అతను వాళ్ళ అమ్మని అడిగి రాసిన పితృదేవతల పేర్లు గోత్రాలు, మిగిలిన దగ్గరవాళ్ళ పేర్లు రాసితెచ్చుకొని వాళ్ళందరి పేరు పేరునా పిండప్రదానాలు చేసి ఆనందంతో "మరింత పొంగిపోయాడు."

తిరుగు ప్రయాణంలో అందరు హరిద్వార్ లో యాత్ర కొస్తే పాత్ర కొనాలిట అని చాలా కొన్నారు. ధావళీ కొందామని అది అతని కైవారంచాలక కొనలేక నాది ఊబ శరీరం అని బాధపడ్డాడు. కాంతానికి మంచి చీర కొనాలి అని అందరూ చీరలు ఎక్కడ కొంటారని వాకబుచేసి అడిగాడు, కిట్టయ్య గారు! ఢిల్లీలో కన్నాట్ ప్లేస్ లో కొందాం! అన్నారు. మా కాంతానికి ఒక మంచి చీర సెలక్టు చేయమని వాళ్ళని కోరాడు. ఢిల్లీ లో కాంతానికి చీర కొని దాన్ని పదిలంగా పెట్టెలో పెట్టుకొన్నాడు. ఇది చూసి కాంతం ఎంత ఆనందిస్తుందో? లేదా దుబారా చేసారంటుందో అని సందిగ్ధంగా ఉన్నాడు. తిరుగుప్రయాణం విమానం ఎక్కి విశాఖలో దిగి కాకినాడ మీదుగా పిల్లెంక వెడదామని లక్ష్మీపతి గారు చెప్పడం తో మొట్టమొదట సారి విమానం ఎక్కుతున్న కిట్టయ్య కి భయం పట్టుకుంది ఎలా ఉంటుందో చెక్ ఇన్ లో ఎలా ఉండాలో, పెట్టెలో ఉన్న గంగ చెంబులు అవీ తీసేస్తారేమోననీను, తన భారీకాయం విమానం సీట్లో పడుతుందో లేదోననీను, అంత ఎత్తున ప్రయాణం చేయడం ఎక్కడైన ఏమైనా అవుతుందేమేనని, తనకి ఏదైనా అయితే కాంతం పరిస్థితి ఏంటో అని అసలే పిల్లలు కూడా లేరని బాధ పడ్డాడు, మళ్ళీ ఎప్పుడూ ఎక్కని విమానం ఎక్కొచ్చని ఆనందం, ఈ మనః సంఘర్షణ లో ఉన్న అతనిని మిగిలిన వాళ్ళు కూడా దగ్గరుండి తీసుకెళ్ళి విమానం లో కుదేసారు.

పిల్లెంక ఊర్లోకి ఆటోలో వెడుతూ ఎక్కడ తిరిగినా ఇల్లే కదా సుఖం అని అనుకుంటూ మా ఇంటికి వచ్చేసాను అనుకొని ఆనందంగా ఇంట్లోకి అడుగు పెట్టిన కిట్టయ్య కళ్ళల్లోకి కాంతం ప్రేమగా చూస్తూ గుమ్మం దగ్గరే ఉండండి దిష్టి తీస్తాను అని ఉప్పు మిరపకాయలతో దిష్టి తీస్తూ ఊళ్ళో వాళ్ళందరూ మీ ఆయనే అంత పెద్ద యాత్రకి వెళ్ళడం అని ఒకటే ఏడుపు!  అని తిట్టింది వాళ్ళని. ఫ్రిజ్ లోంచి నీళ్ళు ఇచ్చింది తాగడానికి. అతను కాఫీ తాగి తను చూసిన ఊళ్ళగురించి, యాత్రల గురించి వివరిస్తూ ఉంటే చెప్పుదురుగాని లేచి స్నానం చేసి రండి! ఎప్పుడనగా ఏం తిన్నారో! భోజనం వడ్డిస్తాను త్వరగా రండి! అనగానే అవును ఆకలేస్తోంది! అనగానే జాలిగాను, మరింత ప్రేమగాను భర్తకేసి చూసింది. ఆ చూపు పరికించిన కిట్టయ్యకి ఆమెధోరణి అర్థం అవ్వలేదు.సాయంకాలం కొబ్బరిచెట్ల గాలి ని ఆస్వాదిస్తూ అరుగుమీద చాపల మీద కూర్చున్నారిద్దరూ! కాంతం! మనం ఒక పిల్లాణ్ణి పెంచుకుందామా! అని నెమ్మదిగా అనగానే! మనకీ వయస్సులోనా? నాకు మీరు! మీకు నేను! చాలదూ! అని అతని కేసి మరింత ప్రేమగా చూసింది! అతనికి అర్థం కాలేదు అంటే! అనగానే మొద్దు అని ముద్దుగా నెత్తిమీద చిన్నగా మొట్టింది. కిట్టయ్య ఈమెకి నేనంటే ప్రేమే అనుకొని తను తెచ్చిన తాజమహల్, చీర ఆమెకి ఇచ్చాడు. చూడు నీకు నచ్చుతుందో లేదో! అంటే చాలా బావున్నాయి అన్నీ అని అపురూపంగా అతన్ని చూసింది.



## తెలుగు కళా సమితి
## దీపావళి (2019)
## నృత్య, సంగీత, క్రీడా పోటీలు
## చిత్ర మాలిక















# కవచం

పి. వి. శేషారత్నం

దడదడలాడుతున్న గుండెతో నడుపుతున్న టాక్సీని తన వీధి లోకి తిప్పాడు కిరీటి.

రెండేళ్లుగా ఉద్యోగాల వేటలో విసిగిపోయి చివరికి ఫ్రెండ్ సలహామీద ఈ దారి పట్టాడు. ఇంత బ్రతుకూ బ్రతికి ఇంటి వెనకాలే చావడం అంటే ఇదేనేమో!

ఇల్లు దగ్గరకు వస్తోందంటేనే చిరాకు కలుగుతోంది. అబ్బ...రాత్రయ్యేసరికి రోడ్డు మీద నిత్యం ఒకటే భాగోతం! మనుషుల్లాగే వాటికీ పడదో ఏమోగానీ నల్లకుక్క, మచ్చల కుక్క తీవ్రంగా పోట్లాడుకుంటూనే ఉంటాయి. బలవంతులదే రాజ్యమన్నట్టు కాస్త బలమైన నల్లకుక్క, మచ్చల కుక్కని కరచి పారిపోతే... కుయ్యోమంటూ కూలపడిపోతుంది మచ్చల కుక్క.

"తమ ఇంటి తలుపు సందులోంచి దీపం వెలుగుతున్న సూచనగా సన్నటి వెలుగు బయటకి ప్రసరిస్తోంది.అంటే...హూ...అమ్మ నాకోసం ఇంకా మేలుకునే వుందన్నమాట...వద్దన్నా వినదుకదా!"

కొడుకు అడుగుల చప్పుడు విని అన్నపూర్ణమ్మ కళ్లు నులుముకుంటూ లేచింది. "రోజూ యాక్సిడెంట్ల గురించి వింటూంటే నువ్వింటికొచ్చేదాకా మా ప్రాణాలు అల్లాడిపోతున్నాయిరా! అంత చదువు చదివి దర్జాగా ఏ దొరబాబులాంటి ఉద్యోగమో చేసుకోక ఈ డ్రైవరు పనేంటిరా చిన్నా?"

కోపంతోబాటు తల్లి అమాయకత్వానికి జాలేసింది కిరీటికి.

"ఈదేశంలో చదువుకు తగిన ఉద్యోగం రాదని తేలిపోయాకే కదమ్మా నేనీ వృత్తిలో మొదలెట్టాను. అందుకే మనకి ఇప్పుడు ఏదో నాలుగు వేళ్లు నోట్లోకి పోతున్నాయి. ఎలా మానమంటావు చెప్పు. చెల్లి పెళ్లి చేయాల్సిన బాధ్యతకూడా వుందికదా!"

"సరేలేరా నాయనా? ఏంచెప్పినా ఇంకేదో చెప్పి ముందుకాళ్లకు బంధం వేస్తావు."

"అన్నపూర్ణా! చేసేది డ్రైవరు పనే అయినా మనవాడు స్వతంత్రంగా నిజాయితీగా కష్టించి బ్రతుకుతున్నాడు. మనకది చాలదా? వచ్చీరాగానే వాడిని విసిగించద్దని నీకెన్నిసార్లు చెప్పాను?"

నాన్న కూడా పడుకోలేదన్నమాట... ఈ తల్లిదండ్రులింతే... తనలాంటి అసమర్ధులున్నంతవరకు వాళ్లకి నిద్ర రానేరాదు.

చేతిలోని నల్ల బ్యాగ్‌ని అర్జంటుగా పాతకాలపు కర్రబీరువాలోకి తోసేసి మంచంమీద వాలిపోయాడు కిరీటి.

"అదేమిటిరా నాయనా...అన్నంతినకుండానే మంచం ఎక్కేస్తున్నావ్?"

సమాధానం చెప్పకుండానే కిరీటి కళ్లు మూతలు పడిపోయాయి. అతని ఒళ్లు జ్వరంతో సలసలా మరిగిపోవడం మొదలెట్టింది. జరిగిన సంఘటన గుర్తొచ్చి తలలో నరాలు పొంగిపోవడం మొదలెట్టాయి. కిరీటి మనసు రెండు గంటల వెనక్కి తిరిగింది.

+++

పట్టరాని ఆనందం కలిగింది కిరీటికి. "ఇవాళ నక్కతోకని తొక్కి వచ్చినట్టుంది... చాలాదూరం... మంచి బేరం"

"ఏంబాబూ...మీటరుమీద రెట్టింపు ఇస్తాలే."

"కానీ మీరు...?"

ఆ వృద్ధుడు నవ్వాడు. "ఎయిర్‌పోర్టులో దిగి ఇలా రోడ్డు వరకు వచ్చి నీ టాక్సీ ఆపానేమిటా అని ఆశ్చర్యపోతున్నావా? అందుకు కారణముందిలే. ఎప్పుడో వదిలేసిన పుట్టిన గడ్డను చూడగానే నాలుగడుగులు వెయ్యాలనిపించిందయ్యా. ఇంతకీ...వస్తావా?"

"ఎక్కండి." క్యారీబ్యాగ్ భుజానికో నల్లబ్యాగ్ తప్ప పెద్ద లగేజి లేదు.

"దగ్గర్లో మంచి హోటల్లో కాస్త టిఫిన్ చేసి వెళ్దాం బాబూ! బాగా ఆకలేస్తోంది. పైగా మన రుచులు తినాలని నాలుక పీకేస్తోంది."

"అలాగేనండి. ఎంతలేదన్నా మీఇంటికి చేరాలంటే....రెండు మూడు గంటలు పడుతుంది. ఇదిగో చిన్నదయినా ఈ హోటల్‌లో మీకిష్టమయిన అన్ని రకాల తెలుగు టిఫిన్లు దొరుకుతాయి. దిగండి."

"నువ్వూ తిందువుగాని రా బాబూ!"

"పరవాలేదు మీరు వెళ్లండి."

"ఊహూ నువ్వూ రావాల్సిందే...నేను మనుషులకోసం మొహంవాచిపోయి ఉన్నాను. కాదనకు."

ఏదీ ఇప్పుడేగా ఈగడ్డమీద అడుగుపెట్టాడు. ఆకాశాన్నంటిన ఇక్కడి మనుషుల స్వార్థ బుద్ధులు తెలిస్తే ఈయన సున్నితమైన భావాలన్నీ ఎగిరిపోతాయిలే అనుకున్నా కిరీటికి ఆ వృద్ధుని తీరు ఆశ్చర్యం కలిగించింది. ఎందుకంటే టాక్సీఎక్కిన ప్రతివాడికీ తామంటే అలసత్వమే. ఈయన కాస్త మర్యాదస్తుడిలా వున్నాడు. పాతకాలంవాడు కదా!

కిరీటి వేరే టేబుల్ దగ్గర కూర్చుంటానంటే ఒప్పుకోలేదు ఆయన. తన ఎదురుగానే కూర్చోబెట్టుకున్నాడు.

తింటున్నంతసేపు మాత్రమే కాదు తర్వాత టాక్సీ నడుస్తున్నంతసేపు ఆయననేదో ఒకటి మాట్లాడుతూనే ఉన్నాడు.

"వైజాగ్ ఎంత మారిపోయిందో బాబూ! ఒకప్పుడు ఇక్కడ ఎయిర్‌పోర్టు ఉందనే మాకు తెలిసేది కాదు."

అబ్బా ఎంత పెద్ద బిల్డింగులొచ్చేసాయి. మా టైములో

రామకృష్ణా బీచ్ తప్ప ఇంత బీచ్ ఎక్కడుంది. భీమిలి వెళ్లే రోడ్డు అంతా బురద...గోతులు...వైజాగ్ రావాలంటే ఒక్క బస్సుగాని కారుగాని ఉండేవి కాదు."

"మనిషి దూరమైన తర్వాతే బాబూ మమతలు తెలిసేవి. దుబాయ్ వెళ్లి పదేళ్లపాటు డబ్బు కోసం అక్కడ కుక్కలా బానిసలా బ్రతికాను...ఎవరికోసం? నాకుటుంబం ఉద్ధరణ కోసం...కానీ నాఅనేవాళ్లు దగ్గర లేకపోయాక ఎంత సంపాదిస్తున్నా దానిని చూసి ఏం సంతోషం కలుగుతుంది చెప్పు? అందుకే మరింక అక్కడ కాంట్రాక్ట్ పొడిగించుకోలేదు. నాభార్యా పిల్లలను చూడాలని ఎంత తపించిపోతున్నానో నీకెలా చెప్పను? డబ్బు సంపాదించగలంగానీ ఆత్మీయులెక్కడ దొరుకుతారు?"

"ఇక్కడ డబ్బు సంపాదించడం ఎంత కష్టమో అనుభవిస్తున్నవాడిని నన్నడగండి చెప్తాను. అయినా డబ్బుంటే ఆత్మీయులకు కొదవేముంటుందిలెండి తెప్పలుతెప్పలుగా కప్పలు వచ్చినట్టు అలా అలా పెరిగిపోతారని పెద్దవాళ్లు మీకు తెలియదా!"

"నువ్వెంత చెప్పు రక్తసంబంధాన్ని మించినది లేదు బాబూ! మావాళ్లని చెప్పలేనంత ఆనందంతో ఉక్కిరిబిక్కిరి చెయ్యాలని వాళ్లకి ఉద్యోగం మానేసాననికూడా చెప్పకుండా ఇలా వచ్చేసాను. నన్ను అకస్మాత్తుగా గుమ్మంలో చూసి వాళ్ల ముఖాల్లో ఆనందం చూడాలనివుంది. ఎంత ఆశ్చర్యపోతారో...నువ్వూహించలేవు. ఏదీ ఆ వాటర్ బాటిల్ ఇటియ్యి. టాబ్లెట్ వేసుకుంటాను."

"మీ భార్యా పిల్లలు భీమిలిలో ఉంటున్నారా?" బాటిల్ అందించాడు కిరీటి.

"అవునుబాబూ! ఇక్కడ...నాలాగే వయసు పైబడిన నాభార్యకి గుండె జబ్బు దాపురించింది. ఆపరేషన్ చేయించాలి. నేను దుబాయ్ వెళ్లినపుడు పసివాళ్లయిన నా పిల్లలు ఇపుడు పెళ్లికి ఎదిగారు. వాళ్లని ఈ పదేళ్లుగా ఫొటోల్లోనో స్కైప్‌లోనో చూడడమే. వాళ్ల పెళ్లిళ్లు చేసేసిన తర్వాత కూడా మహారాజులా బ్రతికేంత సంపాదించాను తెలుసా?ఈ జీవితానికిది చాలదంటావా బాబూ?అదిసరేగానీ నీ మాటల్లో మనుషులపట్ల కోపం అపనమ్మకంటింకా ఏదో తపన కనిపిస్తోంది. ఎందుకు?జీవితంలో దెబ్బ తిన్నావా?"

కిరీటి గాఢంగా నిట్టూర్చాడు." వైజాగ్ ఎంతమారిపోయినా మాలాంటి మధ్యతరగతి బ్రతుకులు ఏమీ మారలేదు. దేశంలో అవినీతి పెరిగిపోయి నాకు ఉద్యోగంరాలేదు. రెక్కలు ముక్కలు చేసుకుని బండి నడిపినా డబ్బు చాలడంలేదు. అప్పులు...కుటుంబ బాధ్యతలు. మీరుకూడా ఇక్కడ సరైన ఉపాధి లేకేగా దుబాయ్ వెళ్లింది? అయినా ఈకాలంలో ఇక్కడ నీతీనిజాయితీలకు చోటెక్కడుందిలెండి."

"అలా అనకుబాబూ...ఆ దేశంలోని కాఠిన్యం చూసివచ్చి అనుభవంతో చెబుతున్నాను. మనదేశంలో ఇంకా మానవత్వపు విలువలు పూర్తిగా నశించిపోలేదులే. ఇదిగో కాస్త దగ్గరదారిలో త్వరగా తీసికెళ్లు. నావాళ్లని చూడాలని ఎంత ఆరాటంగానో వుంది. ఆ నువ్వు ఏమాత్రం నిరాశ పెంచుకోకు...నీకూ మంచిరోజులొస్తాయిలే."

ఆయన ఆరాటానికి కళ్లు చెమ్మగిల్లి టాక్సీ రూట్ మార్చాడు కిరీటి.

"ఏం మంచిరోజులు లెండి. ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక, మరోపక్క నాన్నగారికి ఆపరేషనుకు అవసరపడి నాలుగేళ్లక్రితం ఇంటిమీద అప్పుతీసుకున్నాం. అది వడ్డీతో సహా పాపం పెరిగినట్టు పెరిగిపోయి నా సంపాదననంతా మింగేస్తోంది. రాత్రిబగళ్లు కష్టపడుతున్నా ఫలితం తక్కువే...ఇంకా చెల్లి పెళ్లి...వుంది. ఇవాళమాత్రం మీ దయవల్ల మంచి బేరం తగిలింది నాకు. ఆ...మీ ఏరియా దగ్గరలోకి వచ్చేస్తున్నాం. ఈ జంక్షన్‌నుంచి ఇంకా 5కిలోమీటర్లుంటుంది మీయిల్లు...కొండగుర్తులు చెప్పండి. క్షణాల్లో దింపేస్తాను. ఏంటి మాట్లాడరు?" అంటూ కిరీటి వెనక్కి తిరిగిచూసాడు.

"అరె నిద్రపోతున్నారా?... ఏవండోయ్... మిమ్మల్నే..." తన మాటలకి సమాధానం రాకపోయేసరికి టాక్సీ ఆపి ఆందోళనగా ఆ వృద్ధుని ఒంటిమీద చెయ్యేసాడు కిరీటి.

"అరె... ప్రాణం పోయినట్టుంది. హార్ట్ ఎటాక్ యేమో! మైగాడ్ ! అరె...ఈ నల్లబ్యాగ్‌లో అడ్రసుంటుందేమో...బాప్‌రే....కరెన్సీ నోట్ల కట్టలు...ఎయిర్‌పోర్టులో మార్చుకుని ఉండాలి. అందుకేనా ఈయన అంత ధీమాగా ఉన్నాడు." కిరీటి మైండ్ బ్లాంక్ అయింది కాసేపు.

"ఇప్పుడేమిటి కర్తవ్యం? ఇతన్ని ఈ లగేజ్‌తో సహా ఈ అడ్రసులో అప్పజెప్తే...వాళ్లు సవాలక్ష ప్రశ్నలేసి...ఈ డబ్బు ఇంకా ఉండాలి ఏంచేసావంటే? అమ్మో లేనిపోని చిక్కుల్లో ఇరుక్కోవలసింటుందేమో.... ఇప్పుడేం చెయ్యాలి... డబ్బు..... డబ్బు..... డబ్బు....?

రోజూ నా ఘోషకి విసుగెత్తిపోయి...ఇప్పుడు అనుకోకుండా నాకు భగవంతుడు ఈ అవకాశం కల్పించాడేమో....ఇంతడబ్బు నాకు దక్కింది.కానీ...నో...వేరే ఆలోచన వద్దు...ఈమనిషి వస్తున్నట్టు ఇంట్లోవాళ్లకి తెలియదు. నాటాక్సీ ఎక్కినట్టు కూడా ఎవరికీ తెలియదు. ఈ డబ్బు తీసుకుని ఈ శవాన్నీపక్కనే పొదల్లో ఉంచి పోతే సరి...అస్థిపంజరమయిపోవాలిగాని...ఎవరూ రాని ఈదారిలోని చెట్ల మధ్యలో శవం ఎవరికంటా పడే అవకాశమే ఉండదు. " ఆలోచన రావడమే తడవు మరింక ఆలస్యం చెయ్యలేదు కిరీటి.

***

కిరీటికి బాగా ఉక్కబోయడంతో చటుక్కున తెలివి వచ్చింది.

"చెమటతో ఒళ్లంతా ఎలా తడిసిపోయిందో...ఇదేమిటి ఇలా పడుకుండికుండిపోయాను...టాక్సీ వెయ్యడానికి వెళ్లొద్దూ...ఇంకా చీకటి విడిపోలేదు. ఇపుడు టైమెంతయిందో?" కిరీటి లేవబోయాడు. ఒళ్లంతా నొప్పులు...నిస్త్రాణగా మళ్లీ వాలిపోయాడు.

బయటగదిలోంచి మాటలు వినిపిస్తున్నాయి.

"సుజా...ఏంతల్లీ ఇంతాలస్యమయింది? అమ్మ నువ్వు అర్జంటుగా సమీర ఇంటికి వెళాల్సివచ్చిందని చెప్పింది. వాళ్లంతా కులాసాయేనా?" తండ్రి మాటలకి సుజాత గాఢంగా నిట్టూర్పు వదిలింది.

ఆయన తమకి తండ్రి మాత్రమేకాదు చిన్నతనంనుండి తమకు అక్షరాలు నేర్పడంలో ఆదర్శాలు నింపడంలో ఆనందాలు పంచడంలో అనుబంధాలు పెంచడంలో మనుషులను కలపడంలో మనుషులని మలచడంలో తర్ఫీదునిచ్చిన ఉత్తమ ఉపాధ్యాయుడు. సమాజంలో అందరి ఉన్నతిని తన ఉన్నతిగా భావించే నిస్వార్థ ప్రేమికుడు. తన శిష్యుల్లాగే కన్నబిడ్డల జీవితాన్ని కూడా ఉన్నతంగా తీర్చిదిద్ది తమని సమాజంలోకి వదిలిపెట్టి ఎంతో స్వేచ్ఛనిచ్చాడు. అందుకే తను రాత్రి తెల్లవార్లూ ఇంట్లో లేకపోయినా ఆయనకు అపనమ్మకంలేదు. తన పిల్లలు దారి తప్పరని ఆయనకు ప్రగాఢ నమ్మకం. కానీ లోకం ఎంత మాయదారిగా మారిపోయిందో ఆయనకు తెలియడం లేదనే ఆమె కంఠంలో అంతులేని బాధ..."రాత్రంతా హాస్పిటల్‌లోనే ఉండాల్సివచ్చింది నాన్నా..."

"ఏమయిందమ్మా!"

"సమీర నాన్నగారు దాని చిన్నతనంలోనే దుబాయ్ వెళ్లిపోయారు కదా! ఆయన డబ్బులు పంపిస్తున్నా పాపం వాళ్లమ్మగారొక్కరే ముగ్గురాడపిల్లలనీ పెంచుకొస్తున్నారా? సమీర చెల్లెలు సరోజ మెడిసిన్ చదువుతోంది. ఆ అమ్మాయిని వాళ్ల అనాటమీ ప్రొఫెసరే ఉచ్చంనీచం లేకుండా వేధిస్తున్నాడు. తనకి లొంగడం లేదని చాలా దాబుణంగా దొంగతనం అంటగట్టి అందరిముందూ అవమానించాడుట... దాంతో సరోజ ఇంటికి వచ్చేసి రోజంతా తలుపులు మూసుకుని ఏడుస్తూనే ఉందిట. అవమానం భరించలేక ప్రాణంతీసుకునే ప్రయత్నం చేసేసరికి వాళ్లమ్మగారసలే గుండెజబ్బు మనిషి కదా! గాభరాతో స్ట్రోక్ వచ్చి పడిపోతే ఆస్పత్రిలో చేర్చాం. బంధువులు వాళ్ల నాన్నగారికోసం ఎంత ప్రయత్నించినా ఆయన దొరకడంలేదట నాన్నా!"

ఆ సంభాషణ వింటున్న కిరీటి అదిరిపోయాడు.

"భగవంతుడా! ఆ వృద్ధుడు...సమీర తండ్రి కాదు కదా! ఆయన తన భార్యకి గుండెజబ్బని చెప్పాడు. ముగ్గురాడపిల్లలని కూడా చెప్పాడు. ఆకుటుంబం ఇదేకాదుకదా! దబ్బెంత పాపిష్టిది. కాదుకాదు నేనెంత పాపిష్టివాడిని" "మనదేశంలో ఇంకా మానవత్వపు విలువలు పూర్తిగా నశించిపోలేదులే బాబూ "అన్న మనిషి డబ్బు కాజేసాను దురాశతో." కిరీటిలో ఆందోళన పెరిగిపోయింది.

"అయినా ఉపాధ్యాయవృత్తిలో ఉండి బిడ్డల్లాంటి శిష్యులపట్ల అలా మానవత్వాన్ని మరిచిపోయే వాళ్లనేమనాలి నాన్నా!"

తండ్రి నిట్టూర్చాడు." నాటే విత్తు మంచిదయితేనే చెట్టు మంచిదవుతుంది. తల్లిదండ్రుల సరైన మార్గదర్శకత్వం లేకపోతే కూడా ఇదిగో ఇలాంటి సమస్యలే వస్తాయి. అప్పుడే ఇలాంటి తలదించుకునే సంఘటనలుగాని వాటికి అతి సున్నితంగా స్పందించి ప్రాణాలు తీసుకోవడం గానీ జరుగుతుంది సుజాతా!"

అన్నపూర్ణకి కోపం వచ్చింది." పవిత్రమైన వృత్తిలో ఉండి ఇలా ప్రవర్తించడం పైగా అయినింటి ఆడపిల్లని దొంగ అనడమేంటి?"

"చెప్పానుగా అన్నపూర్ణా... ఈ ప్రపంచాన్ని శాసించ గలది సంపదాకాదు...మేథా కాదు...నైతిక ప్రవర్తన. నైతిక విలువలు కలిగిన వివేకమే లోకాన్ని పాలిస్తుంది."

అన్నపూర్ణ మనసు నీరయిపోయింది. "ఇటువంటి సమయాల్లోనే కుటుంబ సభ్యులు ఆపిల్లకు రక్షణకవచంలా అండదండగా ఉండాలి సుజాతా!"

సుజాత నిట్టూర్చింది. "వాళ్ల నాన్నగారితో మాట్లాడితే అయినా వాళ్లకి కాస్త ధైర్యమొచ్చేదమ్మా కానీ...రోజూలాగ...ఆయన నుంచి ఫోన్ రాలేదని కూడా కంగారు పడుతున్నారువాళ్లు. మధ్యలో అదో బాధ. అసలు ఈ ప్రొఫెసర్‌లాంటివాళ్లని ఏంచేసినా పాపంలేదు నాన్నా!"

"చెప్పానుకదమ్మా...సంస్కృతీ సంప్రదాయాలనేవి అందరికీ కుటుంబపరంగా అందాల్సినవి. నాబిడ్డల విషయంలో మాత్రం నాకు పరిపూర్ణ విశ్వాసం ఉంది.ఎపుడైనా తప్పు చేసినా వెంటనే సరిదిద్దుకోగల సంస్కారం మీఅమ్మ మీకు కలిగించిందనే అనుకుంటున్నాను."

ఆ మాటలతో లోపలనుంచి అంతా వింటున్న కిరీటి లోలోపలే కుమిలిపోయాడు.

"అమ్మానాన్నలకు నామీద ఎంత విశ్వాసం...కానీ నేను వివేకం మరిచిపోయి కుక్కకంటె హీనమైన పని చేసాను."

తల్లిమాటలు తగ్గుస్వరంలో వినిపించాయి. "మీనాన్నగారికి నామీద ఎంత నమ్మకమో నాకూ మీఇద్దరిమీదా అంతే విశ్వాసమమ్మా...నాబిడ్డలెప్పుడూ నీతి తప్పరు...సుజాతా! ఎప్పుడైనా నా విశ్వాసం వమ్మయితే....మా ప్రాణాలమీద మాకు వ్యామోహం లేదు."

సుజాత కంఠంలో బాధ. "అవేంమాటలమ్మా...అన్నయ్యగానీ నేనుగానీ మీమనసు నొప్పించే పనులేమీ చెయ్యడంలేదుగదా."

"ఇదిగో అన్నపూర్ణా...మాట వచ్చింది కనుక చెబుతున్నాను. ప్రతి ఉద్యోగంలోను కష్టసుఖాలుంటాయి. మన కిరీటి బ్రతుకు తెరువుకు ఎంచుకున్న డ్రైవరు ఉద్యోగం మానెయ్యమని ఇంకెప్పుడూ నీ ప్రశ్నలతో వేధించకుసుమా!"

"అలాగేనండీ! వాడు చేసే ఉద్యోగం కంటే మనకి వాడి నీతీ నిజాయితీలు ముఖ్యం."

కిరీటి మరింక ఆగలేక తల కొట్టుకున్నాడు.

"అమ్మా...నీనమ్మకాన్ని నేనెప్పుడూ వృధా చెయ్యనమ్మా...ఈ డబ్బు సంచిని ఆప్రయాణీకుడి కుటుంబానికి అందించడం, ఆ వ్యక్తికి దగ్గరుండి అంతిమ సంస్కారం...చెయ్యకపోతే...నేను మన వీధిలోని నల్ల కుక్క కన్నా నికృష్టమైన వాడితో సమానం. ఇపుడే వెళ్తాను...ఇంక

ఆలస్యం చెయ్యను."

సంధించిన బాణంలా గదిలోంచి బయటికి వచ్చి ఎవరివైపు చూడకుండా చేతిలో సంచీతో బయటికి దూసుకుపోతున్న కొడుకును చూసి అన్నపూర్ణ అల్లాడిపోయింది. తల్లిమనసు మరి. తన సంతాన రక్షణ తప్ప ఆమెకి మరో ఉన్నతాశయం లేదు. ఆమె వాత్సల్యమూర్తేకాదు, కర్తవ్య బోధా పరాయణ కూడా. లోకంలోని కల్మషం బారిన పడకుండా బిడ్డలకు ఆమె పలుకులే రక్షణ కవచమవాలని కోరుకుంది..

"అయ్యయ్యో రాత్రంతా ఒళ్లెరగని జ్వరం...ఎక్కడిరా చిన్నా ఆపరుగు ?"

అన్నయ్య ఏంచెయ్యబోతున్నాడో ఊహించిన సుజాత మనసులోనే తేలికగా నిట్టూర్చింది.

"అన్నయ్యా! మనంనాటిన విత్తులు అమృత ఫలాలే ఇస్తాయి అని అమ్మానాన్నలకి మనమీద ఎంత నమ్మకమో విన్నావా? నూటనాలుగు డిగ్రీల జ్వరంతో నువ్వు రావడం, జ్వరంలో పలవరింతలు... అమ్మకు ఏమీ అర్థంకాక నాన్నగారితో చెప్పింది. నాన్నగారు నాకు "కీ" ఇచ్చారు. ఏడాది క్రితం ఎప్పుడో నాఫ్రండ్‌కి జరిగిన సంఘటనతో మొదలెట్టాం. అమ్మ మార్గదర్శకత్వం ఫలించింది.పిచ్చి అన్నయ్యా... మానవత్వం ఏదో ఒకపాలులో లేకుండా మనిషి పుట్టుకే రాదు. కొందరి మనుషుల్లో పెద్ద అక్షరాలతోను, మరికొందరిలో చిన్న అక్షరాలతోను ఉంటుంది. పెద్ద అక్షరాలు అందరికీ కనిపిస్తాయి. చిన్నవాటికే కళ్లద్దాల అవసరం ఉంటుంది."

కిరీటి ఎవరో తరుముతున్నట్టు అత్యంత వేగంగా టాక్సీలో నిన్నటి ప్రదేశానికి వెళ్లి ఆ తొలిసందె వెలుగులో ...తన కళ్ళ ఎదురుగా అమాయకంగా ప్రశాంతంగా నిద్రపోతున్నట్టున్న ఆ వృద్ధ ప్రయాణీకుని ముఖం...చూసేసరికి ...అతను తనపట్ల చూపిన వాత్సల్యం, నమ్మకం గుర్తొచ్చి అతని మనసు పూర్తిగా కరిగి నీరై కళ్ళ వెంట ప్రవహించి వెక్కివెక్కి ఏడ్చాడు.

దాని పేరే మానవత్వం... తర్వాత కిరీటి ఏంచేసాడనేది అప్రస్తుతం..

ఆరోజు సాయంత్రం ఇంటిలోపలికెళ్లేముందు అలవాటుగా రోడ్డుమీదికి చూసాడు కిరీటి.

మాంసపు ముద్దగా మారిన మచ్చల కుక్క కళేబరం ఇంకా అక్కడే ఉంది. పాపం ఎప్పుడూ మచ్చల కుక్కతో పోట్లాడి గెలిచే నల్లకుక్క ఆ మాంసంముద్ద చుట్టూ తిరుగుతూ అతి కష్టంమాద దానిని పెంట కుప్ప వరకు ఈడ్చుకొచ్చి కాలితో మట్టి తవ్వి చెత్తతో కళేబరాన్ని కప్పేసింది. తర్వాత దిగాలుగా అక్కడే కన్నీళ్ళు కారుస్తూ కూర్చుంది.

కిరీటి చలించిపోయాడు.

"నేను ఈ కుక్కకంటె కూడా హీనం కాకుండా అమ్మ మాటలు నాకు కవచమయ్యాయన్నమాట."

అందుకేగా మనుస్మృతి సైతం - ఉపాధ్యాయాన్ దశాచార్య: ఆచార్యాణాం శతంపితా|- సహస్రంతు పితౄన్మాతా గౌరవేణాతిరిచ్యతే|| అంటూ మాతృమూర్తికి మహోన్నత స్థానాన్నిచ్చింది?



# మళ్లీ మొలకెత్తాలని

## గొర్తి వాణీ శ్రీనివాస్

నిశ్శబ్దానికీ నిస్సందేహంగా ఒక రాగముందని
ఆర్తితో వినే గుండెకే అది స్ఫురిస్తుందని
మట్టి వాసనంత గాఢంగా జ్ఞప్తికి తెస్తాడు అతడు.

మెత్తని అడుగుల మట్టిపై మక్కువ తీర లేదంటూ
మెరక పొలాన్ని అరక దున్ని ఏరువాక రాగంలో
తను మమేకమైపోతుంటాడు.

దమ్ము నీళ్లలో మునివేళ్ళతో ముద్ద ముట్టించినట్టు
విత్తనాలను నేలమ్మ నోటికి
ప్రేమ రాగంగా గారంగా హత్తుతాడు.

ఎదురు చూపు ఎంత మధురమో
తన కంటి కొలుకు జాలు నీటి మొలక మెరుపు
చూడ మంటూ స్నేహ రాగ మందుకుంటాడు.

పసిదనాల పైరు తన ముద్దు బిడ్డ కంటె
చంటి బిడ్డ చాలా అంటూ
లాలి పాట గుండె గాలి ఊల లూదుతుంటాడు.
హరిత పైట ఆర బోసి వయసు పాల పొంగు పోసి
నవనవల నాజూకు పైరు నాట్య మాడుతుంటే,
రెండు చేతులా కంకులమ్మ పురిటి బిడ్డనెత్తిపట్టి
మేఘంతో దోబూచులాట ముచ్చటార ఆడుకుంటాడు
ఆశలన్నీ కుప్పపోసి , బంగారు రాశి వని దిష్టి తీసి
కళ్లలోని మెరుపు తోడు మేఘరాగం తరుముతుంటే
కళ్ళానికి చేతులడ్డు పెట్టి తల్లిలా తల్లడిల్లి పోతూ,
కరుణ రాగమాలపిస్తాడు.

తుఫాను తాకిన పక్షి రెక్క కెంత కష్ట మైన కానీ
విశాల జగతిలో విషాదాల జాడ చూడ కూడ దంటూ
ప్రశాంత రాగ మాలపిస్తాడు..
మెత్తని మట్టిలో కాలు పెట్టి మొక్కువోని ధైర్యంతో
మళ్లీ సరి కొత్త  ఉదయానికి తరలి   పోతుంటాడు.

# మనసును తాకిన పరిమళం

## గుమ్మా నాగమంజరి

శిశిరం ఆఖరి రోజులు. అప్పుడే ఎండ తన ప్రతాపం చూపిస్తోంది. సాయంత్రం 5 గంటలైనా ఇంకా వేడి తగ్గలేదు. బూరుగు పువ్వుల పరిమళం పల్చగా పరుచుకుంటోంది. కాలేజీలు, స్కూళ్ళు, ఆఫీసులు వదిలే వేళ... రోడ్డంతా గజిబిజిగా బిజీబిజీగా ఉంది. కాలంతో సంబంధం లేకుండా అన్ని పళ్ళు, కాయగూరలు లభిస్తూనే ఉన్నాయి, ఒక్క మామిడి తప్ప. అక్కడక్కడ మొక్కజొన్న కండెలు కాల్చుతున్న వాసన. బడి వదిలిన పిల్లలు గుంపులుగా అక్కడికి చేరుకుంటున్నారు.

వాళ్ళని తప్పించుకుంటూ వడివడిగా అడుగులేస్తూ బస్టాండుకు చేరుకున్నాడు రాఘవరావు. విజయనగరం వయా ధర్మవరం బస్సు వచ్చి నిలిచింది. పోలో మంటూ పిల్లలూ పెద్దలూ ఎగబడ్డారు. నిత్యం ఆ సమయంలో ఉండే రద్దీయే అది. ఇవాళ రాఘవరావు అన్యమనస్కంగా ఉన్నాడు. “మాస్టారు, మీకు సీట్ ఉంచాను. నెమ్మదిగా రండి” మాట వినిపించి తల ఎత్తి చూసాడు. డ్రైవర్ రాజు. చిరునవ్వుతో తలపంకించాడు రాఘవరావు మాస్టారు. ఎలాగో సందు చూసుకుని బస్సులో చొరబడి తనసీట్లో కూర్చున్నాడు. చుట్టూ కాలేజి అబ్బాయిలే.

మండల కేంద్రానికి కూత వేటు దూరంలోని ఒక ఉన్నత పాఠశాలలో గణితోపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు రాఘవరావు. సాధారణంగా లెక్కలుమాష్టారంటే పిల్లలకు భయం ఎక్కువ. రాఘవరావు స్వతహాగా సౌమ్యుడు కావడంతో పిల్లలను ఏనాడు కొట్టడం, బెదిరించడం చేయలేదు. పిల్లలు కూడా ఎన్నడూ తరగతిలో అల్లరి చేసింది లేదు. కానీ ఇవాళ ఒక పిల్లవాడు హోమ్ వర్క్ చేసుకుని రాకపోగా, గట్టిగా నిలదీస్తే తలపొగరుగా సమాధానం యిచ్చాడు. పిల్లలలో ఈ రకమైన ధోరణి భవిష్యత్తులో హానికరం అనే ఉద్దేశ్యంతో, మిగిలిన పిల్లలు వాడిని చూసి నేర్చుకోకూడదు అనే సంకల్పంతో వాడిని గట్టిగానే రెండు దెబ్బలు వేసాడు. వాడు మరింత పొగరుగా తరగతిలో నుంచి బయటకు వెళ్ళిపోయాడు. అప్పటికి ఆ విషయం మరచిపోయి, తరగతి కొనసాగించాడు. కానీ ఆ పిల్లవాడి ప్రవర్తన మనసులో ముల్లులా గుచ్చుకుంటూంది. మధ్యాహ్నం స్వల్ప విరామ సమయంలో ఆ పిల్లవాడి తండ్రి స్కూల్ కి వచ్చాడు.

“మాస్టారూ, మీతో కొంచెం మాట్లాడాలి”

“నేనే మీకు కబురుచేద్దామనుకున్నాను, మీవాడి ప్రవర్తన ఇవాళ కొంచెం చిత్రంగా అనిపించింది. ఎప్పుడూ ఇలా చెయ్యలేదు”

“నిజమే మాస్టారూ... నిన్న సాయంత్రం మేము సర్కస్ కి వెళ్దాం అనుకున్నాం. మా రవి, నేను రాను, ఆ టికెట్ డబ్బులు నాకు ఇచ్చేయండి అని పేచీ పెట్టేడు. నేను మందలించాను. అనవసరంగా అన్ని డబ్బులు వాడికెందుకు అని నా ఉద్దేశ్యం. అలిగి బయటకు వెళ్ళిపోయాడు. రాత్రి మేము ఇంటికి తిరిగివచ్చేవరకు వాడు కూడా ఇంటికి రాలేదు. వచ్చాక కూడా భోజనం చెయ్యలేదు. ఉదయం కూడా ఇంట్లో టిఫిన్ చెయ్యలేదు. మధ్యాహ్నం స్కూల్లో కూడా తినలేదట. ఇప్పుడు ఇంటికి వచ్చి పడుకున్నాడు. విషయం ఏమిటో మిమ్మల్ని అడుగుదామని ఇలా వచ్చేను”

“సరేనండి. నేను రేపు కనుక్కుంటాను. విషయం తెలియక నేను కూడా గట్టిగానే రెండు దెబ్బలు కొట్టేను. అయ్యయ్యో... ఎంతపని జరిగింది” నొచ్చుకున్నాడు రాఘవరావు. అదిగో అప్పటినుండి మనసంతా ఏదోలా తయారయ్యింది.

“ఒరేయ్ ఈ జోక్ చూసావా”

“ఏంట్రా అది”

“ఒక్కోసారి భార్యల అనుమానాలకు హద్దే ఉండదు.

భర్తకు బైపాస్ సర్జరి అయ్యింది.

భార్య సర్జన్తో : డాక్టర్గారూ మాఆయన గుండెల్లో వేరే ఆడది ఎవరైనా ఉన్నారా.

ఆ సర్జన్ కూడా ఏం తక్కువోడేం కాదు.

అందుకేకదమ్మా ఆపరేషన్ చేసి ఆవిడ్ని బైపాస్ చేసాను“

“హ హ హ... నేను ఇంకోటి చూపిస్తున్నా చూడు”

“సుజాత: ఈ రోజు మావారు ....

రెండు ముఖ్య మైన నిర్ణయాలు తీసుకున్నారు!!"

"ఏమిటో అవి?" అడిగా అమాయకంగా !!!

"1. పరాయి ఆడవాళ్ళ కేసి కన్నెత్తి చూడను!!

వావ్..." అన్నాను నేను .......

మరి రెండవది???

2. ఎవరినీ పరాయి వాళ్ళు అని అనుకోను!!!" అన్నాడు

ఈ మగ వాళ్ళని నమ్మనే కూడదు”

వాట్సాప్ లో వచ్చిన జోక్స్ వాళ్ళు పెద్దగా చదువుతూ ఉంటే

రాఘవరావు పెదాలపై కూడా నవ్వు చిలికింది.

"అరేయ్... ఇది చూడు..."

యుద్ధం వస్తే సరిహద్దుల్లో మేమూ పోరాడుతాం... ప్రధాని మోదీకి ఖైదీల సంచలన లేఖ.

పుల్వామా ఉగ్ర దాడి ఘటన గురించి తెలుసుకున్న ఖైదీలు స్పందించి తమ వంతు విరాళంగా రూ.50వేలు సేకరించి జవాన్ల కుటుంబాలకు సాయం.

పాట్నా: పుల్వామా ఉగ్ర దాడి ఘటన నేపథ్యంలో బీహార్ రాష్ట్రంలోని గోపాల్‌గంజ్ సబ్ డివిజనల్ జైలు ఖైదీలు సాక్షాత్తూ ప్రధానమంత్రి నరేంద్రమోదీకి లేఖ రాసి సంచలనం రేపారు.

''ఒకవేళ యుద్ధం వస్తే మేం సరిహద్దుల్లో ఉండి శత్రువులతో పోరాడేందుకు సిద్ధం. దేశం కోసం చేసే యుద్ధంలో ఒకవేళ మేం మరణిస్తే మమ్మల్ని అమరులుగా గుర్తించండి...యుద్ధం చేసి ప్రాణాలతో బయటపడితే జైలు అధికారులకు ఎలాంటి ఇబ్బంది కలిగించకుండా మేం మళ్లీ నాలుగుగోడల మధ్య జైలుకు వస్తాం'' అని గోపాల్ గంజ్ జైలు ఖైదీలు ప్రధానికి రాసిన లేఖలో పేర్కొన్నారు. ఈ లేఖపై 250 మంది ఖైదీలు సంతకం చేశారు.

అగర్ బత్తుల తయారీ, పండ్లు, కూరగాయలు పండిస్తూ ఖైదీలు నెలకు ఒక్కొక్కరు మూడువేల రూపాయల దాకా సంపాదిస్తున్నారని జైలు సూపరింటెండెంట్ పేర్కొన్నారు. తమ సంపాదన నుంచి అమర జవాన్ల కుటుంబాలకు సాయం అందించారని జైలు సూపరింటెండెంట్ వివరించారు. ఖైదీల ఔదార్యాన్ని జైలు అధికారులు అభినందించారు."

"అరె... ఖైదీలుగా ఉండి కూడా తమ ఔదార్యాన్ని భలే చూపించారురా... మనం కూడా నిన్న రాత్రి పుల్వామా దాడిలో అమరులైన సైనికుల కోసం కొవ్వొత్తులతో ప్రదర్శన చేశాం. కానీ మనం కూడా ఆ సైనికులకు ఏదైనా చెయ్యాలిరా... రేపు మన పీడీ సార్ తో మాట్లాడుదాం"

ఇంతలో వాళ్ళు దిగవలసిన ప్రాంతం వచ్చింది. ఆతర్వాత మరో రెండు స్టాపులకి బస్సు దాదాపుగా ఖాళీ అయిపోయింది.

రాఘవరావు మాస్టారు నిత్య ప్రయాణికుడు కావడంతో డ్రైవరు, కండక్టర్ కూడా స్నేహితులయ్యారు. తర్వాత స్టేజి వరకు ఎక్కే, దిగే ప్రయాణికులు లేకపోవడంతో ముగ్గురు మాటల్లో పడ్డారు.

"మాస్టారూ... ఇందాక పిల్లల మాటలు నేను కూడా విన్నానండి. ఏదో ఒకటి చెయ్యలనిపిస్తోంది మాస్టారు... మూడురోజులనుంచి మనసులో ఏదో తెలియని గుబులుగా అనిపిస్తోంది" అన్నారు కండక్టర్ వివేక్..

"అవును మాస్టారూ... ఈ కొవ్వొత్తుల ర్యాలీలు...శాంతి ప్రదర్శనలు వాళ్ళ మీద అభిమానాన్ని తెలియజేస్తాయే తప్పా మనం కూడా ఏదో ఒకటి చెయ్యాలి సర్." అన్నారు డ్రైవరు రాజు. రోడ్డు మీద నుంచి దృష్టి మరల్చకుండానే...

"మీరిద్దరూ అన్నది నిజమే...కానీ ఇలాంటి ఉపద్రవాలు వచ్చినప్పుడు స్పందించడం కాదు. మొదటినుండి మనలో దేశభక్తి, దైవభక్తి ఉండాలి. ఇవి రెండూ ఉన్నవాళ్లు నీటి నిజాయితీలతో ఉండగలుగుతారు. తమ వృత్తిధర్మాన్ని బాధ్యతగా నిర్వహిచగలుగుతారు. ముఖ్యంగా యువత చదువుకున్నా, చదువుకోకపోయినా ఏదైనా పనికొచ్చే వ్యాపకంలో ఉండాలి. లేదంటే అలాంటి యువకులందర్ని ఆ మతోన్మాదులు తీసుకువెళ్లి, జిహాద్ పేరు చెప్పి మానవబాంబులు గా తయారు చేస్తున్నారు. తాము చనిపోయాక తమ కుటుంబాన్ని వాళ్ళు ఆదుకుంటారు అనుకుంటారు, కానీ అస్సలు వాళ్ళని పట్టించుకోరు. అందుచేత ప్రతి ఒక్క యువకునికి తప్పని సరిగా ఏదో ఒక పనిలో నైపుణ్య శిక్షణ నిర్బంధం చెయ్యాలి. అలాగే అనవసర వినియోగాలు, విలాసాలు కూడా తగ్గాలి" అన్నారు రాఘవరావు

"నిజమే మాస్టారు... ఖాళీగా ఉన్న కుర్రాళ్ళు చేసే అల్లరి పనులు, పోకిరి చేష్టలు చూస్తున్నాం. మాకు తెలిసిన వారిలో ఎవరైనా ఖాళీగా ఉండే కుర్రాళ్ళు కనిపిస్తే ఇకపై మాకు తోచిన పని వాళ్లకు అప్పగించి, వాళ్ళ ఆలోచనల్లో కూడా మార్పు వచ్చేలా చూస్తాం"

"సరే... నేను దిగే సమయం అయ్యింది, రేపు కలుద్దాం" చెప్పి, రాఘవరావు దిగిపోయేరు. తాత్కాలికంగా స్కూల్ విషయం మర్చిపోయారు.

మర్నాడు స్కూల్ కి రాగానే రాఘవరావు రవికి కబురు పెట్టేరు. రవి వచ్చాడు, కానీ ముభావంగా ఉన్నాడు. మాస్టారు తన సహజ సౌమ్య పద్ధతిలో రవిని దగ్గర కూర్చోపెట్టుకున్నారు. రవి తలదించుకుని కూర్చున్నాడు.

"ఉదయం ఏం తిన్నావు?"

"మౌనం"

"తినలేదా"

"మళ్ళీ మౌనం"

"ఇలా చూడు రవీ, నువ్వేమైనా తప్పు చేసావా?"

రోషంగా తలపైకెత్తాడు రవి. "నేనే తప్పు చెయ్యలేదు మాస్టారు"

"మరి ఎందుకు తలదించుకున్నావు? నువ్వు మొన్నటి నుండి

భోజనం చేయలేదని మీ స్నేహితులు చెప్తున్నారు. చూదు ముఖం ఎలా పీక్కుపోయిందో..."

"తినాలనిపించలేదు సర్"

"ఎందుకు?"

మాటల్లో రవి నుంచి విషయం మొత్తం సేకరించారు మాస్టారు. మొదట హృదయం భారమైంది. తర్వాత ఆ సమస్యకు తగిన పరిష్కారం చూపిస్తానని రవికి మాట ఇచ్చి, ముఖం కడుక్కోమని చెప్పి, టిఫిన్ తినిపించారు. తరగతికి వెళ్ళమన్నారు.

ప్రధానోపాధ్యాయుని అనుమతితో ఉదయం స్వల్ప విరామానంతరం పిల్లలందరిని సమావేశపరచారు. మిగిలిన ఉపాధ్యాయులు కూడా సమావేశం ఎందుకో తెలియకపోయినా విషయం మరికాసేపట్లో తెలుస్తుంది కదా అని వచ్చి కూర్చున్నారు.

ప్రధానోపాధ్యాయుడు లేచి, "ఇప్పుడు అత్యవసరంగా పిల్లలతో ఈ సమావేశం ఏర్పాటు చేయడానికి గల కారణం ఏమిటో మన లెక్కలమాస్టారు చెపుతారు" అని కూర్చున్నారు.

రాఘవరావు లేచి విద్యార్థులందరి వైపు చూసి, "ముందుగా ఈ సమావేశానికి అంగీకరించిన ప్రధానోపాధ్యాయులు వారికి నా ధన్యవాదాలు. పెద్దమనసుతో విచ్చేసిన ఇతర ఉపాధ్యాయులకు నా ధన్యవాదాలు. విషయ గోప్యతకు నన్ను మన్నించాలి. విషయంలోకి వస్తే.. మొన్న 14 వ తేదీన కాశ్మీర్ లో జరిగిన ఉగ్రదాడిలో 46 మంది సైనికులు మరణించడం మన అందరికి తెలిసిందే. ఆ మర్నాడు మన పాఠశాల ప్రార్థనా సమయంలో వారందరి ఆత్మశాంతి కోసం రెండు నిమిషాలు మౌనం కూడా పాటించాము. అందరూ ఆవిషయానికి చాలా బాధపడ్డాము. దేశవ్యాప్తంగా ఉగ్రవాదులకు వ్యతిరేకంగా, సైనికులకు ఆత్మస్థైర్యం కలిగేలా అనేక ప్రదర్శనలు జరిగాయి, జరుగుతున్నాయి. మొదటగా ఇలాంటి ఆత్మాహుతి దాడులు ఎందుకు జరుగుతాయో, అరికట్టాలంటే ఏం చేయాలో, దేశభద్రత కోసం యువకులైన మీరు ఏం చెయ్యాలో చెప్తాను. ఉగ్రవాదులను తయారుచేసే మతోన్మాద సంస్థలు కొన్ని ఉన్నాయి. ఆ సంస్థల సభ్యులు గ్రామాలలో, నగరాలలో ఖాళీగా తిరిగే యువకులను కలిసి విదేశాలలో ఉద్యోగం లేదా డబ్బు ఎర జూపి తమ సంస్థ వైపు ఆకర్షితులను చేస్తారు. వారికి ఆత్మాహుతి దాడి చేయడం వలన పాపం రాదని, పైగా ఆత్మాహుతి సభ్యుల కుటుంబాన్ని సంస్థ చూసుకుంటుందని నమ్మిస్తారు. తాము మరణించినా తమ కుటుంబం బాగు పడుతుందని ఆ యువకులు భావిస్తారు. కానీ ఆత్మాహుతి దాడిలో మరణించిన వారి కుటుంబాలను ఆ తర్వాత పట్టించుకోరు. కాబట్టి యువకులైన మీరు సమాజ ఉపయోగ కార్యక్రమాలలో చురుకుగా ఉండాలి. చదువు పూర్తి అయ్యాక, ఉద్యోగం లేదా స్వయం ఉపాధి పనులు చేసుకోవాలి. వ్యసనాలు, చెడు మార్గం నడిపించే సావాసాలు, విడిచిపెట్టాలి. నీతి నిజాయితీ లతో, బాధ్యతగా జీవించాలి.

వివేకానందుడు చెప్పినట్లు ఇనుపకండలు, ఉక్కునరాలు ఉన్న యువకులు ఈ దేశానికి అవసరం. మీరంతాఆటలు ఆడి, వ్యాయామం, పరుగు, ప్రాక్టీసు చేసి దేహదారుఢ్యం పెంచుకోవాలి. చదువు పూర్తి చేసుకుని సైన్యంలో చేరండి. సైన్యంలో చేరడానికి నేరుగా అవకాశం లేనివాళ్ళు అనేక వృత్తుల ద్వారా సైన్యానికి సహాయం చేయవచ్చు.

ఇక చివరిగా ఒక చిన్న సంఘటన చెప్పి ముగిస్తాను. మన పాఠశాలలో 8 వ తరగతి చదివే విద్యార్థి రవి మీకందరకు తెలుసు కదా... రవి, ఇలారా... ఈ రవి చిన్నమనసు ఆ సంఘటనకు ఎంతగా చలించిపోయిందంటే తన కుటుంబంతో సర్కస్ చూడడానికి వెళ్లకుండా ఆ మొత్తాన్ని ఈ సైనికుల కుటుంబాలకు ఖర్చు చేద్దామనుకున్నాడు. కానీ ఆ విషయం చెప్తే చిన్నపిల్లాడివి నీకేం తెలుసు అని వేళాకోళం చేస్తారని భయపడ్డాడు. వాళ్ళకి ఏ సహాయం చేయలేకపోతున్నానని రెండు రోజులై భోజనం మానేసి సత్యాగ్రహం చేస్తున్నాడు. ఈరోజు వాళ్ళ నాన్నగారితో చెప్పి ఒప్పించాను. పట్టుదల మంచిదే. అది మంచిపనుల్లో, మీ చదువుల్లో చూపించండి. చక్కగా చదువుకున్ననాడు మనసు పెడతోవలను పట్టదు. స్పర్థయా వర్థతే విద్యా. కనుక మీరందరు చదవండి, తినండి, ఆడండి, ఎదగండి. రవీ, నీ డబ్బులు ఇలా తీసుకురా... నీ డబ్బులకు మరికొన్ని డబ్బులు కలిపి సైనిక నిధికి జమచేద్దాం. నా వంతుగా రెండువేల రూపాయలు ఇస్తున్నాను. ఈ ప్రసంగం ఇంతటితో ముగిస్తున్నాను. రవిని పాఠశాల తరపున అభినందిస్తున్నాను."

ఆ వెంటనే మరికొందరు ఉపాధ్యాయులు, విద్యార్థులు కూడా చేతనైనంత మొత్తాలు ఇచ్చారు. మరికొందరు మధ్యాహ్నం భోజన విరామంలో తీసుకువస్తామని చెప్పేరు. దేశం లో ఉన్న ప్రజలందరూ హాయిగా జీవిస్తున్నారు అంటే సరిహద్దుల్లో కాపలా కాస్తున్న సైన్యం చలువే. కుటుంబాలకు దూరంగా, ప్రతికూల వాతావరణ పరిస్థితులలో అనుక్షణం కాపలా కాసే వారికి ఏమిచ్చినా ఋణం తీర్చుకోలేము.

సరిహద్దుల్లో సైనికుడు, మడి హద్దుల్లో కర్షకుడు కష్టపడితేనే మిగిలిన ప్రజలందరు హాయిగా ఉండేది. జై జవాన్, జై కిసాన్.

ఎప్పటిలా బూరుగుపూలు తమ పరిమళాన్ని పంచుతూనే ఉన్నాయి. ఈసారి ఆ పరిమళం మనసునిండా కూడా అలుముకుంది రాఘవరావు మాస్టారికి. ***

# TFAS Deepavali 2019 Cultural Competition Winners

| Category | Age Group | Prize | Winner Name |
|---|---|---|---|
| Solo Classical Dance (Kuchipudi) | Junior | First Prize | Saveena Boga |
| | | Second Prize | Pranavi Thimmisetty |
| | | Third Prize | Aniktha Prem |
| | Senior | First Prize | Sameera Boga |
| | | Second Prize | Amrutha Vadlamani |
| Solo Classical Dance (Bharatanatyam) | Junior | First Prize | Shruthika Srijeyaraman |
| | Senior | First Prize | Bhavya Kilambi |
| | | Second Prize | Pragnay Madiraju |
| | | Second Prize | Mnurmikhi Ravishankar |
| Solo Non Classical Dance | Junior | First Prize | Ankitha Prem |
| | | Second Prize | Saveena Boga |
| | | Third Prize | Moukthika Mudigati |
| | | Special Prize | Saanvi Mushti |
| | Senior | First Prize | Sameera Boga |
| | | Second Prize | Saranya Duddagi |
| | | Third Prize | Bhavagna Daggumati |
| | Adult | First Prize | Usha Prathapa |
| Group Classical | | First Prize | Shiva Jyothi Dance Academy |
| | | Second Prize | Nritya Madhavi |
| | | Third Prize | Nritya Madhavi |
| Group Non Classical | | First Prize | Nritya Madhavi |
| | | Second Prize | Hum Saath Hai Group |
| | | Third Prize | Nritya Madhavi |
| | Adult | First Prize | Usha Sree Parathapa |
| Solo Classical Singing | Junior | First Prize | Sanjana Murali |
| | | Second Prize | Chinmay Mantravadi |
| | | Third Prize | Abhiram Tammana |
| | | Third Prize | Saranya Sandugu |
| | Senior | First Prize | Bhavya Kilambi |
| | | Second Prize | Swathi Pampati |
| | | Third Prize | Karunya Chittamuri |
| | Adult | First Prize | Sasi Harsha |
| | | Second Prize | Divya Poolla |
| Solo Non Classical Singing | Junior | First Prize | Abhiram Tammana |
| | | Second Prize | Ashmitha Tippabhotla |
| | | Third Prize | Rishika Goteti |
| | Senior | First Prize | Srija Boddu |
| | | Second Prize | Navya Korala |
| | | Third Prize | Pragnya Adapa |
| | Adult | First Prize | Chaitra Arni |
| | | Second Prize | Svikriti Kasichainula |
| | | Third Prize | Rama Prabhala |
| | | Third Prize | Anjani Nandibhotla |

## TFAS Deepavali 2019 Sports Competitions Winners

| Sport | Category | Prize | Winner |
|---|---|---|---|
| TENNIS | Boys Singles | First Prize | RUSHIL KAMARAJU |
| | Men's Singles | First Prize | RAJU GOTTUMUKKALA |
| | | Second Prize | SURESH KOMMARAJU |
| | Men's Doubles | First Prize | SATISHKUMAR INGERSEL & ELANGO |
| | | Second Prize | VIJAY NARA & |
| | Senior Doubles | First Prize | RAJA KARNAM & |
| BADMINTON | Doubles | First Prize | SAINATH REDDY & |
| | | Second Prize | PRAKASH K & |
| | | Third Prize | DASARATH RAMA REDDY & SATISH KUMAR INGERSEL |
| | Singles | First Prize | APPARAO PATTEPARAPU |
| | | Second Prize | SAINATHA REDDY |
| | | Third Prize | VARAPRASAD BHATTA |

## TFAS Deepavali 2019 Cultural Competitions Winners

| Category | Type | Prize | Winner |
|---|---|---|---|
| Insturmental (Violin) | Violin | First Prize | Aishwarya Gadicherla |
| | | Second Prize | Sruthi Kotamraju |
| | Tabla | First Prize | Sai Prabhav Neelam |
| Monologue | | First Prize | Sravanthi Manikonda |
| | | Second Prize | Pranav Manikonda |

# జాబిలికూన!,

## దమయంతి

"అమ్మాయి కి ఏం పేరు పెడదాం?" - మురిపెంగా అడిగింది భర్తని శైలజ.

చేతుల్లో ని బిడ్డని చూస్తూ అన్నాడు వెంకట్. "ఏ పేరైనా నాకు ఓకే."

"అదేమిటి అలా అంటారు? మీకిష్టమైన పేరంటూ ఏమీ వుండదా? పోనీ, గూగుల్ వెదికి లిస్టులు చూసి, మీ ఫ్రెండ్స్ ని అడిగి చూడొచ్చు కదా?"

'అంత టైం వుండదు సంధ్యా నాకు. అయినా.. పేరులో ఏముంది చెప్పు? ఏదోఒకటి నువ్వే సెలెక్ట్ చేసేయ్.." అన్నాడు పాపాయిని ఆమె చేతికి తిరిగి ఇచ్చేస్తూ..

'హూ..' నిట్టూర్చింది.

పసిదాన్ని, ఉయ్యాల్లో పడుకోబెట్టి, బ్లాంకెట్ కప్పి, వెను తిరిగి చూసే సరికి అప్పటికే లేచి నిలబడుతూ కనిపించాడు భర్త. చేతి వాచీ వంక చూసుకుంటూ "ఇక వెళ్తాను శైలూ! ఇంటికెళ్ళి హోం వర్క్ చేసుకోవాలి. రేపు అమెరికానించి క్లైంట్ వస్తున్నాడు.." చెప్పాడు.

ఆమె ఏం మాట్లాడలేదు. పెదవి నొక్కుకుంటూ, తన వైపు చూస్తున్న భార్య చూపులకి అర్థం తెలీని వాడిలా నవ్వాడు. ఆమె ఆరోగ్యం జాగ్రత్త అని మరో సారి చెప్పి బయల్దేరాడు.

గుమ్మం వరకు వెళ్ళి, అతన్ని పంపి, లోపలకొస్తున్న కూతురితో అంది తల్లి. "అదేమిటీ! అప్పుడే వెళ్ళిపోతున్నాడు." అంటూ ఆశ్చర్య పోయింది. ఆవిడ చేతిలోఉప్మా పళ్లెం ! జీడిపప్పులు పోసి చేసిన సేమియా ఉప్మా పళ్లెం లోంచి ఘుమఘుమల పొగలు గక్కుతున్నాయి.

"ఆయన బదులు నేను తింటా, ఇటివ్వు.." అంటూ తల్లి చేతిలో ప్లేట్ అందుకుంది. అది కోపమో, తన అసహాయతో ఆమెకి అర్థం కానట్టున్న కూతుర్ని చూసి, మళ్లా ఆవిడే అంది. "పోన్లేవే. ఆఫీస్ పనుందో ఏమోలే.." సర్ది చెప్పి లోపలికెళ్లిపోయిందావిడ.

శైలజ మాత్రం భర్త గురించి ఆలోచిస్తూ ఉండి పోయింది.

నిజానికి వెంకట్ చెడ్డ వాడు కాదు. చాటుగా అయినా, చెప్పుకునేంత సంగతులేవీ వుండవు. అలా అని, మనసుకి సంతృప్తి గానూ అనిపించదు. ఆశించినంత స్పందన వుండదు మనిషిలో. అదే వెలితి ఆ భార్యకి. వ్యక్తీ కరణ లేకపోతే అదెంతటి ప్రేమ అయినా, వానై కురవక మిగిలిపోయే మబ్బులాంటిదని ఆమె అభిప్రాయం.

అయితే, ఆమె ని మరీ చీకట్లోకి నెట్టే నైరాశ్యం కాదు ఆ అసంతృప్తి.

పెళ్ళైన ఈ నాలుగేళ్లల్లో ఎప్పుడూ ఆమెని ఒక్క మాట తూలింది లేదు. పైపెచ్చు అతనిపైన తనే విసుక్కునేది. కసుక్కునేది. 'నీకు నా మీద ప్రేమ లేదు. ముచ్చట లేదు మురిపెం లేదు..' అంటూ మాటలతో సాధించేది. అన్నిటికీ చిరునవ్వే నవ్వేవాడు. మరీ కోపం వస్తే మాత్రం 'నాకు కొంచెం బ్రేక్ కావాలి...'. అంటూ బయటకెళ్లి చాలా సేపటికి తిరిగొచ్చేవాడు. ఆ రావడం కూడా నవ్వుతూనే!

ఒక్కసారి మాత్రం అతను చాలా సీరియస్ అయ్యాడు భార్య మాటలకి. వెంటనే ఆమెని లేక్ రెస్టారెంట్ కి తీసుకెళ్లి పరిస్థితి వివరిస్తూ, 'తను ఇంతే..' అని తేల్చేసాడు.

వెంకట్ - ఉద్యోగం తర్వాతే ఊపిరి ముఖ్యం అని భావించే మనిషి. అతనొక చిన్న సాఫ్ట్ వేర్ స్టార్టప్ కంపెనీ లో డేటా ఎంట్రీ జాబ్ లో చేరాడు. ఆ స్థాయి నించి టీం లీడర్ గా, మేనేజర్ గా ఎలా ఎదుగుతూ వచ్చిందీ చెప్పాడు. జాబ్ చేసుకుంటూ సాయం కాలాలు, శని ఆదివారాలు కంప్యూటర్ కోర్సుల్లో చేరి, ఎంత కష్టపడిందీ చెప్పాడు. రోజు రోజుకీ పోటీ పెరిగిపోతున్న సాఫ్ట్ వేర్ రంగంలో తాను అహర్నిశాలూ ఎలెర్ట్ గా వుండి, కష్టపడితేనే తప్ప తన స్థాయిని దక్కించుకోవడం కష్టమని చెప్పాడు. తన నించి ఇంతకు మించి ఏమీ ఆశించొద్దనీ, వున్న సమయాన్నంతా కుటుంబం తోనే గడుపుతానని ప్రామిస్ చేసాడు.

ఆమె ఇక ఏం మాట్లాడలేకపోయింది.

ఆ తర్వాత కాలం లో ఆమె ఎప్పుడూ అతన్ని ఇక విసిగించ లేదు.

ఆమె ఇంటికి కావాల్సినవి అడుగుతుంది. అతను సమకూరుస్తాడు. ఆమె జోక్స్ వేసి నవ్విస్తుంది. నవ్వుతాడు. వంట చేసి వడ్డిస్తుంది తిని, ఆనందిస్తాడు. కబుర్లు చెబుతుంది, వింటూ నిద్రలోకి జారిపోతాడు.

ఆమె అలా అతన్ని అనుసరిస్తూ వుంటే అతను మరింత ఉత్సాహంగా వుండటాన్ని పసిగట్టింది. ఆ ఆనందంలో కూడా అతను ఆఫీస్ పని మీదే దృష్టిని కేంద్రీకరించేవాడు.

కానీ పిల్ల పుట్టాకైనా అతని హృదయ స్పర్శ లో స్పందనా ధోరణి లో మార్పు వస్తుందనుకుంది కానీ...ఊహు, రానే లేదు.

కానీ, పసిదాన్ని చూడంగానే అతని కళ్ళల్లో కనిపించిన మెరుపు మాత్రం ఆమె హృదయ భరిణ లో నక్షత్రం లా దాచుకుంది.

***

"ఏమండీ, ఇవాళ టెంత్ క్లాస్ రిజల్ట్స్."

"రానీయ్.. కంగారెందుకు?"

"మీకేమీ టెన్షన్ గా లేదా?"

"అస్సలు లేదు.."

"కానీ అది టెన్స్ ఫీలౌతోంది.."

"నేనేం చేయగల్ను?' అనబోయి ఆగి, సాయంత్రం వస్తూ వస్తూ, ఐస్క్రీం తీసుకొస్తా. ఓకే డియర్.. బై.."

'హూ… ' నిట్టూర్చింది అలవాటుగా.

*****

"ఏమండీ, ఎం సెట్ రిజల్ట్స్ వచ్చేసాయి…'

'గుడ్ గుడ్… ఎంత రాంక్..' అడిగాడు.

చెప్పింది.

"ఓకే. నాట్ బాడ్. మంచి కాలేజ్ ట్రై చేద్దాం. నువ్వేం కంగారు పడకు.. సరేనా.."

"ఎప్పుడొస్తారు?"

"త్వరగానే వచ్చేస్తా. ఇవాళ బయటకి తీసికెళ్ళలేను శైలూ. ఆదివారం వెళ్దాం…."

ఆమె జవాబు చెప్పేలోపు అతను ఫోన్ ఆగిపోయింది.

***

గబ గబా బ్రేక్ ఫాస్ట్ ముగించే హడావుడిలో వున్న భర్తతో "మీతొ అర్జెంట్ గా ఒక ముఖ్య విషయం మాట్లాడాలి.." అంది శైలజ. ఆమె ముఖం లో నవ్వు లేదు. ఎంతో గంభీరం గా కనిపిస్తోంది.

"ఏమిటీ" అన్నట్టు చూసాడు.

ఆమె ఎలా చెప్పాలా అన్నట్టు చెప్పింది. "నేహ ప్రేమలో పడింది."

అదిరిపడతాడనుకుంది. కానీ 'ఔనా?' అన్నట్టు చూసాడు భార్య వైపు.

భర్త హావభావాల తో సంబంధం లేని దానిలా చెప్ప సాగింది.

"ఎవరని అడిగా. అన్నీ చెప్పింది. మన వాడు కాదు. మన రాష్ట్రమూ కాదు. ముక్కూ మొహం తెలీని వాడితో ప్రేమేమిటీ.. అని చివాట్లేసా. ఏడుస్తూ కాలేజ్ కి పోనని గడియేసుకు పడుకుంది రెండురోజులైంది. మాటా లేదు మంచీ లేదు. ఇక నేను దాంతో మాట్లాడను. మీరైనా దానికి బుద్ధి చెప్పండి. అది చేస్తున్న వెధవ పని మంచిది కాదని, చెప్పిన మాట వినకపోతే జీవితం నాశనమైపోతుందని."

ముఖమంతా ఎర్రబడి పోయిన భార్య ముఖం లోకి చూసి, అంతలోనే సీరియస్ అయిపోతూ. " నేను చెప్పను. చెప్పక్కర్లేదు కూడా.." అన్నాడు ఖచ్చితమైన స్వరంతో.

అతని జవాబుకు నివ్వెరపోయింది. తనని వారం రోజులుగా మనసుని అట్టుడికిస్తున్న సమస్య ఈ యనకి ఇంత తేలిక గా వుందా? వొళ్ళు మండిపోయింది.. "అసలు మేకేమీ పట్టదా.." అని పూర్తిచేసేలోపే అతనే అందుకుని చెప్పాడు. 'ఇలాటి వి తల్లి సముదాయించి చెప్పడమే సబబు గా వుంటుంది.. నీకు బాగా తెలుసు నేహ మనసుని ఎలా మళ్ళించాలో! ఒక వేళ నీకు తెలియకపోయినా తెలుసుకునైనా ఫలితాన్ని సాధించగల సామర్థ్యం వుంది. నీ మీద నాకా నమ్మకమూ వుంది. సరే, ఇవాళ జపాన్ నించి మా కంపెనీ డైరెక్టర్ వస్తోంది… ఎయిర్ పోర్ట్ కి వెళ్ళి రిసీవ్ చేసుకుని హోటెల్ లో దింపి రావాలి. లేట్ అవుతుంది. ఎదురుచూడకు. దెనీ కీ వర్రీ అవకు.. నేహ నీ మాట వింటుంది.. ఓకే, బై.." అంటూ, జాకెట్ భుజానేసుకుని కారు వైపు పరుగులు దీసుకుంటూ వెళ్ళిపోయాడు.

ఆమె కళ్ళింతింత చేసుకుని చూస్తుండిపోయింది.

అంతలో నెమ్మదిగా గది తలుపు తెరుచుకుని నేహ బయటకొచ్చింది. వచ్చి సోఫా లో కుర్చున్న తల్లి వొళ్ళో తలపెట్టుకుని పడుకుంది.

వారం రోజుల తల్లీ కూతుళ్ళ మధ్య యుద్ధం తర్వాత… నువ్వెంత అంటే నువ్వెంత అనీ, నా జీవితం నా ఇష్టం అంటూ మాటలతో ఠారెత్తించిన కూతురు… పదేళ్ల పసిపాపలా అలా వొళ్ళో వాలంగానే ఆ తల్లి హృదయం పరవశించిపోయింది.

ఆమెని అమాంతం గుండెలకి హత్తుకుని నుదుటిమీద ముద్దుల వర్షం కురిపిస్తుంటే… 'సారీ మమ్మీ… ఇంకెప్పుడూ నిన్ను హర్ట్ చేయను.. ప్రామిస్..' అంటూ ఏడుస్తూ గొణిగింది.

వింటున్న ఆమెకి ఇది కలా నిజమా అని సంభ్రమాశ్చర్యాలతో కళ్ళంట నీళ్ళొచ్చాయి.

అదే సందర్భంగా కూతురికి తానే పెద్ద స్నేహితురాలినన్నట్టు, లాలిస్తూ బుజ్జగిస్తూ పొగుడుతూ మంచి చెడులు బోధిస్తుంటే.. నేహ మౌనం గా వింటూ 'ఉ..' లు కొడుతూ వుండిపోయింది.

చివరికి తల్లి మాట జవ దాటనని ఒట్టేయించుకోవడం తో

'హమ్మయ్యా…' అని ఊపిరి పీల్చుకుంది శైలజ.

జరిగిందంతా పూస గుచ్చినట్టు చెబుదామని ఫోన్ చేసింది.. కానీ అతను మీటింగ్ లొ వున్నాడంటూ ప్రకటించింది సెల్.

మరో సారి నిట్టూర్చక తప్పలేదామెకి.

*****

నేహకి పెళ్ళి సంబంధం కుదిరింది. చదువూ, సంస్కారాలతో బాటు తమ కంటే రెండు మెట్లు ఎత్తులో వున్న గొప్పింటి సంబంధం కావాలని తపించింది శైలజ. అందుకోసం కళ్లల్లో వొత్తులేసుకుని మరీ వెదికింది. పెళ్లి చూపుల దగ్గర్నించీ తాంబూలాల వరకూ అంతా తానే అయి వ్యవహరించింది. ఆ తర్వాతి ఘట్టం పెళ్ళి ఏర్పాట్లల్లో మాత్రం ఊపిరాడక తలమునకలైపోతోంది. 'ఈయనేం పట్టించుకోరు. అన్నీ ఒక్కదాన్నే చేసుకోవాలి వదినా..' అంటూ అప్పుడే పెద్ద రికపు మాటలు మాట్లాడేస్తోంది.

"ఏమండీ, ఇదిగో మారేజ్ హాల్స్ చూసొచ్చా? వాట్సప్ లో ఫోటోలు పంపుతున్నా, ఏది బావుందో, చూసి వెంటనే చెప్పండి.."

పదిహేను నిముషాల్లో జవాబు సిద్ధం. "పారడైజ్ సర్కిల్ లో ది బావుంది. ఓకే చేసి అడ్వాన్స్ కట్టేసేయి.." ఆర్డర్ పాస్ చేసేవాడు.

"మీరు వచ్చి చూడరా?"

"అవసరం లేదు డియర్. నువ్వు చూసావు కదా.. చాలు."

హూ..!

"ఇదిగోండీ, పెళ్ళి కూతురి చీరలషాపింగ్ కి వెళ్ళాలి మీరూ రావాల్సిందే.."

'అబ్బా! ప్లీజ్ లీవ్ మీ డియర్.. నీ కేది నచ్చితే అదే నాకూ నచ్చుతుందని తెలుసు కదా.. నీకూ

"హూ.. మీ వాళ్ళ కి పెట్టే బట్టలు..?"

"అవన్నీ నా కంటే నీకే బాగా తెలుసురా.."

"ఓహో, రా అని కూడా అనడం వచ్చా మీకు? అదిసరే, బంగారం రేటు వున్నట్టుండి పదిహేను వేలకు పెరిగింది... ముప్పై తులాలు అన్నాము కానీ.."

"డోంట్ వర్రీ.. లోన్ పెడతానులే.."

"వంట వాళ్లని మాట్లాడా... మెనూ పంపుతున్నా.."

"వండ్రఫుల్.."

"కళ్యాణ మంటంపం ఈ డిజైన్ ని ఫైనలైజ్ చేసా..

'బ్యూటిఫుల్"

"పెళ్ళి యెల్లుండి.. మీరెప్పుడు వస్తారు సార్?"

"యూ సిల్లీ... రేపట్నించి వారం రోజులు సెలవు పెట్టేసా డియర్.."

"చాలా సంతోషమండి. మీ అమ్మాయి పెళ్ళికి వారం సెలవంటే... ఎంత గొప్ప ఘనకార్యం చేస్తున్నారో..! పనిలో పనిగా పెళ్ళి లో మీకు సన్మాన సభ ఏర్పాటు చేసేస్తా.."

మెసేజ్ కొట్టింది, కినికుగా.

జవాబుగా - 'నోరంతా తెరుచుకుని నాలిక వెళ్ళ బెట్టి నవ్వుతున్న ఇమేజ్ ' కనిపించింది స్క్రీన్ మీద.

'హూ...' మనసులోనే నిట్టూర్చింది. కానీ ఇదని చెప్పలేని ఒక చిన్న అసంతృప్తి ఆమెని అమితం గా బాధిస్తోంది. ఒక్క గానొక్క ఆడపిల్ల వివాహం ఎలా జరుగుతుందా అన్న దిగులు కంటే కూడా, అమ్మాయి వెళ్ళిపోయాక బోసిపోయే ఇంటిని తలచుకుంటే గుండె గుభేల్ మంటోంది. కడుపులోంచి దుఃఖం తన్నుకొస్తోంది.

తన అనుకున్న వారి తో చెప్పుకుని కౌగిలించుకుని ఏడ్వాలని వుంది..

నేహ తో పంచుకోవాడానికి మనసు రావడం లేదు. పెళ్ళి కళ తో కళకళ లాడుతున్న ఆమె ఆనందాన్ని భగ్నం కాకూడదు.

భర్తతో చెప్పుకుని భోరుమనాలనుంది.. ఊహు. ఆ రాతి గుండె కి అస్సలు అర్థం కాదు వేస్ట్ అనుకుంది కసిగా.

అంతలో ఫోన్ డిజైనర్ నించి. పెళ్ళి చీర రెడీ అని.

వస్తున్నా.. "అంటూ వెంటనే కదిలింది.. ఆలోచనల తుట్టని వదిలేసి.

***

పెళ్లైపోయింది. రెసిప్షనూ అయిపోయింది..

చుట్టాలూ, బంధువులూ, దగ్గరి వాళ్ళు దూరపు వాళ్ళు అందరూ - ఎక్కడి వాళ్లక్కడ సర్దుకున్నారు.

ఇల్లంతా సంక్రాంతి మర్నాటి వాకిలి లా వుంది.

అమ్మాయి ఇంకొంచెం సేపట్లో అత్తారింటికి బయల్దేరుతోంది. ఇంట్లోంచి లక్ష్మీ దేవి అడుగు తీసి వెళ్ళిపోతోంది... కాదు తన లోంచి ప్రాణం వెళ్ళిపోతోందేమో.. రేపట్నించీ 'మమ్మీ మమ్మీ 'అంటూ వెనకెనకే వినిపించే పిలుపులు వుండవు కదూ..? ఎంత నిభాయించుకుందామన్నా ఆమెకి దుఃఖం ఆగడం లేదు.

ఈయనకసలు ఇలాటి ఫీలింగ్సే వుండవా... ఎక్కడా ఈయన? చుట్టూ చూసింది.

ఎక్కడ కనిపించలేదు. నేహా కూడా కనిపించడం లేదు? నేహ గది లోకి వెళ్తూ మూసున్న తలుపును నెట్టబోయి ఆగిపోయింది.. లోపల్నించి భర్త గొంతు వినపడటం తో.

"అత్త వారింటికెళ్తుంటె, తండ్రులందరూ కూతుళ్లకి ఏం చెబుతారో నాకు తెలీదు నేహా.. కానీ నేను నీకు ఇప్పుడు తండ్రిగా కాదు ఒక స్నేహితుడిగా చెప్పేది మాత్రం ఒకటే. నీకక్కడ ఎలాటి కష్టమొచ్చినా భరిస్తూ వుండమని చెప్పను. నీకు తెలీని మనుషులు కాబట్టి, తెలుసుకుంటూ ముందుకు వెళ్తుండాలి. ఒకవేళ నీకు అర్థం కాని పరిస్థితులు ఎదురై, ఆ ఎదురీతలో ఒంటరిగా సమస్యని పరిష్కరించుకోలేనప్పుడు ... అప్పుడు మాత్రం నీకు ఎవరూ లేరని కానీ జీవితం లోఇక మిగిలింది లేదని కానీ అనుకోవద్దు నానా! నీకెప్పటికీ ఈ నాన్న వున్నాడు. నీ కోసమే బ్రతికి వుంటాడు అన్న సంగతి మాత్రం మరచిపోవద్దు తల్లీ! ఏమిటి, ఇలా చూడు.. నా మీద ఒట్టేసి చెప్పు.. సరే అని.. నా బంగారు తల్లివి కదూ.." ఆయన అర్థిస్తున్నట్టు చేయి చాచాడు.

"డాడీ.." అంటూ ఉద్వేగంతో తండ్రిని చుట్టేసుకుని, గుండెల మీద తల ఆంచుకుని, వీడ్కోలు గా దుఃఖిస్తోంది.

"నువ్వునా ప్రాణానివి.. నీ ప్రాణాలు నావి, అమ్మవి.. అర్థమైందా.." అతని స్వరం వొణుకుతోంది.. పట్టలేని ప్రేమతో.. శకుంతలను సాగనంపుతున్న కణ్వ మహర్షిలా..

వింటున్న శైలజ తన చెవులని తాను నమ్మలేనిదై, సగం తెరిచిన తలుపులోంచి... బిడ్డను హత్తుకుని, కళ్ళు తుడుచుకుంటున్న భర్తని చూసి చలించిపోయింది.

అతను రాయి కాదు. అతని హృదయం స్పందనలేని దీ కాదు.

ఆ తండ్రి ఈ తల్లి కన్నా గొప్పవాడు. అప్పగింతలప్పుడు కూతురికి చెప్పాల్సిన అసలైన జాగ్రత్తలు చెప్పి భరోసా ఇచ్చి పంపుతున్న అసలైన తండ్రి.. కాదు.. కాదు.. హృదయాలను పదిలంగా కాపాడుకునే చందమామ వంటి వాడు.

జాబిలి కూన చుట్టూ వెన్నెల పర్వతమై నిలిచిన భర్తని చూస్తూ 'ఐ లవ్ యూ' అంది మనసారా. ****

తెలుగు టైమ్స్ పాఠశాల
Paatasala Inc., A 501 C (3) Certified, Non Profit Organisation

# అమెరికా లోని తెలుగు వారికి విజ్ఞప్తి

అమెరికాలోని తెలుగువారందరూ తమ పిల్లలకు తెలుగు భాష నేర్పించాలని ఇష్టపడుతుంటారు. అయితే కొన్ని ఇళ్ళలో ఎక్కువ, కొన్ని ఇళ్ళలో తక్కువగాను తెలుగులో మాట్లాడటం జరుగుతోంది. చాలామంది ఇళ్లలో తల్లితండ్రులు తెలుగులో మాట్లాడుతూ ఉంటే పిల్లలు ఇంగ్లీష్‌లో సమాధానమిస్తూ కనిపిస్తుంటారు. అలాంటి సందర్భాలలో తల్లితండ్రులే కొంచెం శ్రమ తీసుకుని, పట్టుబడితే పిల్లలు కూడా తెలుగులోనే మాట్లాడటం జరుగుతుంది.

ఈరోజు, 29 ఆగస్టు శ్రీ గిడుగు రామ్మూర్తి గారి పుట్టినరోజును తెలుగుభాషా దినోత్సవంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించింది. ఈ శుభదినాన అమెరికాలో ఉన్న తెలుగు పిల్లలకు తెలుగు నేర్పించే వేదికగా ఉన్న 'పాఠశాల' వారంలో ఒక రోజును తెలుగురోజుగా పరిగణించాలని నిర్ణయించింది. గురువారం రోజుని ( Thursday - Telugu day ) తెలుగు రోజుగా తీసుకుని తల్లితండ్రులు ఆ రోజున తమ పిల్లలతో తెలుగులోనే మాట్లాడాలని కోరుతున్నాము.

తెలుగు సోదరసోదరీమణులారా

వారంలో ఒకరోజు తప్పనిసరిగా ఇంట్లో, బయటా తెలుగు మాట్లాడండి!

మీ పిల్లలకు తెలుగు వచ్చేలా శ్రమించండి!

గుర్తుంచుకోండి...

ప్రతి గురువారం – తెలుగువారం

పాఠశాల

Paatasala Inc..
A 501 C(3)certified Non -profit Organisation
www.paatasala.net

**MAKE EVERY THURSDAY - A TELUGU DAY**

*An Initiative of Paatasala*






Contact me about a career that can better your financial future while helping others with theirs.

**Thevan Theivakumar**
**Executive Partner**
CLF®

**Phone:** **(732) 744-3763**
**Cell:** **(732) 319-8758**
**ntheivakuma@ft.newyorklife.com**

**New York Life Insurance Company**
379 Thornall Street
8th Floor
Edison, NJ 08837

To learn more about our awards and recognition visit: www.newyorklife.com

SMRU1694783 (Exp. 9/30/2018) EOE M/F/D/V/SO

Insure. Prepare. Retire.

**Be good at life.**

Government of School Education of AP

&

Paatasala Inc., A 501 C (3) Certified, Non Profit Organisation

సమర్పించు

## తెలుగు పలుకు

4 సంవత్సరాల తెలుగు బోధన

...ఆన్‌లైన్‌ద్వారా కూడా తెలుగులో శిక్షణ

## Register Online Today | Registrations Open!!

## Classes begin from SEPTEMBER 2019-20

### Centres
### ROBBINSVILLE | SOMERSET | NORTH BRUNSWICK

* ఎన్ఆర్ఐ తెలుగు పిల్లలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, పాఠశాల ఇంక్, యుఎస్ఎ అందిస్తున్న అపురూప కానుక
* 5 సంవత్సరాలు నిండిన పిల్లలకు క్లాస్ రూమ్ మరియు ఆన్ లైన్ ద్వారా తెలుగు బోధన
* 2వ మరియు 4వ సంవత్సరాంతంలో ఉతీర్ణులైన విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ సర్టిఫికేట్ ల ప్రదానం
* శాస్త్రీయ పద్ధతిలో రూపొందించిన సిలబస్
* ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రచురించిన పాఠ్యపుస్తకాలు

**Courses:**
TAARANGAM | PALUKU
ADUGU | PARUGU | VELUGU

**Fee $250**

Contact Details:

| RAM VEDANTHAM | KUMAR TADEPALLI | ROJA VENKAT |
|---|---|---|
| Area Director - (732) 543-4655 | Center Director - (609) 619-1790 | Center Coordinator - (732) 762-1835 |
| SOMERSET | ROBBINSVILLE | NORTH BRUNSWICK |

Registrations at
**www.paatasala.net**

మన తెలుగు.. మన పిల్లల కోసం...

paatasala4usa

# Thanks to all our Supporters/Sponsors



# Thanks to all our Media Partners